

## సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీగా శ్రీనివాస్ రాజు.. ఆయన ఎవరంటే..?

**హైదరాబాద్-నవభూమి:**కాంగ్రెస్ ప్రభుత్వం ఏపీకి చెందిన ఓ రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్‌కు కీలక పదవి కట్టబెట్టింది. సీఎం రేవంత్ రెడ్డి ప్రిన్సిపల్ సెక్రటరీగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేఎస్ శ్రీనివాస్ రాజు నియామకం అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాస్ రాజు ప్రిన్సిపల్ సెక్రటరీగా రెండేండ్ల పాటు కొనసాగనున్నారు.శ్రీనివాస్ రాజు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆఫీసర్. గతంలో టీటీడీ జేఈఓగా శ్రీనివాస్ రాజు పని చేశారు. తెలంగాణ రాష్ట్రంలో డిప్యూటేషన్‌పై రహదారులు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శిగానూ పని చేశారు. ఇక ఆంధ్రప్రదేశ్‌లో పదవీ విరమణ పొందిన ఐఏఎస్ అధికారి శ్రీనివాస్ రాజు.. తెలంగాణలో రేవంత్ రెడ్డి సీఎం కాగానే ఆయన ప్రభుత్వ సలహాదారుగా నియామకమైన విషయం తెలిసిందే. అప్పట్లో శ్రీనివాస్ రాజు.. బ్యూరోక్రాట్లకు కొత్త తలనొప్పులు తెచ్చినట్లు గుసగుసలు వినిపించాయి. మళ్లీ ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి ప్రిన్సిపల్ సెక్రటరీగా శ్రీనివాస్ రాజ్ నియామకం కావడం చర్చనీయాంశమైంది.ఆంధ్రప్రదేశ్ ఐఏఎస్ క్యాడర్‌లో 2001 బ్యాచ్‌కు చెందిన ఆయన 2011లో వైజాగ్ డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న సమయంలో టీటీడీ జేఈవోగా నియమితులయ్యారు. ఏప్రిల్ 20వ తేదీన జేఈవోగా బాధ్యతలు తీసుకుని 2019 జూన్ వరకు ప్రభుత్వాలతో సంబంధం లేకుండా ఎనిమిదేండ్ల రెండు నెలలపాటు పనిచేశారు. నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు ప్రభుత్వాల్లో జేఈవోగా విధులు నిర్వహించి, టీటీడీలో తనదైన ముద్ర వేశారు.అయితే 2019లో జగన్ ప్రభుత్వం వచ్చాక ఆయన ఇంటర్ కేడర్‌పై తెలంగాణ రాష్ట్రానికి వచ్చారు. తెలంగాణ నాలుగేండ్ల పాటు రహదారులు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శిగా విధులు నిర్వర్తించారు. 2024 మార్చి నెలతో డిప్యుటేషన్ గడువు ముగియడంతో పొడిగింపునకు క్యాట్‌ను ఆశ్రయించారు.



## సూర్యాపేట-సిరిసిల్ల నేషనల్ హైవే.. అలైన్‌మెంట్? మార్పు..?, రైతులకు నో టెన్షన్



**హైదరాబాద్-నవభూమి:** సూర్యాపేట నుండి సిద్దిపేట మీదుగా సిరిసిల్లకు వెళ్లే 365బీ జాతీయ రహదారి అలైన్‌మెంట్ మార్చడానికి నేషనల్ హైవే అథారటీ ఆఫ్ ఇండియా అధికారులు సూత్రప్రాయంగా అంగీకరించారు. రైతుల భూములను కాపాడేందుకు కొత్త మార్గాన్ని పరిశీలించడానికి వారు సానుకూలంగా స్పందించారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు రైతుల ప్రతినిధి బృందంతో కలిసి ఢిల్లీ వెళ్లి జాతీయ రహదారుల శాఖ కార్యదర్శి ఉమా శంకర్‌ను కలిశారు. రైతులు నష్టపోకుండా రాజీవ్ రహదారి, సిద్దిపేట ఔటర్ రింగ్ రోడ్డుతో అనుసంధానం చేయాలని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనను పరిశీలించిన అధికారులు పాత మార్గానికి సంబంధించిన భూసర్వేను నిలిపివేసి, కొత్త మార్గాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ మార్పుతో రైతులు తమ భూములు కోల్పోకుండా ఊరట చెందనున్నారు.కాగా, సూర్యాపేట నుండి సిద్దిపేట మీదుగా సిరిసిల్ల నిర్మించే 365బీ జాతీయ రహదారి మొత్తం పొడవు సుమారు 184 కిలోమీటర్లు. సూర్యాపేట, అరవపల్లి, ఫణిగిరి, తిరుమలగిరి, జనగాం, దుద్దెడ, సిద్దిపేట, సిరిసిల్ల మీదుగా దీనిని నిర్మించనున్నారు. జనగాం నుండి దుద్దెడ వరకు: ఈ 45.57 కిమీ విస్తరణ పనులకు కేంద్ర ప్రభుత్వం రూ.438 కోట్లు మంజూరు చేసింది. దుద్దెడ నుండి సిరిసిల్ల వరకు 54 కిమీ పొడవును రెండు ప్యాకేజీలుగా విభజించారు. ప్యాకేజీ 1 కింద దుద్దెడ నుండి మల్యాల వరకు (27 కిమీ), ప్యాకేజీ 2 కింద మల్యాల నుంచి సిరిసిల్ల వరకు (27 కిమీ) నిర్మించనున్నారు. ఈ విస్తరణ పనులకు రూ.1100 కోట్ల వ్యయం అంచనా వేయబడింది.సూర్యాపేట వద్ద %NH% 65, అరవపల్లి, వంగమర్తి సమీపంలో %NH% 365, జనగాం వద్ద %టీఎ% 163, సిరిసిల్ల వద్ద తెలంగాణ రాష్ట్ర రహదారి 11ల వద్ద ప్రధాన జంక్షన్లు నిర్మించనున్నారు. అయితే దుద్దెడ నుంచి సిరిసిల్ల వరకు హైవే విస్తరణ కోసం భూ సేకరణపై రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. వారు పచ్చని పంట పొలాలను కోల్పోతామని, సరైన పరిహారం అందడం లేదని పేర్కొంటున్నారు. అలైన్‌మెంట్ మార్పు, హైవే వెడల్పు తగ్గింపు వంటి డిమాండ్లతో వారు నిరసనలు తెలియజేస్తున్నారు. తాజాగా ఎంపీ రఘునందన్ రావు నేతృత్వంలోని రైతుల బృందం కేంద్ర అధికారులను కలవగా.. అలైన్‌మెంట్ మార్పుపై వారు సానుకూలంగా స్పందించారు.

## వీడు మామూలోడు కాదు.. వృద్ధురాలిని ఎంత ఈజీగా మోసం చేశాడంటే



**హైదరాబాద్-నవభూమి::** మోస పోయే వాళ్లు ఉంటే.. మోసగించే వాళ్లు కోకొల్లుగా ఉంటారు. సొంతవారినే నమ్మించి నట్టేట ముంచుతారు. ముందు అంతా మంచిగా ఉన్నట్లు నటించి.. ఆపై తమ అవసరం తీరిపోగానే అసలు రూపాన్ని బయటకు తీస్తారు. మోసం చేసే వారిని గుర్తించే లోపే.. ఉన్నదంతా ఊస్టు కూడా అయిపోతుంది. మోసం చేసే వారి మాటలు కూడా ఎంతో తీయగా ఉంటాయి. అమాయకులను తమ మాటలతో ఈజీగా నమ్మించేస్తారు. తమకు కావాల్సింది దక్కగానే వారికి కనిపించకుండా పరారవుతుంటారు. లేదా మోసపోయినట్లు గుర్తించి నిలదీస్తే వారిని బెదిరింపులకు పాల్పడతారు. అంతేకాకుండా ప్రాణాలు తీసేందుకు వెనకాడరు మోసగాళ్లు. ఇలాంటి ఘటనే హైదరాబాద్‌లో చోటు చేసుకుంది. వృద్ధిరాలి పట్ల కేటుగాడు చేసిన మోసం ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. వృద్ధురాలు ఎలా మోసపోయింది.. ఆ కేటుగాడు ఎలా మోసం చేశాడో ఇప్పుడు తెలుసుకుందాం.హబ్సిగూడకు చెందిన వృద్ధురాలకి నాగేశ్వర్ శర్మ 2022లో పరిచయం అయ్యాడు. వృద్ధురాలితో మంచిగా ఉన్నట్లు నటిస్తూ ఆమె వెనక మోసానికి తెరతీశాడు. ఈ విషయాలేమి తెలియని వృద్ధురాలు.. నాగేశ్వర్‌ను ఎంతో నమ్మింది. కోట్లలో నగదును అతడికి ఇచ్చింది. చివరకు మోసపోయినట్లు గుర్తించిన వృద్ధురాలు పోలీసులను ఆశ్రయించింది. వేలంలో ఆస్తులు ఇప్పిస్తానంటూ వృద్ధురాలి నుంచి దాదాపు 5.71 కోట్ల రూపాయలను కాజేశాడు కేటుగాడు.తాను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఆస్తుల విభాగం మేనేజర్‌గా పనిచేస్తున్నానంటూ వృద్ధురాలిని నమ్మించాడు నాగేశ్వర్. ఎస్‌బీఐ.. వేలంలో బంగారం, ఫ్లాట్లు, కార్లు విక్రయిస్తోందని.. తక్కువ ధరకే వస్తాయని నమ్మబలిగారు. ఇది నిజమని నమ్మిన వృద్ధురాలు నాగేశ్వర్‌కు పెద్దమొత్తంలో డబ్బులు సమర్పించింది. వృద్ధురాలికి అనుమానం రాకుండా 4 ఫ్లాట్లు, 4 ప్లాట్లు, 2 కార్లు వేలంలో ఇప్పించినట్లు ఫేక్ డాక్యుమెంట్లు కూడా సృష్టించాడు. దీంతో పలు దఫాల్లో దాదాపు రూ.5.71 కోట్ల రూపాయలను నాగేశ్వర్‌కు ఇచ్చింది. అయితే నెలలు గడుస్తున్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేయించకపోవడంతో అనుమానం వచ్చిన వృద్ధురాలు.. నాగేశ్వర్‌ను నిలదీసింది. దీంతో తన అసలు రంగును బయటపెట్టాడు కేటుగాడు. డబ్బులు ఇచ్చేది లేదని, ఇంకా ఎక్కువగా వాగితే చంపేస్తానంటూ బెదిరింపులకు దిగారు. తాను మోసపోయానని గుర్తించిన బాధితురాలు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించింది. వృద్ధురాలి ఫిర్యాదు మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## గ్రూప్ 1 పరీక్షపై అప్పీల్ పిటిషన్ హైకోర్టు విచారణ..

**హైదరాబాద్-నవభూమి:** గ్రూప్ 1 పరీక్ష పై అప్పీల్ చేసిన పిటిషన్ )పై బుధవారం తెలంగాణ హైకోర్టు విచారణ జరిపింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై టీజీపీఎస్సీ సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ వేసింది. గ్రూప్ 1 అభ్యర్థుల నియామకంపై సింగిల్ బెంచ్ ఇప్పటికే స్టే విధించింది. విచారణ పూర్తయ్యే వరకు నియామక పత్రాలు ఇవ్వొద్దని గతంలో సింగిల్ బెంచ్ టీజీపీఎస్సీకు ఆదేశించింది. దీంతో టీజీపీఎస్సీ పిటిషన్‌పై ఈ రోజు విచారణ జరిపిన హైకోర్టు.. సింగిల్ బెంచ్ మళ్ళీ విచారణ జరపాలని డివిజన్ బెంచ్ ఆదేశాలిచ్చింది. వేసవి సెలవులకు ముందే గ్రూప్ 1 వివాదంపై తుది ఆదేశాలు ఇవ్వాలని సింగిల్ బెంచ్‌కు హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశించింది.కాగా గ్రూప్-1 నియామకాలపై హైకోర్టులో టీజీపీఎస్సీ అప్పీల్ పిటీషన్ వేసింది. తెలంగాణలో గ్రూప్-1 నియామకాలను తాత్కాలికంగా నిలిపివేయాలంటూ హైకోర్టు సింగిల్ బెంచ్ ధర్మాసనం జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను నిలిపివేయాలని తన అప్పీల్ పిటిషన్లో కోరింది. గ్రూప్ 1 నియామకాల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించడంతో నియామక ప్రక్రియకు అంతరాయం నెలకున్న సంగతి తెలిసిందే..

## వేసవి సెలవులు.. రేపటి నుంచి ఇంటి వద్దకే గుడ్లు..



**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణలో మే 1 నుండి జూన్ 1 వరకు అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ప్రకటించారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు ఇంటి వద్దకే పోషకాహారం సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అంగన్‌వాడీ టీచర్లను ఇతర విధుల్లో వినియోగించడం ద్వారా మానవ వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకోవచ్చు. ఈ చర్యలు ప్రభుత్వ చిత్తశుద్ధిని.. ప్రజల సంక్షేమం పట్ల దాని నిబద్ధతను చాటుతున్నాయి. పూర్తి వివరాలు తెలుసుకోండి. రేపటి నుంచి వేసవి సెలవులు.. ఇంటి వద్దకే గుడ్లు.. రేపటి నుంచి వేసవి సెలవులు.. ఇంటి వద్దకే గుడ్లు..తెలంగాణ రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు రేపటి నుండి.. అంటే మే 1వ తేదీ నుండి వేసవి సెలవులు ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో తీవ్రంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అంగన్‌వాడీ కేంద్రాలకు మే 1వ తేదీ నుండి జూన్ 1వ తేదీ వరకు సెలవులు వర్తిస్తాయి. ఈ వేసవి విరామ సమయంలో.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధి పొందే గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు పోషకాహారాన్ని వారి ఇళ్ల వద్దకే సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.ఈ ప్రత్యేక ఏర్పాట్ల ప్రకారం.. అంగన్‌వాడీ పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు టేక్ హెూం రేషన్ విధానం ద్వారా గుడ్లు .. ఇతర పోషక విలువలు కలిగిన సరుకులను అందిస్తారు. తద్వారా వేసవి సెలవుల్లో కూడా వారికి సరైన పోషకాహారం అందుతుంది. అయితే.. అంగన్‌వాడీ టీచర్లకు ఈ సెలవుల సమయంలో ఇతర ప్రభుత్వ విధులు నిర్వర్తించే బాధ్యతలను అప్పగించనున్నారు.
అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటి సర్వే నిర్వహించడం, లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య సమాచారం తెలుసుకోవడం.. అంగన్‌వాడీ కేంద్రాల్లో కొత్తగా చేరే పిల్లలను గుర్తించడం వంటి పనులను చేయవలసి ఉంటుంది. ఈ చర్యల ద్వారా.. వేసవి సెలవుల సమయంలో కూడా అంగన్‌వాడీ సిబ్బంది ప్రభుత్వ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.అంగన్‌వాడీ కేంద్రాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద మరియు బలహీన వర్గాల పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు కీలకమైన పోషకాహార మద్దతును అందిస్తాయి. ఈ కేంద్రాలు పిల్లల ప్రాథమిక విద్య , ఆరోగ్య సంరక్షణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. వేసవి సెలవుల కారణంగా కేంద్రాలు మూతపడినప్పటికీ.. ప్రభుత్వం లబ్ధిదారులకు పోషకాహారాన్ని నిరంతరంగా అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం అభినందనీయం. అలాగే.. అంగన్‌వాడీ టీచర్లను ఇతర విధుల్లో వినియోగించడం ద్వారా మానవ వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకోవచ్చు. ఈ చర్యలు ప్రభుత్వ చిత్తశుద్ధిని.. ప్రజల సంక్షేమం పట్ల దాని నిబద్ధతను చాటుతున్నాయి.

## విదేశాలకు వెళ్లాలనే కోరిక.. అప్లయ్ చేసిన ప్రతిసారి వీసా రిజక్ట్.. హెడ్ కానిస్టేబుల్ కుమారుడు కఠిన నిర్ణయం



**హైదరాబాద్-నవభూమి:**హైదరాబాద్ శివారు తుర్కయాంజల్‌లో విషాదకరమైన ఘటన చోటుచేసుకుంది. వీసా రిజెక్ట్ అయిందన్న మనస్థాపంతో ఓ యువకుడు ప్రాణాలు తీసుకున్నాడు. ఇక తనకు విదేశాలకు వెళ్లే యోగ్యం లేదని భావించి బలవన్మరణానికి పాల్పడ్డాడు. దీంతో అతడి కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం లేమూర్ గ్రామానికి చెందిన గజాడి కృష్ణ ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబంతో సహా.. తుర్కయాంజల్‌లో నివసిస్తున్నాడు. గజాడి కృష్ణ పెద్ద కుమారుడు శివ కుమార్ (25) గత కొన్నాళ్లుగా విదేశాలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాడు.
పలు మార్లు వీసాకు అప్లయ్ చేసినా రాలేదు. అప్లయ్ చేసిన ప్రతిసారి రిజక్ట్ అవుతోంది. దీంతో శివ కుమార్ మనస్థాపానికి గురయ్యారు. ఇక ఈ భూమ్మీద బతకటం వ్యర్థమని భావించి సూసైడ్ చేసుకోవాలనుకున్నాడు. ఈ క్రమంలోనే ఏప్రిల్ 25న ఆన్‌లైన్‌లో పురుగుల మందు ఆర్డర్ చేసి తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే అతడిని మలక్‌పేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఐదు రోజుల చికిత్స అనంతరం నేడు ఆసుపత్రిలోనే కన్నుమూశాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఆదిభట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.
శివ కుమార్ మృతితో స్థానికంగా విషాదం అలుముకుంది. వీసా రాకపోతే మాత్రం ఇలాంటి పని చేస్తారా? అని చర్చించుకుంటున్నారు. విదేశాలకు వెళ్లటమే జీవితం కాదని.. ఉన్నచోట కూడా గొప్పగా బతకొచ్చని అంటున్నారు. క్షణికావేశంలో తల్లిదండ్రులకు తీరని క్షోభను మిగల్చటం సరైందని కాదని విచారం వ్యక్తం చేస్తున్నారు. కాగా, గతంలోనూ పలువురు వీసా రాకపోవటంతో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. దీనిపై మానసిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇవి సరైన చర్యలు కావని అంటున్నారు. విదేశాలకు వెళ్లాలనుకోవటం తప్పులేదని.. అదే సమయంలో తల్లిదండ్రుల గురించి కూడా ఓసారి ఆలోచించాలని సూచిస్తున్నారు.

# షర్మిల హౌస్ అరెస్ట్

(1వపేజీ తరువాయి)భయపడుతోందని నిలదీశారు.
**విజయవాడలో వైఎస్ షర్మిలపై బీజేవైఎం దాడి..! తీవ్ర ఉద్రిక్తత..!**
ప్రధాని మోడీ అమరావతికి రాకవేళ ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై బుధవారం విజయవాడలో బీజేవైఎం కార్యకర్తలు దాడికి దిగారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆంధ్రరత్న భవన్ దగ్గర నిరసనకు దిగిన షర్మిలపై బీజేవైఎం కార్యకర్తలు కోడిగుడ్లు, టమోటాలతో దాడి చేశారు. ఈ సందర్భంగా తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. షర్మిల ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై చేసిన వ్యాఖ్యల్ని నిరసిస్తూ బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా వంశీ నేతృత్వంలో రాష్ట్ర కాంగ్రెస్ కార్యాలయం ముట్టడించారు. కాంగ్రెస్ కార్యాలయం ముట్టడి కోసం వచ్చిన బీజేవైఎం కార్యకర్తలకూ, కాంగ్రెస్ కార్యకర్తలకూ మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు జోక్యం చేసుకున్నా ఇరుపక్షాల మధ్య బాహా బాహీ కొనసాగింది. ఈ సందర్భంగా వైఎస్ షర్మిలకు వ్యతిరేకంగా బిజెవైఎం కార్యకర్తలు నినాదాలు చేశారు. దీంతో బిజెవైఎం నేతల ను పోలీసులు అదుపులో కి తీసుకున్నారు. బీజేవైఎం కార్యకర్తల తీరుపై షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి నాయకులు అధికార మదంతో వ్యవహరిస్తున్నారని షర్మిల ఆరోపించారు. ఏపీలో వైసిపి ఉన్నా, కూటమి ఉన్నా అధికార పెత్తనం మాత్రం బిజెపిదే అన్నారు. గత పదకొండేళ్లుగా రాష్ట్రాన్ని మోడీ నాశనం చేశారన్నారు. టిడిపి, జనసేన, వైసిపి నాయకులూ ఎలాగూ పశ్నించరని, మోడీ మోసాలను నిలదీస్తే తనను టార్గెట్ చేసి దాడి చేయిస్తారా అని షర్మిల ప్రశ్నించారు. కోడి గుడ్లు, టమాటాలతో దాడి చేస్తారా అని అడిగారు. ఏపీసీసీ అధ్యక్షురాలి పైనే ఇలా దాడికి తెగబడితే.. మా కాంగ్రెస్ నాయకుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లోపలకు వచ్చారంటే పోలీసులు సహకారం లేకుండా వస్తారా అని అడిగారు. ఎవరైతే ఇప్పుడు దాడిలో ఉన్నారో అందరి పైనా హత్యా యత్నం కేసులు నమోదు చేయాలన్నారు. మీ అన్యాయాలను ప్రశ్నిస్తే సహించలేరా.. మోసాలు బయట పెడితే దాడి చేస్తారా అని షర్మిల నిలదీశారు. ఈ ఘటనలపై కూటమి ప్రభుత్వం తనకు సమాధానం చెప్పాలన్నారు. చంద్రబాబు ఇదేనా మీ పాలనలో మహిళలకు జరిగే న్యాయం అన్నారు. ఇటువంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం, పోలీసులు వారి పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

## కోల్‌కతాలో ఘోర అగ్నిప్రమాదం

(1వపేజీ తరువాయి)చెలరేగాయని చెబుతున్నారు. ఆ సమయంలో కస్టమర్స్, హెూటల్ సిబ్బంది మంటల్లో చిక్కుకోగా.. రాత్రి సమయం కావడంతో.. గాలులు బలంగా వీచిన కారణంగా మంటలు మరింత త్వరగా వ్యాప్తి చెందినట్టు వెల్లడించారు. అంతే కాకుండా మంటల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో హెూటల్ సిబ్బంది ఒకరు పైకప్పు పై నుంచి దూకి మరణించినట్టు వివరించారు. ఇక స్థానికుల సమాచారం మేరకు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. సుమారు 15 ఫైర్ ఇంజిన్లు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే కొందరిని సురక్షితంగా కాపాడినప్పటికీ.. 14 మంది మంటల నుంచి తప్పించుకోలేక ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. మరోవైపు ప్రమాదం జరిగిన వెంటనే రెస్క్యూ టీమ్‌లు రంగంలోకి దిగాయి. ఘటనా స్థలంలో దర్యాప్తు చేపట్టారు. ఇంకా హెూటల్‌లో ఎవరైనా ఉన్నారా అనే దానిపై రెస్క్యూ కొనసాగుతోంది. అగ్నిప్రమాదానికి గల కారణాలపై స్పష్టత కోసం అధికారులు హెూటల్ సిబ్బందిని, సాంకేతిక నిపుణులను ప్రశ్నిస్తున్నారు. అయితే మృతుల వివరాలు ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. అగ్నిప్రమాదం ఘటనపై విచారణ కొనసాగుతోందని, దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ ఘటనపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించారు.

## నెల్లూరు జిల్లాలో హెూటల్లోకి దూసుకెళ్లిన కారు

(1వపేజీ తరువాయి)మొదట కారును లారీతో గుద్ది, ఆ తర్వాత వేటకొడవళ్లతో దాడి చేసి.. కాంగ్రెస్ నేతను దారుణంగా నరికి హత్య చేసిన ఘటన అనంతపురం జిల్లాలో చోటు చేసుకుంది. ఈ ఊహించని ఘటనతో రాయలసీమలో మళ్లీ ఒక్కసారిగా పాతకక్షలు భగ్గుమన్నాయా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళ్తే... కాంగ్రెస్ పార్టీ ఆలూరు నియోజకవర్గం ఇంఛార్జ్‌గా ఉన్న లక్ష్మీనారాయణ దారుణ హత్యకు గురయ్యారు. ఆయన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ గానే కాకుండా ఎమ్మార్పీఎస్ రాయలసీమ అధ్యక్షుడుగా కూడా వ్యవహరిస్తున్నారు. అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణ శివారులో ఆలూరు రోడ్డు చిప్పగిరి రైల్వే బ్రిడ్జి వద్ద ఈ ఘటన జరిగింది. గుంతకల్ నుంచి చిప్పగిరికి లక్ష్మీనారాయణ వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారు. మొదట లక్ష్మీనారాయణ ప్రయాణిస్తున్న ఇన్నోవా వాహనాన్ని టిప్పర్‌తో ఢీ కొట్టారు. ఆ తర్వాత కారులో చిక్కుకున్న లక్ష్మీనారాయణపై కత్తులతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అయితే తీవ్రగాయాలైన లక్ష్మీనారాయణను వెంటనే ఆస్పత్రికి తరలించినా.. అప్పటికే ఆయన చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. అంతే కాకుండా ఈ ఘటనలో జరిగేటప్పుడు కారులో ఉన్న ఆయన కుమారుడు కూడా తీవ్రంగా గాయపడినట్టు చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

## గోడ కూలి 8 మంది మృతి

(1వపేజీ తరువాయి)అక్షయ తృతీయ సందర్భంగా సింహాచలం వరాహా లక్ష్మీనరసింహస్వామి భక్తులకు నిజరూపంలో దర్శనం ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా స్వామివారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేకువజామున ఒంటిగంటకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. అనంతరం ఆ తర్వాత స్వామివారి దేహంపై ఉన్న చందనాన్ని వెండి బొరిగెలతో అత్యంత సున్నితంగా వేరు చేసి.. నిజరూపంలోకి వచ్చిన స్వామికి విశేష అభిషేకాలు జరిపారు. వైదిక కార్యక్రమాల అనంతరం ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు, ఆయన కుటుంబ సభ్యులకు నిజరూప దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా స్వామివారికి తొలి చందనాన్ని సమర్పించారు. అనంతరం ప్రభుత్వం తరఫున రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున అధికారులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆ తర్వాత భక్తులకు స్వామివారి దర్శనాలు కల్పించారు.

## తెలంగాణా బోనాల జాతరకు వేళాయే

(1వపేజీ తరువాయి)గ్రామదేవతలకు నైవేద్యాలను సమర్పిస్తారు. ఒక్క హైదరాబాద్లో మాత్రమే కాకుండా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో బోనాల జాతర జరుగుతుంది. మట్టికుండలో బోనాన్ని వండి అమ్మవారికి నివేదిస్తారు. భక్తిశ్రద్ధలతో మహంకాళి అమ్మవారిని పూజించి పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని, కరువు కాటకాలు లేకుండా ప్రజలంతా సుభిక్షంగా జీవించాలని ప్రార్థిస్తారు. %కూశ్రీంశీ =ఘుం% భగవద్గీత శ్లోకంతో స్మితా సబర్వాల్ సంచలన ట్వీట్! ఘనంగా బోనాల పండుగ జరుపనున్న ప్రభుత్వం గతంలో హైదరాబాద్లో ప్రజలు ప్లేగు వ్యాధి బారిన పడినప్పుడు మహంకాళి దేవి కటాక్షంతో ప్రజలు ప్లేగు నుండి బయటపడ్డారు. అప్పట్నుంచి అమ్మవారికి కృతజ్ఞతగా బోనాలను సమర్పించి ప్రజలను చల్లగా చూడాలని ప్రార్థిస్తున్నారు. ఇక ఈ సంవత్సరం బోనాల పండుగకు షెడ్యూల్ ప్రకటించిన ప్రభుత్వం ఘనంగా నిర్వహించటం కోసం ఏర్పాట్లు చేస్తుంది.

## సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీగా శ్రీనివాస్ రాజు

(1వపేజీ తరువాయి)సలహాదారుగా నియామకమైన విషయం తెలిసిందే. అప్పట్లో శ్రీనివాస్ రాజు.. బ్యూరోక్రాట్లకు కొత్త తలనొప్పులు తెచ్చినట్లు గుసగుసలు వినిపించాయి. మళ్లీ ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి ప్రిన్సిపల్ సెక్రటరీగా శ్రీనివాస్ రాజ్ నియామకం కావడం చర్చనీయాంశమైంది.
ఆంధ్రప్రదేశ్ ఐఏఎస్ క్యాడర్‌లో 2001 బ్యాచ్‌కు చెందిన ఆయన 2011లో వైజాగ్ డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న సమయంలో టీటీడీ జేఈవోగా నియమితులయ్యారు. ఏప్రిల్ 20వ తేదీన జేఈవోగా బాధ్యతలు తీసుకుని 2019 జూన్ వరకు ప్రభుత్వాలతో సంబంధం లేకుండా ఎనిమిదేండ్ల రెండు నెలలపాటు పనిచేశారు. నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు ప్రభుత్వాల్లో జేఈవోగా విధులు నిర్వహించి, టీటీడీలో తనదైన ముద్ర వేశారు.
అయితే 2019లో జగన్ ప్రభుత్వం వచ్చాక ఆయన ఇంటర్ కేడర్‌పై తెలంగాణ రాష్ట్రానికి వచ్చారు. తెలంగాణ నాలుగేండ్ల పాటు రహదారులు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శిగా విధులు నిర్వర్తించారు. 2024 మార్చి నెలతో డిప్యుటేషన్ గడువు ముగియడంతో పొడిగింపునకు క్యాట్‌ను ఆశ్రయించారు. అనుమతి రాకపోవడంతో ఏపీకి రాక తప్పలేదు. గత మే నెలలో ఏపీ సీఎస్‌కు రిపోర్టు చేశారు. టీటీడీ ఈవోగా వచ్చేందుకు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేసినా కూటమి ప్రభుత్వం శ్యామలరావును ఈవోగా నియమించింది. 2024 జూన్ నెలలో శ్రీనివాసరాజు స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు.

## మరో పదేళ్లు కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితం

(1వపేజీ తరువాయి)అలా జగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రభుత్వం నుంచి అన్ని సహాయ సహకారాలు అందించామని రేవంత్ రెడ్డి తెలిపారు. బస్సులు కావాలంటే.. అన్ని బస్సులు ఇచ్చామని చెప్పారు. ప్రతిపక్ష హెూదా ఇచ్చిన ప్రజల వద్దకు ఎందుకు వెల్లట్లేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వ పథకాలను నిలిపివేసినట్లు కేసీఆర్ తప్పడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రైతుబంధు, రైతు రుణమాఫీ, ప్రజా పాలన ఆగిందా.. అని ప్రశ్నించారు. తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ పార్టీ కేఆర్ఎస్ కు విలన్ అయిందా అని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పహల్గాం సూత్రధారికి పాక్ బాసట!

(1వపేజీ తరువాయి)సమాచారం. అయితే పాకిస్థాన్ ప్రభుత్వం మాత్రం హఫీజ్ సయీద్ వివిధ కేసుల్లో భాగంగా జైల్లోనే ఉన్నాడని అబద్ధాలు చెప్తోంది. హఫీజ్ కు 31 ఏళ్లు జైలు శిక్ష పడిందని ప్రస్తుతం అతడు జైల్లోనే ఉన్నట్లు పేర్కొంటూ వస్తోంది. ఇక 26/11 ముంబై ఉగ్రదాడులతో పాటు అనేక ఉగ్రదాడుల్లో హఫీజ్ సయీద్ కీలక సూత్రధారిగా ఉన్నాడు. భారత్‌లో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల్లో ఒకడిగా హఫీజ్ సయీద్ ఉన్నాడు. సయీద్‌ను.. ఐక్యరాజ్య సమితి కూడా అంతర్జాతీయ ఉగ్రవాదిగా గతంలోనే ప్రకటించింది. అతడి తలపై అమెరికా 10 మిలియన్ డాలర్ల రివార్డ్ కూడా ప్రకటించిన విషయం తెలిసిందే. మరోవైపు ఇప్పటికే త్రివిధ దళాలతో ప్రధాని నరేంద్ర మోదీ సమావేశం నిర్వహించారు. త్రివిధ దళాలకు ప్రధాని మోదీ పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. టైమ్, డేట్ మీరే ఫిక్స్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. పాకిస్థాన్ కు ఎలాంటి జవాబు ఇవ్వాలో సైన్యమే నిర్ణయిస్తుందని ప్రధాని మోదీ అన్నారు. ఉగ్రవాదాన్ని అణచివేయాలన్నదే తమ ధ్యేయమని తెలిపారు. ఈ సమావేశం దాదాపు గంటన్నర పాటు జరిగింది. పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశం అనంతరం ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ తోనూ ప్రధాని మోదీ కీలక సమావేశం నిర్వహించారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం నెలకొన్న పరిణామాలపై ఇరువురు చర్చించుకున్నారు. ఉగ్రవాద అంతానికి తమ సంపూర్ణ సహకారం అందిస్తామని మోహన్ భగవత్ ప్రధాని మోదీకి హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది.

## డబుల్ డెక్కర్‌కు మెట్రో రెడ్‌సిగ్నల్..

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** మహారాష్ట్రలోని నాగ్‌పూర్ తరహాలో హైదరాబాద్‌లో నిర్మించాలని భావించిన డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ (రోడ్డు మార్గం, ఆపైన ఫ్లైఓవర్, ఆపైన మెట్రోకారిడార్) నిర్మాణం దాదాపు ఆగిపోయినట్లే. హైదరాబాద్ మెట్రోరైలు లిమిటెడ్ (హెచ్‌ఎంఆర్ఎల్) తిరకాసు పెట్టడంతో ఈ ప్రాజెక్టు పక్కకు పోయింది. మెట్రోలైన్‌ను తాము సొంతంగా నిర్మించుకుంటామని స్పష్టం చేసింది. దీంతో హెచ్ఎండీఏ ఎలివేటెడ్ కారిడార్, మెట్రో కారిడార్లను ఎవరికి వారు నిర్మించుకోనున్నారు. వేర్వేరు ప్రాజెక్టుల వల్ల ఆ మార్గంలో భూ సేకరణ, సర్వీసు రోడ్డు విస్తరణ సమస్యలతో పాటు నిర్మాణ వ్యయం భారీగా పెరగనుంది. నార్త్ సిటీ మెట్రో నేపథ్యంలో డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నాలుగు నెలల క్రితం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం విధితమే. కంటోన్మెంట్ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులు తీర్చేందుకు ఇప్పటికే నిర్ణయించిన ఎలివేటెడ్ కారిడార్లను డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్లుగా మార్చాలని సూచించడంతో ఆ మేరకు డిజైన్లను హెచ్ఎండీఏ రూపొందించింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 | హైదరాబాద్
గురువారం
01 । మే । 2025

# కుల గణనకు కేంద్రం ఆమోదం మా విజయమే : ప్రతిపక్షాలు





**న్యూఢిల్లీ-నవభూమి:** దేశవ్యాప్తంగా కుల గణన కు కేంద్ర ప్రభుత్వం ఇవాళ ఆమోదం తెలిపింది. వచ్చే జనాభా లెక్కలతోపాటే కులగణన చేపట్టాలని నిర్ణయించింది. క్యాబినెట్ భేటీ అనంతరం కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ విషయాన్ని వెల్లడించారు. అయితే కేంద్ర క్యాబినెట్ నిర్ణయాన్ని ప్రతిపక్షాలు తమ విజయంగా చెప్పుకుంటున్నాయి. ఈ మేరకు ప్రధానపక్షం కాంగ్రెస్, దాని మిత్రపక్షం ఆర్జేడీ వేర్వేరుగా ప్రకటనలు చేశాయి. ఈ రెండు పార్టీలు కేంద్రాన్ని కులగణనకు తలొగ్గేలా చేయడంలో తాము విజయం సాధించామని ప్రకటించాయి. బీహార్‌లో కుల గణన జరగడానికి, ఇప్పుడు దేశవ్యాప్త కులగణనకు కేంద్ర ఒప్పుకోవడానికి తమ పోరాటమే పని చేసిందని చెప్పుకుంటున్నాయి. బీహార్‌లో ఈ ఏడాది ఆఖరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. కుల గణనకు చేపట్టనున్నామనే అంశాన్ని అధికార ఎన్డీఏ, కేంద్రం కులగణనకు తలొగ్గేలా చేశామనే విషయాన్ని ఆర్జేడీ, కాంగ్రెస్ తమ ప్రచారాస్త్రాలుగా చేసుకోనున్నాయి.

## కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం.. దేశవ్యాప్తంగా కులగణన పట్ల హర్షం



**న్యూఢిల్లీ-నవభూమి:** కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్త కులగణన కు ఆమోదం తెలిపింది. జనాభా లెక్కలతోపాటే కులగణన చేపట్టాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించింది. పహల్గాం ఉగ్రదాడిపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్‌పై చర్చించేందుకు ఇవాళ రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశమైందని, ఈ సందర్భంగా వచ్చే జనాభా లెక్కలతోపాటే కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు కులగణన చేపట్టాయని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. వాటిలో కొన్ని రాష్ట్రాలు రాజకీయ సాధనంగా కులగణనను వాడుకున్నాయని ఆయన ఆరోపించారు. కాగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తం కులగణన చేపట్టాలంటూ ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ సహా పలు పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే ఆ డిమాండ్‌లను ఇన్ని రోజులుగా కేంద్రం పక్కన పెడుతూ వస్తున్నది. ఈ క్రమంలో ఇవాళ కులగణనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలుపడం సంచలనంగా మారింది.

## కుమార్తెతో ప్రేమ సంబంధంపై ఆగ్రహం.. యువకుడ్ని కాల్చి చంపిన యువతి తండ్రి



**లక్నో-నవభూమి:** కుమార్తెతో యువకుడి ప్రేమ సంబంధంపై ఆమె తండ్రి ఆగ్రహించాడు. రాత్రివేళ యువతిని కలిసేందుకు ప్రయత్నించిన అతడ్ని గన్‌తో కాల్చి చంపాడు. ఈ విషయం తెలిసిన పోలీసులు యువతి తండ్రిని అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని ఎటావా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఔరైయా జిల్లాకు చెందిన 18 ఏళ్ల లవ్‌కుష్, ఎటావా జిల్లా ఖేదహేలులోని తన సోదరి ఇంట్లో ఉంటున్నాడు. అదే గ్రామానికి చెందిన యువతితో అతడికి ప్రేమ సంబంధం ఏర్పడింది.

కాగా, సోమవారం అర్ధరాత్రి వేళ ఆ యువతి ఇంట్లోకి వెళ్లేందుకు లవ్‌కుష్ ప్రయత్నించాడు. గమనించిన యువతి తండ్రి అనిల్ కుమార్ ఆగ్రహంతో రగిలిపోయాడు. తుపాకీతో లవ్‌కుష్‌పై కాల్పులు జరిపాడు. కాల్పుల శబ్ధం విన్న స్థానికులు తమ ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. యువతి ఇంటి వద్ద రక్తం మడుగుల్లో పడి లవ్‌కుష్ మరణించడాన్ని చూసి షాకయ్యారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. మరోవైపు పోలీసులు అక్కడకు చేరుకున్నారు. యువతి తండ్రి అనిల్ కుమార్‌ను అరెస్ట్ చేశారు. అతడి వద్ద ఉన్న తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. లవ్‌కుష్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఐఐటీ ఢిల్లీ హాస్టల్ మెస్‌లో ఫుడ్ పాయిజనింగ్.. విద్యార్థులకు అస్వస్థత



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రముఖ విద్యా సంస్థ ఐఐటీ ఢిల్లీ విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. హాస్టల్ మెస్‌లో లిట్టి చోఖా తిన్న తర్వాత వాంతులు, విరేచనాలు, జ్వరం వంటి లక్షణాలతో అనారోగ్యం బారినపడ్డారు. దీంతో కొంత మంది విద్యార్థులకు క్యాంపస్‌లో చికిత్స అందించగా, మరికొందరిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. మంగళవారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై ఐఐటీ ఢిల్లీ విద్యార్థులు మండిపడ్డారు. ఫుడ్ కోసం డబ్బులు చెల్లించి కలుషిత ఆహారం తింటున్నామని కొందరు స్టూడెంట్స్ ఆరోపించారు. హాస్టల్ మొత్తం రాత్రంతా రోగుల వార్డుగా మారిపోయిందని విమర్శించారు. ప్రతిష్టాత్మక విద్యా సంస్థలో అందిస్తున్న ఆహారం నాణ్యతపై సోషల్ మీడియా పోస్ట్‌లో మండిపడ్డారు. కాగా, ఐఐటీ ఢిల్లీ సంస్థ ఈ ఆరోపణలను ఖండించింది. బాయిస్ హాస్టల్‌లోని విద్యార్థులు బయట వ్యక్తి అమ్మిన స్వీట్లు తిన్నారని, దీని వల్ల వారికి ఫుడ్ పాయిజనింగ్ లక్షణాలు కనిపించినట్లు తెలిపింది. అయితే ఈ సంఘటన నేపథ్యంలో ఏప్రిల్ 30న జరుగాల్సిన పరీక్షను మే 8కి వాయిదా వేసినట్లు పేర్కొంది. మిగిలిన పరీక్షలు షెడ్యూల్ ప్రకారం జరుగుతాయని వెల్లడించింది.

## బోర్డర్ వద్ద రఫేల్ విమానాల పెట్రోలింగ్



**న్యూఢిల్లీ-నవభూమి:** జమ్మూకశ్మీర్ గగన వీధుల్లో మంగళవారం రాత్రి రఫేల్ యుద్ధ విమానాలు పహారా కాసినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన పాకిస్థాన్ మీడియా వార్తలను ప్రసారం చేసింది. పాక్ సరిహద్దు వద్ద భారతీయ వైమానిక దళానికి చెందిన రఫేల్ యుద్ధ విమానాలు( చక్కర్లు కొట్టినట్లు పేర్కొన్నది. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న భారత యుద్ధ విమానాలను వెనక్కి పంపినట్లు ఓ కథనంలో పాకిస్థాన్ మీడియా ప్రకటించింది. భారతీయ గగనతల సరిహద్దులోనే ఆ రఫేల్ విమానాలు పెట్రోలింగ్ చేసినట్లు పాక్ మీడియా తెలిపింది. పెట్రోలింగ్ నిర్వహించిన రఫేల్ విమానాలు.. లైన్ ఆఫ్ కంట్రోల్‌ను దాటలేదని పాక్ మీడియా చెప్పింది. రఫేల్ కదలికల్ని తమ వైమానిక దళ విమానాలు గుర్తించినట్లు పాక్ పేర్కొన్నది. అయితే ఇండియా 24 నుంచి 36 గంటల్లో తమపై దాడి చేసే అవకాశాలు ఉన్నట్లు పాక్ మంత్రి అతాహుల్లా తరార్ పేర్కొన్న విషయం తెలిసిందే.

మరో వైపు ఇవాళ ప్రధాని మోదీ నేతృత్వంలో క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూర్టీ సమావేశం జరిగింది. పెహల్గామ్ ఉగ్రదాడి ఘటనకు చెందిన అంశంపై ఆ కమిటీ కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశం జరగడం రెండోసారి. ఫస్ట్ సమావేశంలో సింధూ జలాల ఒప్పందం సస్పెన్షన్ నిర్ణయాన్ని తీసుకున్న విషయం తెలిసిందే.

# ఆప్ నేతల మెడకు మరో కేసు.. ఈ సారి ఏకంగా 2 వేల కోట్ల రూపాయల స్కామ్



**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఇప్పటికే విచారణను ఎదుర్కొంటున్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేతలు, మాజీ మంత్రులు మనీష్ సిసోడియా, సత్యేందర్ జైన్‌లు మరో అవినీతి కేసులో ఇరుక్కున్నారు. ఈసారి ఏకంగా 2 వేల కోట్ల రూపాయల స్కామ్‌లో ఇరుకున్నారు. ఢిల్లీలో గతంలో ఆప్ పాలనలో చేపట్టిన పాఠశాలలు, తరగతి గదుల నిర్మాణంలో భారీ కుంభకోణం చోటు చేసుకుందని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) తీవ్ర ఆరోపణలు చేసింది. మొత్తం 12 వేల స్కూళ్లు, తరగతి గదుల నిర్మాణం చేపట్టిన ప్రక్రియలో సుమారు రూ.2 వేల కోట్ల మేర అవినీతి జరిగిందని ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలో దీనికి బాధ్యులను చేస్తూ.. అప్పటి ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, మాజీ పీడబ్ల్యూడీ మంత్రి సత్యేందర్ జైన్‌లపై ఏసీబీ అధికారులు.. అధికారికంగా కేసు నమోదు చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మనీశ్ సిసోడియా.. ఆప్ ప్రభుత్వ హయాంలో విద్యాశాఖ మంత్రిగా ఉండగా.. సత్యందర్ జైన్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూడీ) మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. వారి నేతృత్వంలోనే గతంలో ఢిల్లీలో సుమారు 12,748 పాఠశాల భవనాలు, తరగతి గదుల నిర్మాణం ప్రారంభించారు. అయితే ఈ పనుల్లో సుమారు రూ.2వేల కోట్ల మేర అక్రమాలు జరిగాయని ఏసీబీ అధికారులు తెలిపారు. ఇక ఈ పాఠశాల భవనాలు, తరగతి గదుల నిర్మాణ పనులను.. సుమారు 34 మంది కాంట్రాక్టులు దక్కించుకున్నారు. ఇలా కాంట్రాక్టులు పొందిన వారిలో చాలామందికి ఆప్‌తో దగ్గర సంబంధాలు ఉన్నట్లు తేలింది. నిర్ణీత గడువులోగా నిర్మాణాలు పూర్తికాకపోగా, భారీగా ఖర్చు చేశారు. ఇక సదరు కాంట్రాక్టర్లు.. తరగతి గదులను 30 సంవత్సరాలకు ఉండేలా కడితే.. వాటికి అయిన ఖర్చు మాత్రం 75ఏళ్లు ఉండేలా అయ్యిందని ఏసీబీ అధికారులు తెలిపారు. నిర్మాణాలు పూర్తి చేయడానికి విధించిన గడువు ప్రక్రియను పాటించకుండా కన్సల్టెంట్లు, ఆర్కిటెక్ట్‌లను నియమించుకోవడంతో.. ఈ భవనాల నిర్మాణ వ్యయం సుమారు ఐదు రెట్ల వరకు పెరిగిపోయిందని అధికారులు తెలిపారు. అంతేకాక ఇటీవల సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) ఇచ్చిన నివేదికలో కూడా ఆప్ హయాంలో చేపట్టిన తరగతి గదుల నిర్మాణ ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయని వెల్లడించింది. అంతేకాక కొత్త టెండర్లు తీసుకోకపోవడంతో ఈ ప్రాజెక్టు వ్యయం రూ.326 కోట్లు పెరిగిందని సీవీసీ నివేదికలో వెల్లడించింది. ఈ క్రమంలో మనీశ్ సిసోడియా, సత్యేంద్ర జైన్‌లను విచారించేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. మార్చి, 2025లో ఆమోదం తెలపడంతో వీరిపై ఢిల్లీ ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు.

# కాబోయే అల్లుడితో పారిపోయిన మరో అత్త..



**న్యూఢిల్లీ-నవభూమి:** పెళ్లిళ్లకు ముందు, తర్వాత ఇతరులతో అమ్మాయిలు, అబ్బాయిలు ప్రేమాయణాలు, వివాహేతర సంబంధాలు కొనసాగించడం అందరికీ తెలిసిందే. కానీ పెళ్లి నిశ్చయం అయ్యాకా.. మరికొన్ని రోజుల్లోనే పెళ్లగా కొత్తగా ప్రేమలో పడుతున్నారు కొందరు అబ్బాయిలు. అది కూడా కాబోయే పెళ్లి కూతురుతోనే, ఆమె సోదరీమణులతోనే, స్నేహితులతోనే, ఇతర బంధువులతోనే అయితే అర్థం చేసుకోవచ్చు. నిజంగానే వాళ్లు ప్రాణంగా ప్రేమించుకుంటే పెళ్లిళ్లు కూడా చేయొచ్చు. కానీ వీరు ప్రేమలో పడుతుంది పెళ్లి కుమార్తెలతో తల్లులతో. కేవలం ప్రేమ మాత్రమే కాదండోయ్.. వివాహేతర సంబంధం కూడా కొనసాగిస్తూ.. వారితోనే జీవితం అనుకుని ఇళ్లు విడిచి పారిపోతున్నారు. ఇటీవలే యూపీకి చెందిన ఓ మహిళ కాబోయే అల్లుడితో పారిపోగా.. అచ్చంగా ఇలాంటి ఘటనే, అదే రాష్ట్రంలోని మరో జిల్లాలో చోటు చేసుకుంది. ఉత్తర ప్రదేశ్ గోండా జిల్లా ఖొడారే పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన యువతికి.. బస్తీ జిల్లాకు చెందిన 25 ఏళ్ల యువకుడితో పెళ్లి కుదిరింది. అమ్మాయి, అబ్బాయికి ఒకరికొకరు నచ్చగా.. వారి కుటుంబాలు కూడా సంబంధం ఓకే అనుకుని మాటా ముచ్చట చేసుకున్నాయి. అయితే నాలుగు నెలల కిందటే వీరికి పెళ్లి నిశ్చయం కాగా.. మే 9వ తేదీ వివాహానికి ముహూర్తం పెట్టుకున్నారు. అయితే సంబంధం కుదిరిన తర్వాత నుంచి యువకుడు.. అమ్మాయి ఇంటికి ఫోన్ చేశాడు. అయితే కుమార్తెతో మాట్లాడడానికి బదులుగా ఆమె తల్లితో ఎక్కువగా ఫోన్‌లో సంభాషించేవాడు. మొదట్లో పెద్దగా పట్టించుకోని ఆమె భర్త, కుమార్తెలకు.. రోజులు గడుస్తున్నా కొద్దీ అనుమానం మొదలు అయింది. ముఖ్యంగా వీరిద్దరూ ఏం మాట్లాడుకుంటున్నారో తెలుసుకోవాలని చాటుమాటుగా వినగా.. వీరిద్దరూ ప్రేమలో ఉన్నట్లు గుర్తించారు. తనకు కాబోయే భర్తతో తల్లి అలా మాట్లాడడం చూసి జీర్ణించుకోలేకపోయిన అమ్మాయి.. పెళ్లి రద్దు చేయాలని తన తండ్రికి చెప్పింది. అందుకు కారణం కూడా వివరించింది. దీంతో అతడు ఈ పెళ్లిని క్యాన్సిల్ చేశాడు. అలాగే భార్యకు తీరు మార్చుకోవాలని గట్టిగా హెచ్చరించాడు. ఆపై మరో అబ్బాయిని చూసి కుమార్తెకు పెళ్లి నిశ్చయించాడు. ఇలా రోజులు గడుస్తుండగా.. సదరు మహిళ మాత్రం.. తొలుత కుమార్తెకు నిశ్చయమైన పెళ్లి కొడుకుతో మాట్లాడుతూనే ఉంది. తరచుగా ఫోన్లు చేసుకోవడం, చాటుమాటుగా కలవడం కూడా చేశారు. అయితే ఇలాగే ఉంటే తమను కలవనివ్వరని భావించిన వీళ్లు.. ఇరు కుటుంబాలకు తెలియకుండా ఓరోజు పారిపోయారు. అయితే విషయం తెలియని ఇరు కుటుంబాలు వారి కోసం తీవ్రంగా గాలించాయి. ముందునుంచి భార్యపై అనుమానం ఉండగా.. సదరు యువకుడి ఇంటికి ఫోన్ చేసి మీ అబ్బాయి ఉన్నాడా అని అడిగాడు అమ్మాయి తండ్రి. వారు కూడా తమ కుమారుడు కనిపించడం లేదని చెప్పగా.. వీరిద్దరూ కలిసే పారిపోయారని గుర్తించాడు. వెంటనే పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వీరు ఎక్కడికి వెళ్లారు, ఏం చేస్తున్నారో తెలుసుకునేందుకు తీవ్రంగా గాలిస్తున్నారు.

## పెహల్‌గామ్ ఉగ్రదాడి వెనుక లష్కరే తోయిబా కమాండర్ కీలక పాత్ర.. గుర్తించిన ఎన్ఐఏ




**న్యూఢిల్లీ-నవభూమి:** ఈనెల 22న జమ్ముకశ్మీర్‌లోని పెహల్‌గామ్‌లో మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరాన్ వ్యాలీలో ఉగ్రవాదులు నరమేధం సృష్టించిన విషయం తెలిసిందే. టూరిస్ట్‌లే లక్ష్యంగా విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై ఎన్ఐఏ (జాతీయ దర్యాప్తు సంస్థ) దర్యాప్తును ముమ్మరంగా చేస్తోంది. ఈ దర్యాప్తులో కీలక విషయాలు వెల్లడవుతున్నాయి. తాజాగా పెహల్‌గామ్ ఉగ్రదాడి వెనుక లష్కరే తోయిబా కమాండర్ ఫరూక్ అహ్మద్ కీలక పాత్ర పోషించినట్లు తెలిసింది. ఈ మేరకు ఎన్ఐఏ వర్గాలు వెల్లడించినట్లు జాతీయ మీడియా నివేదిస్తోంది. సదరు నివేదికల ప్రకారం.. పెహల్‌గామ్ దాడి తర్వాత కశ్మీర్ లోయలో భద్రతా బలగాలు ఉగ్రవాదుల కోసం వేట మొదలు పెట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పలు జిల్లాల్లోని ఉగ్రవాదులు, అనుమానితుల ఇళ్లను బాంబులతో పేల్చేస్తున్నాయి. కుప్వారాలోని ఫరూక్ అహ్మద్ ఇంటిని కూడా భద్రతా దళాలు ఇటీవలే కూల్చేశాయి. అహ్మద్ ప్రస్తుతం పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. తన స్లీపర్ సెల్ నెట్‌వర్క్ ద్వారా గత రెండేళ్లుగా కశ్మీర్‌లో పలు ఉగ్రదాడులు నిర్వహించడంలో అహ్మద్ కీలక పాత్ర పోషించినట్లు ఎన్ఐఏ గుర్తించింది. వీటిలో తాజాగా జరిగిన పెహల్‌గామ్ దాడి ఒకటి. ఇక పాకిస్థాన్‌లోని మూడు సెక్టార్ల నుంచి కశ్మీర్‌లోకి ఉగ్రవాదులు చొరబడేందుకు అహ్మద్ సహకరిస్తున్నట్టు ఎన్ఐఏ వర్గాలు తెలిపాయి. ఈ లష్కర్ కమాండర్‌కు లోయలోని పర్వత మార్గాల గురించి విస్తృతమైన పరిజ్ఞానం ఉందని పేర్కొన్నాయి. నిఘా వర్గాల ప్రకారం.. అహ్మద్ 1990 నుంచి 2016 వరకూ పాక్ %-% భారత్ మధ్య పలుమార్లు ప్రయాణించినట్లు గుర్తించారు. పెహల్‌గామ్ దాడి తర్వాత ఫరూక్ అహ్మద్ సహాయకులను భద్రతా దళాలు అదుపులోకి తీసుకున్నాయి. గత రెండేళ్లుగా.. అహ్మద్ పాకిస్థాన్ నుంచి పనిచేస్తూ కశ్మీర్‌లోని తన నెట్‌వర్క్‌ను సంప్రదించడానికి సురక్షిత కమ్యూనికేషన్ యాప్‌లను ఉపయోగిస్తున్నట్లు కూడా నిఘా వర్గాలు తెలిపాయి.

# డిజిటల్ యాక్సెస్ ప్రాథమిక హక్కు.. సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ-నవభూమి:** డిజిటల్ యాక్సెస్ ప్రాథమిక హక్కని, గ్రామీణ ప్రాంతాలు సహా సమాజంలోని ప్రతి ఒక్కరికీ డిజిటల్ యాక్సెసిబిలిటీని నిర్ధారించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. డిజిటల్ అంతరాన్ని తగ్గించడం ఇకపై విధానపరమైన విచక్షణకు సంబంధించిన అంశం కాదని, వ్యక్తి గౌరవప్రదమైన జీవితాన్ని పొందేందుకు రాజ్యాంగబద్ధంగా కల్పించిన తప్పనిసరి హక్కు అని కోర్టు పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్ మహాదేవన్‌ల ధర్మాసనం.. రెండు ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. ఇందులో ఒకటి యాసిడ్ బాధితురాలికి సంబంధించి ఆమె బ్యాంకు ఖాతాలో ప్రక్రియ సమయంలో ఎదుర్కొన్న సమస్యలను ప్రస్తావించింది. అన్ని ప్రభుత్వ పథకాలకు కేవైసీ తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే. "జీవితం, స్వేచ్ఛకు సంబంధించిన హక్కులో భాగంగా డిజిటల్ యాక్సెస్ హక్కు ప్రత్యేకంగా గుర్తింపబడింది.. గతంలో నిర్లక్ష్యానికి గురైన సమూహాలకూ డిజిటల్ సేవలు అందేలా ప్రభుత్వం ముందడుగు వేసి. అన్ని వర్గాలకూ డిజిటల్ వ్యవస్థను అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉంది' అని కోర్టు వ్యాఖ్యానించింది. ప్రధానంగా ఆరోగ్య సంరక్షణ వంటి సేవలు సైతం డిజిటల్ మాధ్యమాల ద్వారానే అందుతున్న నేపథ్యంలో ఆర్టికల్ 21 కింద ఉన్న జీవించే హక్కును కూడా టెక్నాలజీ ఆధారిత వాస్తవాలతో అన్వయించుకోవాల్సిన అవసరం ఉందని కోర్టు స్పష్టం చేసింది. ప్రక్రియను మరింత సులభతరంగా మార్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, మార్గదర్శకాలను అత్యవసరంగా సవరించాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ కోర్టు 20 ఆదేశాలు జారీ చేసింది.

## పాల ధరలను పెంచిన మదర్ డెయిరీ.. లీటరుపై ఎంతంటే..?




**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ మదర్ డెయిరీ ) వినియోగదారులకు షాకిచ్చింది. పాల ధరలను భారీగా పెంచేసింది . అన్ని రకాల ఉత్పత్తులపై రూ.2 మేర ధరలు పెంచినట్లు మదర్ డెయిరీ బుధవారం ఉదయం తెలిపింది. పెరిగిన ధరలు దేశవ్యాప్తంగా నేటి నుంచే (ఏప్రిల్ 30) అమల్లోకి రానున్నాయి. తాజా పెంపుతో టోన్డ్ మిల్క్ (బల్క్ వెండెడ్ మిల్క్) లీటర్ ధర రూ.2 పెరిగి రూ.54 నుంచి రూ.56కు చేరింది. ఫుల్ క్రీమ్ పాలు ధర లీటరుకు రూ.69కి పెరిగింది. ఇక ఆవుపాల ధరలు లీటరుకు రూ.57కి, డబుల్ టోన్డ్ పాల ధర లీటరు రూ.51కి చేరింది. ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో మదర్ డైరీ అత్యధిక స్థాయిలో పాలను అమ్ముతోంది. ఆ నగరంలో రోజుకు సుమారు 35 లక్షల లీటర్ల పాలను సరఫరా చేస్తోంది. ఢిల్లీతోపాటు ఉత్తరప్రదేశ్, హర్యానా, ఉత్తరాఖండ్, బీహార్ వంటి ఇతర రాష్ట్రాల్లో కూడా పెద్ద సంఖ్యలో పాలను సరఫరా చేస్తోంది. చివరిసారి మదర్ డెయిరీ పాల ధరలను గతేడాదిన జూన్‌లో పెంచిన విషయం తెలిసిందే. అప్పుడు కూడా అన్ని రకాల పాలపై లీటరుకు రూ.2 పెంచింది.

# పాక్ నటికి పానీ బాటిల్స్ గిఫ్ట్... భారత ఫ్యాన్స్ వీడియో వైరల్!



**పాకిస్థాన్-నవభూమి:** పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఆ ఉగ్రదాడి వెనుక పాకిస్థాన్ హస్తం పక్కాగా ఉందని బలంగా నమ్ముతున్న భారత్.. దౌత్యపరమైన చర్యలు తీసుకుని ఇప్పటికే షాకిచ్చింది. త్వరలో సైనిక చర్యలు ఉండే అవకాశం ఉందనే చర్చలు జరుగుతున్నాయి. మరోపక్క.. సీమాంతర ఉగ్రవాదం, దాని సూత్రధారులపై చర్యలు ఎప్పుడు, ఎలా తీసుకోవాలన్న విషయంలో సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నట్లు మోడీ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ సమయంలో ఓ ఆసక్తికర విషయం తెరపైకి వచ్చింది. పాకిస్థాన్ నటికి భారత్ ఫ్యాన్ వాటర్ బాటిల్స్ గిఫ్ట్ పంపినట్లు వీడియో హల్ చల్ చేస్తోంది. అవును... పహల్గాం దాడి అనంతరం భారత్ దౌత్యపరమైన చర్యలు తీసుకున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా... సింధూ నదీ జలాల ఒప్పందాన్ని సస్పెండ్ చే స్తున్నట్లు ప్రకటించింది. దీంతో.. త్వరలో పాక్ ఎడారి కాబోతుందనే విశ్లేషణలు మొదలయ్యాయి. దీంతో.. పాకిస్థాన్ లోని నటికి భారత్ ఫ్యాన్స్ వాటర్ బాటిల్స్ గిఫ్ట్ పంపుతున్నారు! ఇందులో భాగంగా... పాకిస్థాన్ నటి హనియా అమీర్ కు భారత అభిమానులు వాటర్ బాటిళ్లు పంపినట్లుగా ఉన్న ఓ వీడియో ఇప్పుడు వైరల్ గా మారింది. ఆ బాక్స్ పై... హనియా అమిరీ, రావల్పిండి, పంజాబ్, పాకిస్థాన్ అని "టు" అడ్రస్ ఉండగా... ఫ్రమ్ అడ్రస్ లో ఇండియా అని రాసి ఉంది. ఈ క్లిప్ వైరల్ గా మారింది. ప్రముఖ పాకిస్థానీ నటి హనియా కు భారత్ లో ఫ్యాన్స్ బాగానే ఉన్నారు! ఈ సమయంలో ఆమె రాబోయే సినిమా "సర్దార్ జీ 3"లో దిల్జీత్ దోసాంజ్ సరసన నటించగా.. ప్రస్తుత పరిస్థితులు దాన్ని ప్రభావితం చేయొచ్చని అంటున్నారు. ఈ సినిమా షూటింగ్ యూకే లో గత నెలలో పూర్తైనట్లు తెలుస్తోంది. అయితే తాజా పరిస్థితుల నేపథ్యంలో ఆమె నటించిన సన్నివేశాలను మరో నటితో రీషూట్ చేయాలనే ఆలోచనలో చిత్ర యూనిట్ ఉన్నట్లు తెలుస్తోంది. మరోపక్క ఈ వీడియోను కొంతమంది నెటిజన్లు సరదాగా భావిస్తుండగా.. ఇలాంటి పరిస్థితుల్లో ఇటువంటి మీమ్స్ అవసరమా అని మరికొంతమంది ప్రశ్నిస్తున్నారు. ఇదే సమయంలో పహల్గాం దాడి ఘటనను ఖండించిన వారిలో హనీయా ఒకరని గుర్తు చేస్తున్నారు!

## అమెరికాలో భార్య, కొడుకును చంపి ఆత్మహత్య చేసుకున్న భారతీయ రోబోటిక్స్ వ్యాపారి



**న్యూఢిల్లీ-నవభూమి:** అమెరికాలో నివాసం ఉంటున్న భారతీయ సంతతి టెకీ పారిశ్రామికవేత్త హర్షవర్ధన్ తన భార్య, కుమారుడిని చంపేశాడు. ఈ ఘటన వాషింగ్టన్ సమీపంలోని న్యూకాసిల్‌లో జరిగింది. ఏప్రిల్ 24వ తేదీన మర్డర్ జరిగినట్లు భావిస్తున్నారు. భార్య, కొడుకును చంపిన తర్వాత ఆ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ హత్య జరిగిన సమయంలో మరో కొడుకు వేరేచోట ఉన్నాడు. హర్షవర్ధన్ భార్య శ్వేతా పాన్యం, 14 ఏళ్ల కుమారుడు ప్రాణాలు కోల్పోయారు. హత్యకు దారి తీసిన కారణాలు ఇంకా తెలియరాలేదు. మర్డర్ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిజానికి ఆ కుటుంబం స్నేహపూర్వకంగా ఉంటుందని, కానీ రిజర్వ్‌గా ఉంటారని పొరుగువాళు చెబుతున్నారు. కర్నాటకలోని మాండ్య జిల్లాకు చెందిన కేఆర్ పేట్ తాలూక హర్షవర్ధన్ స్వగ్రామం. మైసూరుకు చెందిన రోబోటిక్స్ కంపెనీ హోలోవరల్డ్ సీఈవో హర్షవర్ధన్ ఉన్నారు. ఆ కంపెనీ సహ వ్యవస్థాపకురాలిగా అతని భార్య కొనసాగుతున్నారు. 2017లో హర్షవర్ధన్, శ్వేత జంట హోలోవరల్డ్ కంపెనీ స్థాపించారు. కోవిడ్19 వల్ల 2022లో ఆ కంపెనీ మూసివేశారు. ఓ దశలో ప్రధాని మోదీతో హర్షవర్ధన్ భేటీ అయ్యారు. బోర్డర్ భద్రతలో రోబోలను వినియోగించే అంశంపై చర్చించారు. రోబోటిక్స్‌లో నిపుణుడైన హర్షవర్ధన్ గతంలో అమెరికాలోని మైక్రోసాఫ్ట్ సంస్థలో పనిచేశాడు.

# ఏపీ మద్యం స్కాం.. రూ.3,200 కోట్లు పైనే..?

**ఏపీ -నవభూమి:** ఏపీ మద్యం స్కాంలో కమీషన్ల కింద పోగేసిన మొత్తం భారీగా ఉందని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు గుర్తించారని చెబుతున్నారు. తొలుత అంచనా వేసినట్లు రూ.3,200 కన్నా ఎక్కువగానే మద్యం దందా నడిపినట్లు సిట్ ఆధారాలు సేకరించిందని ప్రచారం జరుగుతోంది. కీలక నిందితుడు రాజ్ కసిరెడ్డి అరెస్టు, ఆ తర్వాత విచారణలో మద్యం స్కాంలో కమీషన్ పై సిట్ అధికారులు పక్కా లెక్కలు సేకరించిందని ప్రచారం జరుగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి మద్యం స్కాంపై ప్రత్యేక ఫోకస్ పెట్టిన విషయం తెలిసిందే. తొలుత సీఐడీ అధికారులతో విచారణ జరిపించిన ప్రభుత్వం.. కేసులో పెద్దల హస్తం ఉందని బయటపడటంతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. విజయవాడ పోలీసు కమిషనర్ రాజశేఖర్ బాబు ఆధ్వర్యంలో ఆరుగురు సీనియర్ పోలీసు అధికారులు ఈ కేసు దర్యాప్తును పర్యవేక్షిస్తున్నట్లు చెబుతున్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఏడాది అక్టోబరులో నూతన మద్యం పాలసీని అమలులోకి తీసుకువచ్చారు. అప్పటి నుంచి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేవరకు ప్రభుత్వమే మద్యం షాపులను నిర్వహించింది. అయితే ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అంతకు ముందు ఉన్న బ్రాండ్లను కాకుండా అప్పటి ప్రభుత్వ పెద్దలకు కమీషన్లు ఇచ్చే కంపెనీలకే ఆర్డర్లు ఇచ్చారని కూటమి ప్రభుత్వం ఆరోపిస్తోంది. అంతేకాకుండా అనామక బ్రాండ్లను తీసుకువచ్చి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడారని ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. దీంతో అధికారం చేపట్టగానే తొలుత మద్యం స్కాం మూలాలు వెలికితీసే పని ప్రారంభించింది. కేసు దర్యాప్తులో ప్రతి నెలా రూ.60 కోట్లు చొప్పున మొత్తం రూ.3,200 కోట్లు కమీషన్ కింద పోగేసినట్లు తొలుత అభియోగాలు మోపారు. అయితే కీలక నిందితులను అదుపులోకి తీసుకున్న తర్వాత ఈ మొత్తంపై ఇంకా స్పష్టత వచ్చినట్లు చెబుతున్నారు. ప్రభుత్వం, సిట్ పోలీసులు అనుమానిస్తున్న మొత్తం రూ.3,200 కోట్లకు మించి ఎక్కువగా కమీషన్ రూపంలో దండుకున్నట్లు చెబుతున్నారు. గతంలో దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ఢిల్లీ లిక్కర్ స్కాం ను తలదన్నేలా ఏపీలో మద్యం కుంభకోణం జరిగిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై సిట్ మరింత దృష్టి పెట్టి దర్యాప్తు చేస్తున్నట్లు చెబుతున్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 | హైదరాబాద్
గురువారం
01 । మే । 2025



## కర్రెగుట్ట కొండను స్వాధీనం చేసుకున్న భద్రతా బలగాలు.. త్రివర్ణ పతాకం



**బిజాపూర్-నవభూమి:** ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ ఏరివేత ఆపరేషన్‌లో బుధవారంనాడు కీలక పరిణామం చోటుచేసుకుంది. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న నక్సల్స్ అధీనంలోని కర్రెగుట్ట కొండను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఆ ప్రాంతాన్ని నక్సల్స్ నుంచి విముక్తి చేస్తూ... తమ విజయానికి చిహ్నంగా కొండ పైభాగంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఇందుకు సంబంధించిన స్క్రీన్‌షాట్‌ను షేర్ చేశారు. కుల్స్ ఏరివేతలో భాగంగా గతవారంలో ఈ అతిపెద్ద ఆపరేషన్‌ను బలగాలు చేపట్టాయి. బుధవారంతో యాంటీ నక్సల్స్ ఆపరేషన్ తొమ్మిదో రోజుకు చేరింది. ఎయిర్ డ్రాప్ ద్వారా కమాండోలు కొండపైకి చేరుకుని ఆపరేషన్ చేపట్టారు. వివిధ యూనిట్లకు చెందిన సుమారు 24,000 మంది భద్రతా సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. డిస్ట్రిక్ రిజర్వ్ గార్డ్, బస్తర్ ఫైటర్లు, స్పెషల్ టాస్క్ ఫోర్స్, రాష్ట్ర పోలీసు విభాగాలు, సీఆర్‌పీఎఫ్, ఎలైట్ కమండో బెటాలియన్స్ ఫర్ రిజల్యూట్ యాక్షన్ (కోబ్రా) కమెండోలో ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. ఈ ప్రాంతంలో సుమారు 2,000 సాయుధ నక్సలైట్లు భద్రతా బలగాల ట్రాప్‌లో చిక్కినట్టు తెలుస్తోంది. కర్రెగుట్ట కొండ ఐదు వేల అడుగుల ఎత్తులో ఉండే పర్వత ప్రాంతం కావడంతో పాటు, ప్రస్తుతం ఆ కొండపై ఉష్ణోగత 40 నుంచి 45 డిగ్రీల సెల్సియస్ ఉంది. నక్సల్స్ ఏరివేతే లక్ష్యంగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన బలగాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి.

## వంద రోజుల్లోనే కిందకు

ప్రతి వంటవాడూ పరిపాలించగలడు ప్రాచీన గ్రీకు ప్రజాస్వామ్య స్ఫూర్తిని ట్రినిడాడ్ రచయిత, మార్క్సిస్టు చింతకుడు సిఎల్‌ఆర్ జేమ్స్ అలా స్ఫూర్తిదాయకంగా సంక్షేపించాడు. ఆయనే గత శతాబ్ది మధ్యనాళ్లలో అమెరికా వినోద పరిశ్రమ హాలీవుడ్ ధోరణులను నిశితంగా విశ్లేషిస్తూ అమెరికా ఉదారవాద సంస్కృతి క్షీణముఖం పట్టి నియంతృత్వ పాలకులు ప్రభవించవచ్చని భావించాడు. జేమ్స్ భయాలు 21వ శతాబ్దిలో, ముఖ్యంగా డోనాల్డ్ ట్రంప్ రాజకీయ రంగంలోకి వచ్చిన తరువాత నిజమవుతున్న సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ట్రంప్ రెండోసారి అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టి నేటితో 100 రోజులు పూర్తవుతున్న సందర్భంగా అమెరికా ప్రజానీకం, మేధో శ్రేణులు, రాజకీయ వర్గాలలోనూ అటువంటి అభిప్రాయాలే గట్టిగా వ్యక్తమవుతున్నాయి. 'అమెరికా రాజ్యాంగం ప్రమాదంలో పడింది. పౌర, మానవ హక్కులు అణచివేయబడుతున్నాయి. ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమైపోయింది. ప్రజాస్వామ్యం, ఆర్థిక వ్యవస్థ ఏమైపోయినా ట్రంప్‌కు కావాల్సింది మాత్రం అవధులు లేని సంపూర్ణ అధికారం. నియంతృత్వంలోకి అమెరికా జారిపోతోంది' అని బిల్‌క్లింటన్ ప్రభుత్వంలో కార్మిక శాఖ కార్యదర్శిగా ఉన్న రాబర్ట్ రెయిష్ వాపోయారు. గత నవంబర్‌లో అధ్యక్ష ఎన్నికలలో అమెరికా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఎంతో నమ్మకంతో ట్రంప్‌ను భారీ మెజారిటీతో గెలిపించారు. అయితే పదవీ బాధ్యతలు చేపట్టిన క్షణం నుంచీ ట్రంప్ చేపడుతున్న చర్యలేవీ అత్యధికులకు ఆమోదయోగ్యంగా లేవు. పెంగ్విన్ పక్షులు మాత్రమే ఉండే ఒక దీవితో సహా ప్రపంచ దేశాలన్నిటిపైనా ఆయన ప్రారంభించిన సుంకాల యుద్ధం తమను తీవ్ర ఆర్థిక మాంద్యంలోకి నెట్టి వేస్తోందని అమెరికన్లు ఆందోళన చెందుతున్నారు. ఈ కారణంగానే గత ఎనభై సంవత్సరాలలో ఏ అధ్యక్షుడి వంద రోజుల పాలన కంటే ట్రంప్ తొలి వంద రోజులు (ఇప్పుడేకాదు, మొదటి పర్యాయం కూడా) అధ్వాన్నంగా ఉన్నట్టు అనేక సర్వేలలో వెల్లడయింది. ట్రంప్ 'అమెరికా ఫస్ట్' విధానంతో చిరకాలంగా నమ్మకమైన మిత్రులుగా ఉన్న యూరోపియన్ దేశాలు అమెరికాపై చిరచిరలాడుతున్నాయి.

అధికారాన్ని అప్పగిస్తే ఉక్రెయిన్ యుద్ధాన్ని 24 గంటలలో నిలిపివేస్తానన్న ట్రంప్‌ను రష్యా లెక్క చేయడం లేదు. యూరోప్‌లో శాంతి సుదూర గమ్యంగా మిగిలిపోయింది. పశ్చిమాసియాలో అమెరికా ప్రయోజనాలకే కాదు, తన సొంత కుటుంబ లబ్ధి కోసం కూడా మానవతను హతమారుస్తున్న ఇజ్రాయిల్‌ను ట్రంప్ వెనకేసుకొస్తున్నాడు. భౌగోళిక సామ్రాజ్యవాదానికి మళ్లీ ఊపిరిపోయడానికి సిద్ధమైన ట్రంప్‌కు కెనడా ఓటర్లు తమ పార్లమెంటరీ ఎన్నికలలో చెంపపెట్టు లాంటి తీర్పునిచ్చారు. కెనడా 51వ రాష్ట్రంగా అమెరికాలో చేరాలని సతాయిస్తున్న ట్రంప్‌కు వందరోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కెనడియన్లు మంచి గుణపాఠమే చెప్పారు. అమెరికాను మళ్లీ గొప్పదేశంగా చేయాలన్న ఆరాటంతో ట్రంప్ పూర్తిగా అసంబద్ధ విధానాలను అనుసరిస్తున్నారు. ఏ రంగమూ ఆరోగ్యకరంగా అభివృద్ధి చెందేందుకు అవి తోడ్పడేవి కావు. విద్యావేత్తలు, విద్యార్థులు, పాత్రికేయులు, మేధావులు, వృత్తి నిపుణులు అందరూ ట్రంప్ ప్రభుత్వం పట్ల అసంతృప్తితో రగిలిపోతున్నారు. చివరకు ట్రంప్ నియమించిన న్యాయమూర్తులు సైతం ఆయన నిర్ణయాలను వ్యతిరేకిస్తూ తీర్పులు వెలువరిస్తున్నారు. ఇంతవరకు ఆయన తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన చర్యలపై వ్యక్తులు, ప్రభుత్వాలు, వృత్తి సంఘాలు, ప్రజాసముదాయాలు న్యాయపోరాటాలు చేస్తున్నాయి. సమీప భవిష్యత్తులోనే సుప్రీంకోర్టు తీర్పులను సైతం ధిక్కరించడానికి ట్రంప్ సాహసించవచ్చని రిపబ్లికన్ పార్టీ వర్గాలే కలవరపడుతున్నాయి. దీన్ని బట్టి అమెరికా 47వ అధ్యక్షుడు ఎంత ఏకపక్షంగా వ్యవహరిస్తున్నదీ అర్థం చేసుకోవచ్చు. మాజీ అధ్యక్షుడు జో బైడెన్ గత జనవరిలో వైట్‌హౌజ్ నుంచి నిష్క్రమిస్తూ అమెరికా పాలనా వ్యవస్థ పూర్తిగా బిలియనీర్ల చేతుల్లోకి పోతుందని హెచ్చరించారు. అమెరికాలో ఇప్పుడు అల్పజన పాలన జరుగుతుందనడంలో సందేహం లేదు. ట్రంప్‌కు సన్నిహితులుగా ఉండి వివిధ ప్రభుత్వ విభాగాలకు ఆధ్వర్యం వహిస్తున్న ధనవంతులు అమెరికా ప్రయోజనాల కంటే సొంత లాభానికి ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేస్తున్నారు. దీంతో అమెరికా సమాజంలో అమానవీయమైన మనోవైఖరులు ప్రబలుతున్నాయి. సమాజజీవనంలో సంప్రదాయ విలువలు లుప్తమైపోతున్నాయి. అత్యున్నత స్థాయిలో అమెరికా ప్రభుత్వం తన మహోన్నత ప్రజాస్వామిక చరిత్రను విస్మరించి నిర్లజ్జగా సామ్రాజ్యవాద అభిజాత్యాలకు పోతోంది. అమెరికా ప్రభుత్వం చట్టాల చేత నడపబడేదేకాని, వ్యక్తులు నిర్వహించేదికాదని అమెరికా సంస్థాపకులలో ఒకరైన జాన్ ఆడమ్స్ ప్రవచించారు. ఆడమ్స్ భావాలకు పూర్తి భిన్నంగా ట్రంప్ ఏలుబడిలో వర్తమాన అమెరికా ఉన్నదని ప్రత్యేకంగా చెప్పాలా?

## పదేళ్ల "ముద్ర" ప్రస్థానం - కోట్లాది స్వప్నాలకు ఆర్థిక ఊతం



ఏ దేశ ఆర్థిక వ్యవస్థకైనా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు ఆయువుపట్టు వంటివి. ఇవి కేవలం ఉపాధి అవకాశాల సృష్టికర్తలు మాత్రమే కాదు, స్థానిక ఆర్థిక కార్యకలాపాలకు ఊపిరినిచ్చి, దేశ సమగ్రాభివృద్ధికి కీలక భూమిక పోషిస్తాయి. భారతదేశంలో ఈ రంగంలో అత్యధిక వాటా కలిగిన వీధి వ్యాపారులు, చిన్న దుకాణదారులు, కుటీర పరిశ్రమలు, స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులు వంటి సూక్ష్మ యూనిట్లు దీర్ఘకాలంగా బ్యాంకింగ్ వ్యవస్థ నుండి రుణాలను పొందడంలో ఒక తీవ్రమైన సమస్యను ఎదుర్కొన్నాయి. బ్యాంకులు సాధారణంగా పెద్ద రుణాలకు తగిన పూచీకత్తు చూపించగలిగిన వారికే ప్రాధాన్యతనివ్వడంతో ఈ చిన్న వ్యాపారుల ఆర్థిక అవసరాలు తీరక వారి వ్యాపారాలు ఎదగలేకపోయాయి. ఈ దుస్థితిని రూపుమాపి, అసంఘటిత రంగంలోని ఈ 'నిధులు అందని' విభాగానికి ఆర్థిక చేయూతనివ్వాలనే దృఢ సంకల్పంతో కేంద్రప్రభుత్వం ' ప్రధానమంత్రి ముద్ర యోజన ను ప్రారంభించింది.' ముద్ర ' ఆర్థిక చేరిక దిశగా ఒక

**కీలక అడుగు:**

భారతదేశంలో అసంఘటిత రంగం అతి పెద్దది. కోట్లాది మంది జీవనోపాధికి ఆధారం. ఈ రంగంలోని వ్యాపారులకు అధికారిక ఆర్థిక వ్యవస్థతో అనుసంధానం లేకపోవడం వల్ల వారు తమ వ్యాపారాలను విస్తరించుకోవడానికి, కొత్త సాంకేతికతను పొందడానికి, కొత్త ఉద్యోగాలు సృష్టించడానికి అవసరమైన ఆర్థిక వనరులను పొందలేకపోయారు. ఇది ఆర్థిక అసమానతలను పెంచడమే కాకుండా, దేశ సమగ్ర ఆర్థిక వృద్ధికి అవరోధంగా నిలిచింది. ఈ పరిస్థితిని మార్చి, అసంఘటిత రంగాన్ని ఆర్థిక వ్యవస్థలో భాగం చేసి, వారికి సులభంగా, సరసమైన వడ్డీ రేట్లతో రుణాలు అందించడం ద్వారా వారి ఆర్థిక సాధికారతను సాధించాలనేది ముద్ర యోజన వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం. ఇది ఆర్థిక చేరిక లక్ష్య సాధనలో ఒక ముఖ్యమైన ముందడుగు.

**ముద్ర యోజన ' లక్ష్యాలు:**

ప్రధానమంత్రి ముద్ర యోజన 2015 ఏప్రిల్ 8న ప్రారంభమైంది. దీని ప్రాథమిక లక్ష్యం సూక్ష్మ, చిన్న తరహా వ్యాపారాలకు రూ.10 లక్షల వరకు పూచీకత్తు అవసరం లేని రుణాలను అందించడం. ఈ పథకాన్ని పర్యవేక్షించడానికి, అమలు చేసే ఆర్థిక సంస్థలకు రీఫైనాన్స్ (పునరావృత రుణ సహాయం) అందించడానికి మైక్రో యూనిట్స్ డెవలప్‌మెంట్ అండ్ రీఫైనాన్స్ ఏజెన్సీ లిమిటెడ్ (ఎంయుడిఆర్‌ఎ - ముద్ర) సంస్థ ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, సహకార బ్యాంకులు, చిన్న ఆర్థిక బ్యాంకులు, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు, సూక్ష్మ ఆర్థిక సంస్థలు వంటివి ముద్ర రుణాలను లబ్ధిదారులకు అందిస్తాయి. వ్యాపార అవసరాలకు అనుగుణంగా, ముద్ర యోజన కింద రుణాలను మొదట్లో మూడు వర్గాలుగా విభజించారు:

- శిశు : కొత్తగా వ్యాపారం ప్రారంభించే వారికి రూ.50,000 వరకు రుణాలు.
- కిశోర్ : ఇప్పటికే ఉన్న వ్యాపారాల విస్తరణకు రూ.50,001 నుండి రూ.5,00,000 వరకు రుణాలు.
- తరుణ్ : వృద్ధి చెందిన వ్యాపారాల ఆధునీకరణకు రూ.5,00,001 నుండి రూ.10,00,000 వరకు రుణాలు.

**గరిష్ట పరిమితి పెంపు:**

ముఖ్యమైన అప్‌డేట్ ఏమిటంటే
కేంద్ర బడ్జెట్ 2024-25లో చేసిన ప్రకటన మేరకు అక్టోబర్ 2024 నుండి ముద్ర రుణాల గరిష్ట పరిమితిని రూ.10 లక్షల నుండి రూ.20 లక్షలకు పెంచారు. దీనితో పాటు, తరుణ్ కేటగిరీ కింద రుణాలు తీసుకుని విజయవంతంగా తిరిగి చెల్లించిన వారికి ఉద్దేశించిన 'తరుణ్ ప్లస్' అనే కొత్త కేటగిరీని ప్రవేశపెట్టారు, దీని కింద రూ.10 లక్షల నుండి రూ.20 లక్షల వరకు రుణాలు పొందవచ్చు. రూ.20 లక్షల వరకు రుణాలకు కూడా క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ ఫర్ మైక్రో యూనిట్స్ (సిజిఎఫ్ఎంయు) కింద గ్యారెంటీ లభిస్తుంది. ఇది పూచీకత్తు భారాన్ని తగ్గిస్తుంది.

**లబ్ధిదారుల అర్హత :**

భారతీయ పౌరులై ఉండి, తయారీ, వ్యాపారం, సేవలు రంగాలలో లేదా వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలలో (పంట సాగు మినహా) నిమగ్నమైన లేదా నిమగ్నం కావాలనుకునే సూక్ష్మ, చిన్న తరహా వ్యాపార యూనిట్ల యజమానులు అర్హులు. వీధి వ్యాపారులు, చిన్న దుకాణదారులు, రిపేర్ షాపుల నిర్వాహకులు, రవాణా వాహనాల యజమానులు (ఆటో రిక్షా, ట్రక్కులు మొదలైనవి), చిన్న తయారీ యూనిట్లు, చేతివృత్తుల కళాకారులు, సర్వీసు ప్రొవైడర్లు (ఉదాహరణకు, బార్బర్ షాపులు, బ్యూటీ పార్లర్లు, టైలర్లు), ఆహార విక్రయ యూనిట్లు, పండ్లు, కూరగాయల విక్రయదారులు, పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం, తేనెటీగల పెంపకం, చేపల పెంపకం, పండ్లు, కూరగాయల గ్రేడింగ్, ప్యాకేజింగ్ వంటి వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలు ముద్ర రుణాల పరిధిలోకి వస్తాయి. వ్యక్తులు, భాగస్వామ్య సంస్థలు, ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు కూడా సూక్ష్మ లేదా చిన్న తరహా పరిధిలో ఉంటే రుణం పొందవచ్చు.

**ప్రగతి పథంలో ముద్ర:**

ముద్ర యోజన దేశవ్యాప్తంగా అద్భుతమైన ప్రగతిని సాధించి, కోట్లాది మంది జీవితాల్లో ఆర్థిక స్థిరత్వాన్ని తీసుకువచ్చింది. ఏప్రిల్ 2025 వరకు అందుబాటులో ఉన్న అధికారిక గణాంకాలు ఈ పథకం యొక్క విస్తృత ప్రభావాన్ని తెలియజేస్తున్నాయి:

లి పథకం ప్రారంభం నుండి ఇప్పటివరకు సుమారు 52 కోట్లకు పైగా రుణ ఖాతాలు (లబ్ధిదారులుగా పరిగణించవచ్చు) ఏర్పడ్డాయి. ఇది దేశ జనాభాలో గణనీయమైన భాగాన్ని ఈ పథకం చేరిందని సూచిస్తుంది.

-ఈ రుణాల ద్వారా సుమారు రూ.33 లక్షల కోట్ల రూపాయలకు పైగా రుణాలు మంజూరు చేయబడ్డాయి. ఇది సూక్ష్మ వ్యాపార రంగంలోకి ప్రవహించిన భారీ ఆర్థిక వనరులను తెలియజేస్తుంది. సామాజిక న్యాయం, సాధికారత దృష్ట్యా ముద్ర ఒక గేమ్ ఛేంజర్. మొత్తం లబ్ధిదారులలో సుమారు 68% మంది మహిళలే ఉన్నారు. ఇది మహిళలు తమ స్వంత వ్యాపారాలను స్థాపించి, ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించడానికి ముద్ర ఎంతగానో తోడ్పడిందో స్పష్టం చేస్తుంది. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన తరగతులు వంటి సామాజికంగా బలహీన వర్గాలు కూడా ఈ పథకం ద్వారా అధికంగా లబ్ధి పొందాయి. సుమారు 50% - 51% మందికి పైగా లబ్ధిదారులు ఈ వర్గాలకు చెందినవారే. పంపిణీ అయిన రుణ ఖాతాల సంఖ్యలో సుమారు 78% వరకు శిశు కేటగిరీ (రూ.50,000 లోపు) కిందే ఉన్నాయి. ఇది పథకం తన ప్రాథమిక లక్ష్యమైన అత్యంత అట్టడుగు స్థాయి, కొత్తగా వ్యాపారం ప్రారంభించే వారికి చేరుకోవడంలో విజయం సాధించిందని తెలుపుతుంది. అయితే రుణాల మొత్తం విలువలో కిశోర్, తరుణ్ కేటగిరీల వాటా కూడా గణనీయంగానే ఉంది. ఈ గణాంకాలు ముద్ర యోజన కేవలం లక్ష్యాలకు పరిమితం కాకుండా నిజంగా క్షేత్ర స్థాయిలో కోట్లాది మంది సామాన్యుల జీవితాల్లో మార్పు తీసుకువచ్చిందని నిరూపిస్తున్నాయి.

**అమలు యంత్రాంగం:**

ముద్ర యోజనను కేంద్ర ప్రభుత్వం నేరుగా లబ్ధిదారులకు అమలు చేయదు. దీని అమలు బాధ్యతను ముద్ర లిమిటెడ్ పర్యవేక్షిస్తుంది. కేంద్ర ప్రభుత్వం ముద్ర లిమిటెడ్‌కు అవసరమైన మూలధనం, రీఫైనాన్సింగ్ నిధులను కేటాయిస్తుంది. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, ఎంఎఫ్‌ఐలు వంటివి ఈ నిధులను ఉపయోగించి క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులకు రుణాలను మంజూరు చేస్తాయి. పథకం విజయంలో బ్యాంకుల క్రియాశీలక పాత్ర అత్యంత కీలకం. వారి విస్తృత నెట్‌వర్క్, క్షేత్ర స్థాయి కార్యకలాపాలు పథకాన్ని సామాన్యుల చెంతకు చేర్చాయి.

ముద్ర యోజన కింద రుణాలపై ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వం నుండి సబ్సిడీ అంటూ ఏమీ లేదు. ఇది ఒక రుణ పథకం, సబ్సిడీ పథకం కాదు. అయితే ముద్ర లిమిటెడ్ ద్వారా బ్యాంకులకు తక్కువ వడ్డీకి రీఫైనాన్స్ లభించడం, రూ.20 లక్షల వరకు రుణాలకు క్రెడిట్ గ్యారెంటీ కల్పించడం వంటి చర్యల ద్వారా రుణాలపై వడ్డీ రేట్లు సాధ్యమైనంత వరకు సరసంగా ఉండేలా ప్రభుత్వం పరోక్షంగా సహాయపడుతుంది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పథకంపై అవగాహన కల్పించడంలో, లబ్ధిదారులను గుర్తించడంలో, రుణ మేళాలు నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

ముందంజలో ఉన్న రాష్ట్రాలు:

మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, గుజరాత్, ఉత్తరప్రదేశ్ వంటి ఆర్థికంగా చురుగ్గా ఉండే రాష్ట్రాలతో పాటు, బీహార్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు కూడా లబ్ధిదారుల సంఖ్యలో ముందంజలో ఉన్నాయి. మొత్తం రుణాల పంపిణీలో ఏ బ్యాంకు ముందుంది అనేది నిర్దిష్ట కాల వ్యవధిలో మారుతుంది, కానీ ప్రభుత్వ రంగ బ్యాంకులు తమ విస్తృత నెట్‌వర్క్ కారణంగా సింహభాగం పంపిణీ చేస్తున్నాయి. మన తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు కూడా ముద్ర యోజన అమలులో చురుగ్గా పాల్గొంటున్నాయి. స్వయం సహాయక బృందాలు, చిన్న వ్యాపారుల ద్వారా ఈ రాష్ట్రాలు గణనీయమైన ప్రగతిని సాధించాయి. అనేక మంది మహిళలు, సాంప్రదాయ వృత్తుల వారు ఇక్కడ ముద్ర రుణాల ద్వారా లబ్ధి పొందారు. జాతీయ స్థాయిలో తెలుగు రాష్ట్రాలు కూడా పథకం విజయానికి తమదైన తోడ్పాటును అందిస్తున్నాయి.

**ఎదురవుతున్న సవాళ్లు:**

ముద్ర యోజన గణనీయమైన ప్రగతి సాధించినప్పటికీ అమలులో కొన్ని సవాళ్లను ఎదుర్కొంటోంది. పూచీకత్త లేని రుణాలు, చిన్న మొత్తంలో అధిక సంఖ్యలో ఖాతాలు నిర్వహించడం వల్ల బ్యాంకుల నిరర్థక ఆస్తులు పెరిగే ప్రమాదం ఉందని ఒక ప్రధాన విమర్శ. రుణాల సక్రమ వినియోగం, తిరిగి చెల్లింపులో కొందరు లబ్ధిదారులు విఫలమవుతున్నారు. అలాగే, అధిక శాతం రుణాలు శిశు కేటగిరీ కిందే మంజూరు కావడం వల్ల, ఇవి నిజమైన వ్యాపార విస్తరణకు సరిపోవని, కేవలం చిన్నపాటి అవసరాలకే సరిపోతాయని, కిశోర్ , తరుణ్ కేటగిరీ రుణాల లభ్యత ఇంకా ఆశించిన స్థాయిలో లేదని విమర్శలున్నాయి. మారుమూల ప్రాంతాల్లో పథకంపై పూర్తి అవగాహన లోపం, బ్యాంకుల వద్ద దరఖాస్తు ప్రక్రియ సంక్లిష్టంగా ఉండటం, అవసరమైన పత్రాల సేకరణలో ఇబ్బందులు ఇతర సవాళ్లు. రుణం పొందిన తర్వాత వ్యాపార నిర్వహణపై తగిన మార్గదర్శకత్వం, పర్యవేక్షణ లోపం వల్ల నిధులు దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉంది. బ్యాంకర్లలో చిన్న రుణ ఖాతాల నిర్వహణ పట్ల సంకోచం కూడా ఒక అడ్డంకిగా మారుతోంది.

**పరిష్కార మార్గాలు:**

ముద్ర యోజనపై కొన్ని విమర్శలున్నా దాని ఆవశ్యకత, సాధించిన ప్రగతి అభినందనీయం. ఈ పథకాన్ని మరింత విజయవంతం చేయడానికి సవాళ్లను అధిగమించడం ముఖ్యం. ఇందుకోసం కొన్ని చర్యలు చేపట్టాలి. అవి

అవగాహన పెంపుదల, సరళీకరణ: స్థానిక భాషల్లో, డిజిటల్ మాధ్యమాలతోపాటు క్షేత్ర స్థాయిలో విస్తృత ప్రచారం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. దరఖాస్తు ప్రక్రియను మరింత సరళతరం చేయాలి, ఆన్‌లైన్ పోర్టల్స్ ను మెరుగుపరచాలి.

- బ్యాంకర్లకు మద్దతు, శిక్షణ: ఎన్‌పీఏ రిస్క్‌లను తగ్గించడానికి బ్యాంకర్లకు అవసరమైన మద్దతు, నిర్వహణలో శిక్షణ ఇవ్వాలి. చిన్న రుణ ఖాతాల నిర్వహణకు వారి పని భారాన్ని తగ్గించడానికి సాంకేతిక పరిష్కారాలను ప్రోత్సహించాలి. కిశోర్, తరుణ్ రుణాలపై ప్రత్యేక దృష్టి సారించాలి.
- పర్యవేక్షణ, సహాయక వ్యవస్థ బలోపేతం: రుణం పొందిన తర్వాత వ్యాపార నిర్వహణపై, ఆర్థిక ప్రణాళికపై కనీస మార్గదర్శకత్వం అందించాలి. రుణాల సక్రమ వినియోగాన్ని పర్యవేక్షించడానికి, తిరిగి చెల్లింపులను ట్రాక్ చేయడానికి ఒక పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలి.
- నైపుణ్య శిక్షణతో అనుసంధానం: ముద్ర రుణాలను స్వయం ఉపాధికి సంబంధించిన నైపుణ్య శిక్షణ కార్యక్రమాలతో అనుసంధానించడం ద్వారా లబ్ధిదారులు వ్యాపారం ప్రారంభించడానికి అవసరమైన నైపుణ్యాలు, ఆర్థిక సహాయం రెండూ ఒకేసారి పొందేలా చూడాలి.
- రాష్ట్ర ప్రభుత్వాల క్రియాశీలక పర్యవేక్షణ: రాష్ట్ర స్థాయిలో పథకం అమలును నిరంతరం పర్యవేక్షిస్తూ, బ్యాంకులు, లబ్ధిదారుల మధ్య సమన్వయం లోపాలను సరిదిద్దడానికి వేగంగా స్పందించాలి.

**విప్లవాత్మక పథకం:**

ప్రధానమంత్రి ముద్ర యోజన భారతదేశ ఆర్థిక ప్రస్థానంలో ఒక విప్లవాత్మక పథకం. ఇది అసంఘటిత రంగానికి ఆర్థిక భద్రతను కల్పించి కోట్లాది మంది సామాన్య పౌరులను కేవలం ఉద్యోగస్తుల స్థాయి నుండి వ్యవస్థాపకులుగా ఎదిగే అవకాశాన్ని కల్పించింది. రూ.33 లక్షల కోట్లకు పైగా రుణాల పంపిణీ, 52 కోట్లకు పైగా రుణ ఖాతాలు, ముఖ్యంగా మహిళలు, బలహీన వర్గాలకు చేరిన ప్రయోజనాలు ఈ పథకం యొక్క విశాల ప్రభావాన్ని స్పష్టం చేస్తున్నాయి. రూ.20 లక్షలకు పెరిగిన రుణ పరిమితి, తరుణ్ ప్లస్ వంటి కొత్త కేటగిరీలతో ఈ పథకం మరింత మందికి చేరువ కానుంది. ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ, పైన సూచించిన పరిష్కారాలను అమలు చేస్తే, ముద్ర యోజన దేశంలోని ప్రతి చిన్న వ్యాపారానికి ఆయువుపట్టుగా నిలిచి, బలమైన, సమగ్రమైన భారత ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి కీలక పాత్ర పోషిస్తుందని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఈ ఆర్థిక విప్లవం విజయవంతం కావడానికి ప్రభుత్వం, బ్యాంకులు, రాష్ట్ర ప్రభుత్వాలు, లబ్ధిదారులందరి సమన్వయ కృషి నిరంతరాయంగా కొనసాగాలి.

**జనక మోహన రావు దుంగ**
**ఫోన్: 8247045230**




## డిజిటల్ లైంగిక నేరాలపై చట్టమేదీ?



స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్, సోషల్ మీడియాను వాడుకుని మహిళలపై డిజిటల్ హింస పెరుగుతున్నది. మహిళలు, బాలికల అభ్యంతరకర ఫొటోలను, వీడియోలను వారి అనుమతి లేకుండా వ్యాప్తిచేయడం లైంగిక వేధింపుల కంటే తీవ్రంగా విస్తరిస్తున్నది. ఈ తరహా నేర విధానం (మోడస్ ఒపెరాండి)పై ఉక్కుపాదం మోపి ఈ నేరాలను అరికట్టాలి. ఇందుకు తక్షణ కర్తవ్యంగా- ఈ నేరస్థులను కఠినంగా శిక్షించేందుకు చట్టం రూపొందించాలి. అప్‌లోడ్ అయిన ఫొటోలను, వీడియోలను త్వరగా తొలగించే సాధనాలను, మార్గాలను గుర్తించాలి. వాటిని బాధితులకు అందించాలి. అభ్యంతరకర వీడియోలను అప్‌లోడ్ చేస్తున్నప్పుడే గుర్తించి, తొలగించగలిగే సామర్థ్యం యూట్యూబ్ వంటి వేదికలకు ఉంది. ఈ వేదికలు కృత్రిమ మేధస్సుతో పాటు మానవ పర్యవేక్షణను కూడా ఉపయోగిస్తున్నాయి. కానీ, వాట్సాప్ వంటి వేదికలు ఎండ్%-%టు%-%ఎండ్ ఎన్‌క్రిప్షన్‌తో గోప్యతకు పెద్దపీట వేయడంతో అక్కడ అభ్యంతరకర సమాచారాన్ని ముందస్తుగా గుర్తించడం గాని, ప్రభుత్వ పర్యవేక్షణ గాని దాదాపు అసాధ్యం. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప వాట్సాప్ చర్యలు తీసుకోలేదు (అప్పుడు కూడా చివరి ఐదు సందేశాలు మాత్రమే పరిశీలనకు వెళ్తాయి). దీనివల్ల ఫిర్యాదు అందని పక్షంలో హానికరమైన కంటెంట్ విచ్చలవిడిగా వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం - 2000, సెక్షన్ 67ఎ ప్రకారం, అసభ్యకర ఫొటోలు, వీడియోలు షేర్ చేసినవారికి ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధించవచ్చు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (మధ్యవర్తి మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) నియమాలు -2021 ప్రకారం చట్టవిరుద్ధమైన సమాచారాన్ని తొలగించడానికి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు త్వరితగతిన చర్యలు తీసుకోవాలి. వ్యక్తిగత ఫిర్యాదుల కోసం ఫిర్యాదు అధికారిని నియమించి 24 గంటల్లోగా చర్య తీసుకోవాలి. కానీ ఇవి సరిపోవు. ప్రత్యేకంగా డిజిటల్ లైంగిక వేధింపులను అరికట్టేందుకు మరింత కఠినమైన, నిర్దిష్టమైన చట్టాల అవసరం ఉంది. సైబర్ నేరాలపై ఫిర్యాదుల కోసం 'నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్' (నంబర్: 1930)ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే, దీనికి ఆర్థిక నేరాలపైనే ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయి. దానితో ఈ పోర్టల్ డిజిటల్ లైంగిక వేధింపులపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేకపోతోంది. డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణ చట్టం-2023, సెక్షన్ 12(3) ద్వారా అభ్యంతరకర సమాచారం, ఫొటోలు, వీడియోలను ఇంటర్నెట్ నుంచి తొలగించాలని కోరే హక్కును పౌరులకు కల్పించింది. దీని ఉల్లంఘనలపై రూ.50కోట్ల వరకు జరిమానా విధించే అధికారం 'డేటా పరిరక్షణ బోర్డు'కు ఉంటుంది. ఈ చట్టం ఇంకా అమలులోకి రావాల్సి ఉంది.

## అక్షయ తృతీయ విశిష్టత ఏంటంటే..?



హిందూమతంలో అక్షయ తృతీయకు ఎంతో ప్రాధాన్యం ఉన్నది. ప్రతి ఏటా వైశాఖ మాసంలో శుక్లపక్షంలోని మూడో తదియ తిథి రోజున అక్షయ తృతీయ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. అక్షయ తృతీయను అఖా తీజ్‌గా పిలుస్తుంటారు. ఈ సారి ఈ నెల 30న అక్షయ తృతీయ వస్తున్నది. హిందువులకు ఈ పండుగను ఎంతో పవిత్రంగా భావిస్తారు. అందుకే ఈ రోజున బంగారం కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతుంటారు. అక్షయ తృతీయ రోజు కొనుగోలు చేసిన సంపద, ఆస్తిపాస్తులు ఎప్పటికీ మనతోనే ఉంటాయని.. దాంతో పాటు సుఖ సంతోషాలతో ఉంటారని విశ్వాసం. ఈ క్రమంలోనే బంగారం దుకాణాల వ్యాపారులు కొనుగోలుదారులను ఆకర్షించేందుకు డిస్కౌంట్, మేకింగ్ చార్జీలపై ఆఫర్స్‌ను ప్రకటించే విషయం తెలిసిందే.

**అక్షయ తృతీయ ప్రాముఖ్యత ఏంటంటే..**

సంస్కృతంలో 'అక్షయ' అంటే శాశ్వతమైంది.. క్షయం లేనిదని అర్థం ఉన్నది. ఇక తృతీయ అంటే మూడో తిథి అని అర్థం. అక్షయ తృతీయ రోజున ఏ పని ప్రారంభించినా.. చిన్న పెట్టుబడి పెట్టినా అనంతమైన శ్రేయస్సుతో పాటు అదృష్టాన్ని తీసుకువస్తుందని ప్రజల విశ్వాసం. బంగారాన్ని లక్ష్మీదేవికి ప్రతిరూపంగా భావిస్తుంటారు. వాస్తవానికి అక్షయ తృతీయ రోజున బంగారం కొనాలనే నిబంధన లేదు. ఈ క్రమంలో ఈ రోజున బంగారం కొనుగోలు చేయడం సంప్రదాయంగా వస్తున్నది. బంగారాన్ని సంపదకు, భద్రతకు చిహ్నంగా భావించి కొనుగోలు చేస్తూ వస్తుంటారు. బంగారంతో పాటు ఇతర విలువైన వస్తువులను కొనుగోలు చేస్తే కుటుంబంలో సంపద, సౌభాగ్యం కలుగుతుందని నమ్మకం. ఇదిలా ఉండగా.. అక్షయ తృతీయకు పౌరాణికంగానూ ఎంతో ప్రాధాన్యం ఉంది. నాలుగు యుగాల్లో రెండోదైన త్రేతాయుగం ఈ రోజునే ప్రారంభమైందని ఓ నమ్మకం. శ్రీ మహావిష్ణువు ఆరో అవతారమైన పరశురాముడు జన్మించింది సైతం ఇదే రోజునని.. మహాభారతాన్ని రచించిన వేదవ్యాస మహర్షి.. గణేశుడికి మహాభారతాన్ని చెప్పడం మొదలుపెట్టింది సైతం ఇదే రోజునేనని చెబుతుంటారు. శ్రీకృష్ణుడు చిన్నతనంలో తన మిత్రుడైన కుచేలుడిని కలిసింది కూడా అక్షయ తృతీయ రోజునేనని చెబుతుంటారు. పవిత్ర గంగానది సైతం భూమి పైకి వచ్చింది ఇదే రోజునని హిందువుల విశ్వాసం. అలాగే, పాండవుల వనవాసం సమయంలో వారికి చాలా ఆకలి వేస్తుంది. అప్పుడు సూర్య భగవానుడిని ప్రార్థించి తమకు ఆహారం కావాలని కోరుతారు. అప్పుడు సూర్య భగవానుడు వారికి ఒక అక్షయపాత్రని ఇస్తాడు. పాండవులు వారికి ఎప్పుడు ఆకలి వేస్తే అప్పుడు అక్షయపాత్రను పూజించగానే ఆహారం అందిస్తుందనేది నానుడి. అక్షయ తృతీయ రోజున పలువురు ఉపవాసం ఉంటూ వస్తారు. మహావిష్ణువుకు ప్రత్యేక పూజలు చేస్తారు. పసుపు, కుంకు మలతో కలిపిన అక్షతలను స్వామికి సమర్పిస్తారు. విష్ణువు, గణపతికి నైవేద్యం సమర్పిస్తారు. సంపదలకు అధిపతి అయిన కుబేరుడిని పూజించడం సైతం శుభప్రదంగా భావిస్తారు.


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
10 హైదరాబాద్
గురువారం
01 । మే । 2025




# లాస్ట్‌లో బిగ్ జర్క్.. ఫ్లాట్‌గా మార్కెట్ సూచీలు



**న్యూఢిల్లీ-నవభూమి:**బుధవారం స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్ గా ముగిశాయి. ఈ ఉదయం గ్యాప్ అప్ తో ఓపెన్ అయిన మార్కెట్లు అనంతరం కూడా బాగానే ముందుకు సాగాయి. అయితే, లాస్ట్ పావుగంటలో మార్కెట్ భారీగా పడిపోయింది. నిఫ్టీ, సెన్సెక్స్ రెండు సూచీలు కేవలం 15 నిమిషాల్లోనే రెండు వందలకు పైగా పాయింట్లు కోల్పోవడంతో మార్కెట్లు ఫ్లాట్ గా ముగియాల్సి వచ్చింది. లేదంటే ఇండియా.. పాకిస్థాన్ యుద్ధ సన్నాహాల నడుమ కూడా భారత మార్కెట్లు ఏమాత్రం జంకకపోవడం విశేషం. దీర్ఘకాలిక భౌగోళిక రాజకీయ ఆందోళనలు(ఇండియా – పాకిస్థాన్), మరో పక్క బజాజ్ ఫైనాన్స్ కార్పొరేట్ గైడెన్స్ కారణంగా బెంచ్‌మార్క్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ 50 అస్థిర ట్రేడింగ్ సెషన్‌ను దాదాపు ఫ్లాట్‌గా ముగించాయి. మార్కెట్లు ముగిసే సమయానికి, సెన్సెక్స్ 0.06 శాతం లేదా 46.14 పాయింట్లు పడిపోయి 80,242.24 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 0.01 శాతం లేదా 1.75 పాయింట్లు తగ్గి 24,334.20 వద్ద ముగిసింది. ఇవాళ బజాజ్ ఫైనాన్స్ షేరు ధర ఏకంగా రూ.479.50 పైసలు తగ్గింది. పాకిస్తాన్‌తో ఉద్రిక్తతలు పెరగడం, బజాజ్ ఫైనాన్స్ నిరాశపరిచే ఫార్వర్డ్ అవుట్‌లుక్ కారణంగా మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతింది. గత ఆరు సెషన్లలో ఐదు సెషన్లలో భారతీయ ఈక్విటీలు ఆసియా మార్కెట్ల సూచీల కంటే వెనుకబడి ఉన్నాయి. దీనికి విరుద్ధంగా, %మీూజ×% ఆసియా పసిఫిక్ ఇండెక్స్ బుధవారం 0.4 శాతం పెరిగింది.




# గూగుల్ పే ద్వారా రూ.12 లక్షల వరకు లోన్స్.. ఇలా ఈజీగా అప్లై చేసుకోండి..




**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రస్తుత జీవనశైలిలో అనేక మందికి ఆర్థిక అవసరాలు క్రమంగా పెరుగుతున్నాయి. సేవింగ్స్ చేసే ధోరణి క్రమంగా తగ్గుతోంది. ఇలాంటి క్రమంలో ఏదైనా పెద్ద మొత్తంలో నగదు కావాలంటే లోన్స్ కోసం అనేక యాప్స్ ఉపయోగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి వారికి గూగుల్ పే (%ఱఖుం%) ఈజీగా లోన్స్ అందిస్తోంది. రూ.30,000 నుంచి రూ.12 లక్షల వరకు లోన్లు తీసుకునే అవకాశం ఇస్తోంది. అయితే గూగుల్ పే నేరుగా రుణాలను అందించదు. భారతదేశంలోని ప్రముఖ బ్యాంకులతో భాగస్వామ్యం ద్వారా తక్షణ వ్యక్తిగత రుణాలను అందిస్తోంది.

**వడ్డీ రేటు 10.50% నుంచి**

ఈ క్రమంలో బ్యాంకు శాఖల చుట్టూ తిరిగే పనిలేకుండా గూగుల్ పే ద్వారా ఈజీగా లోన్స్ తీసుకోవచ్చు. తక్కువ డాక్యుమెంటేషన్‌తో వీటిని ఈజీగా పూర్తి చేసుకోవచ్చు. ఈ రుణాలు ప్రత్యేకంగా తక్షణ అవసరాల కోసం రూపొందించబడ్డాయి. పెళ్లిళ్లు, వైద్య ఖర్చులు, టూర్లు లేదా అప్పటికప్పటి ఖర్చులు ఏవైనా కావచ్చు. మీరు %+శీశీస్త్రశ్రీవ ఱఖుం% నుంచి రుణం తీసుకుంటే 10.50% నుంచి 15% వరకు వడ్డీ చెల్లించాల్సి రావచ్చు. మీ క్రెడిట్ స్కోరు ఆధారంగా వడ్డీ రేటు నిర్ణయించబడుతుంది.

**ఈ పర్సనల్ లోన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హతలు**

మీరు భారతదేశ పౌరులై, Google Pay%ని ఉపయోగిస్తూ ఉండాలి. లోన్ పొందడానికి, మీ CIBIL% స్కోరు బాగుండాలి. వ్యక్తిగత రుణం పొందడానికి, మీ వయస్సు 21 సంవత్సరాల నుంచి 57 సంవత్సరాల మధ్య ఉండాలి. పర్సనల్ లోన్ పొందడానికి, మీకు సొంత బ్యాంక్ ఖాతా కల్గి ఉండాలి.

పర్సనల్ లోన్ కోసం అవసరమైన పత్రాలు

ఆధార్ కార్డు, పాన్ కార్డ్, పాస్‌పోర్ట్ సైజు ఫోటో, గత 3 నెలల బ్యాంక్ ఖాతా స్టేట్‌మెంట్, మొబైల్ నంబర్, ఈ-మెయిల్ ఐడి మొదలైనవి అవసరం

**రుణం కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలి**

Google Pay% యాప్ తెరిచి, మనీ ట్యాబ్‌కు వెళ్లండి
లోన్స్ విభాగంలో అందుబాటులో ఉన్న ఆఫర్లను చూడండి
అందుబాటులో ఉన్న ఆఫర్‌పై నొక్కి, సూచనలను అనుసరించండి
ఆ తర్వాత %KYC% పత్రాలను అప్‌లోడ్ చేయండి,
రుణ ఒప్పందాలపై ఇ సంతకం చేయండి
లోన్ ఆమోదం పొందిన తర్వాత మొత్తం నేరుగా మీ బ్యాంక్ ఖాతాలో జమ చేయబడుతుంది

రుణం తిరిగి చెల్లింపు ప్రక్రియ

Google Payద్వారా రుణం నెలవారీ EMI మీ లింక్ చేయబడిన బ్యాంక్ ఖాతా నుంచి నేరుగా తీసివేయబడుతుంది. అందువల్ల, జరిమానాను నివారించడానికి తగిన సమయంలో చెల్లింపులు చేసుకోవాలి. రుణ దరఖాస్తు సమయంలో గడువు తేదీలు, మొత్తాలతో సహా తిరిగి చెల్లించే షెడ్యూల్ కూడా ప్రకటిస్తారు. రుణం తీసుకునే ప్రక్రియ పూర్తిగా డిజిటల్‌గా ఉంటుంది. ఎటువంటి పత్రాలను సమర్పించాల్సిన అవసరం లేదు. రుణం తీసుకునే వ్యక్తి వయస్సు కనీసం 21 సంవత్సరాలు ఉండాలి. అలాగే క్రమం తప్పకుండా ఆదాయ వనరును కలిగి ఉండటం చాలా ముఖ్యం.

# ఈ 15 బ్యాంకులు మే 1 నుంచి బంద్.. మీ డబ్బు భద్రమేనా..

**న్యూఢిల్లీ-నవభూమి:**మీకు మీ ప్రాంతంలోని ఒక గ్రామీణ బ్యాంకులో బ్యాంకు ఖాతా ఉందా, అయితే జాగ్రత్త. ఎందుకంటే మే 1 నుంచి దేశంలో ప్రతి రాష్ట్రానికి ఒక గ్రామీణ బ్యాంక్ మాత్రమే ఉంటుంది. ఇదే సమయంలో పలు రాష్ట్రాల్లో ఎక్కువగా ఉన్న అనేక గ్రామీణ బ్యాంకులు మే 1 నుంచి మూసివేయబడతాయి. కేంద్ర ప్రభుత్వ వన్ స్టేట్, వన్ రూరల్ బ్యాంక్ విధానం ప్రకారం ఈ బ్యాంకులు ఇతర బ్యాంకులతో విలీనం అవుతాయని తెలిపింది. ఈ కారణంగా దేశంలో గ్రామీణ బ్యాంకుల సంఖ్య 43 నుంచి 28కి తగ్గనున్నాయి. ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం ద్వారా బ్యాంకింగ్ సేవలను బలోపేతం చేయడం, వాటిని మరింత ప్రభావవంతంగా మార్చడమేనని వెల్లడించింది.

**ఈ 15 బ్యాంకులు బంద్**

11 రాష్ట్రాల్లో ప్రభుత్వ నిర్ణయం ప్రభావాన్ని మనం చూడవచ్చు. ఇందులో ఆంధ్రప్రదేశ్, యూపీ, పశ్చిమ బెంగాల్, బీహార్, గుజరాత్, జమ్మూ కశ్మీర్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, రాజస్థాన్ ఉన్నాయి. ఈ రాష్ట్రాల్లోని అన్ని గ్రామీణ బ్యాంకులు విలీనం చేయబడి ఆ రాష్ట్రంలో ఒక గ్రామీణ బ్యాంకుగా ఏర్పడతాయి. అయితే ఆయా బ్యాంకుల్లో ఖాతా ఉన్న వారి పరిస్థితి ఏంటి, డబ్బు భద్రమేనా వంటి విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.

**ఏం మారుతుంది..**

ఈ నిర్ణయం తర్వాత వినియోగదారులకు మునుపటి కంటే మెరుగైన సౌకర్యాలు లభిస్తాయి. ఇది డిజిటల్, కస్టమర్ సర్వీస్ మౌలిక సదుపాయాలను కూడా బలోపేతం చేస్తుంది. బ్యాంకు శాఖల సంఖ్యలో ఎటువంటి తగ్గింపు ఉండదు. మీకు కూడా ఈ బ్యాంకుల్లో ఖాతా ఉంటే అది మీకు ఎటువంటి తేడాను కలిగించదు. కానీ బ్యాంకు పేరు మాత్రమే మారుతుంది. ఖాతాలు, రుణాలు, ఇతర సేవలు మునుపటిలాగే కొనసాగుతాయి. ఈ మార్పు తర్వాత, బ్యాంక్ తన కస్టమర్లకు కొత్త ఖాతా నంబర్ ఏంటో సందేశం ద్వారా తెలియజేస్తుంది. ఇది కాకుండా, వారికి కొత్త చెక్ బుక్, పాస్ బుక్ కూడా లభిస్తాయి.

**బ్యాంకుల జాబితా**

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆంధ్రప్రదేశ్‌లో ఉంది. బరోడా బ్యాంక్ ఆర్యవర్ట్ బ్యాంక్, ఉత్తరప్రదేశ్‌లోని మొదటి గ్రామీణ బ్యాంక్. పశ్చిమ బెంగాల్‌లో బంగియా గ్రామీణ వికాస్ బ్యాంక్, పశ్చిమ బెంగాల్ గ్రామీణ బ్యాంక్, ఉత్తర బెంగాల్ ఉన్నాయి. బీహార్‌లో సౌత్ బీహార్ గ్రామీణ బ్యాంక్, నార్త్ బీహార్ గ్రామీణ బ్యాంక్ ఉన్నాయి. గుజరాత్‌లో బరోడా గుజరాత్ గ్రామీణ బ్యాంకు, సౌరాష్ట్ర గ్రామీణ బ్యాంకు ఉన్నాయి. %J&K% గ్రామీణ్ బ్యాంక్ జమ్మూ కాశ్మీర్‌లోని ఒక స్థానిక గ్రామీణ బ్యాంకు. దీంతో పాటు కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, రాజస్థాన్ కూడా ఇందులో ఉన్నాయి.

# భారతదేశంలో సరికొత్త క్యాండిల్ పేపర్‌వైట్‌ను విడుదల చేసిన అమెజాన్

## ఇప్పటివరకు అందుబాటులో ఉన్న వాటిలో అత్యంత వేగవంతమైన కిండిల్





**న్యూఢిల్లీ-నవభూమి:**Amazon నేడు, భారతదేశంలో తన సరికొత్త పేపర్‌వైట్‌ను విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఇది ఇప్పటివరకు కంపెనీ విడుదల చేసిన వాటిల్లో అత్యంత వేగవంతమైన Kindle కాగా, ఇప్పటివరకు అత్యుత్తమ పనితీరు కనబరిచిన, సన్నని %Kindle% పేపర్‌వైట్. ఇది ఏ పేపర్‌వైట్‌లోనూ లేనంతగా 7 అంగుళాల పెద్ద డిస్‌ప్లేను, తేలికైన డిజైన్, ఒకే ఛార్జ్‌తో 12 వారాల వరకు బ్యాటరీ లైఫ్‌ను కలిగి ఉంటుంది.

వినియోగదారులు www.amazon.in/all-new-kindle-paperwhiteలో ?16,999 ధరకు బ్లాక్ కలర్‌లో సరికొత్త Kindle పేపర్‌వైట్‌ను కొనుగోలు చేసుకోవచ్చు. Kindle పేపర్‌వైట్ పలు సంవత్సరాలుగా పాఠకులకు ప్రధానమైన ఎంపికగా ఉంది. మా వినియోగదారులకు విలువైన అప్‌గ్రేడ్ చేసిన ఫీచర్లతో సరికొత్త Kindle పేపర్‌వైట్‌ను అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉంది. ఇది 25% వేగవంతమైన పేజీ టర్న్‌లతో వేగవంతమైన పనితీరును, వినియోగదారులు చదువుతున్నప్పుడు ఎప్పుడూ జాప్యం లేకుండా చేస్తుంది. దీని అతిపెద్ద డిస్‌ప్లే అదనపు పఠన సౌకర్యాన్ని అందిస్తుంది. దీని తేలికైన డిజైన్ ప్రయాణంలో తీసుకెళ్లడానికి, చదవడానికి సౌకర్యంగా ఉంటుంది" అని %Amazon% డివైసెస్ ఇండియా డైరెక్టర్ మరియు కంట్రీ మేనేజర్ దిలీప్ ఆర్.ఎస్. అన్నారు. "ఈ తాజా కిండిల్‌తో అమెజాన్‌లో అందుబాటులో ఉన్న భారతీయ, అంతర్జాతీయ టైటిళ్ల విస్తారమైన ఎంపిక నుంచి కథనాలను అన్‌లాక్ చేసేందుకు మా వినియోగదారుల నుంచి మేము వేచి చూస్తున్నాము" అని తెలిపారు.

మెరుగైన పనితీరు కోసం తయారైంది.

కొత్త %Kindle% పేపర్‌వైట్ శక్తివంతమైన డ్యూయల్-కోర్ ప్రాసెసర్‌ను కలిగి ఉంది. ఇది పరికరంలో 25% వేగవంతమైన పేజీ టర్న్‌లతో మృదువైన, వేగవంతమైన పనితీరును అందిస్తుంది. ఇది మెరుగైన కీవర్డ్ టచ్-రెస్పాన్స్‌ను కూడా కలిగి ఉంది. వినియోగదారులు తమ %Kindle% పరికరాన్ని సజావుగా నావిగేట్ చేసేందుకు, వారి లైబ్రరీలను సులభంగా బ్రౌజ్ చేయడానికి అనుమతిస్తుంది. USB-C ద్వారా ఒకే ఛార్జ్‌తో, వినియోగదారులు తమ పరికరంలో 12 వారాల వరకు బ్యాటరీ లైఫ్‌ను ఆస్వాదించవచ్చు. అతిపెద్ద పేపర్‌వైట్ డిస్‌ప్లే మరియు మెరుగైన పోర్టబిలిటీకొత్త %Kindle% పేపర్‌వైట్ 7-అంగుళాల వాటర్‌ప్రూఫ్ డిస్‌ప్లేను కలిగి ఉంది. ఇది పేపర్‌వైట్‌కు అతిపెద్దది – మరియు సన్నని బోర్డర్‌తో, మెరుగైన పఠన అనుభవం కోసం పెద్ద స్క్రీన్-టు-బాడీ నిష్పత్తిని అందిస్తుంది. దీని డిస్‌ప్లే ఆక్సైడ్ థిన్-ఫిల్మ్ ట్రాన్సిస్టర్‌ను ఉపయోగిస్తుంది. ఇది ఏదైనా Kindle పేపర్‌వైట్ అత్యధిక కాంట్రాస్ట్ నిష్పత్తిని ఇస్తుంది. కనుక, టెక్స్ట్, చిత్రాలు స్క్రీన్ నుంచి పాప్ అవుతాయి. ఇది ఇప్పటివరకు ఉన్న వాటిలో అత్యంత సన్నని పేపర్‌వైట్. దీని సరళమైన డిజైన్ ఎక్కడికైనా తీసుకెళ్లడానికి సౌకర్యంగా ఉంటుంది. దీని 300 %ppi% గ్లేర్-ఫ్రీ డిస్‌ప్లే ప్రకాశవంతమైన కాంతిలోనూ కాగితం లాగా చదువుకునేందుకు అనుమతిస్తుంది. సర్దుబాటు చేయగల చక్కని కాంతి మరియు చీకటి మోడ్‌తో, పాఠకులు తమ ఇష్టానికి అనుగుణంగా డిస్‌ప్లేను అనుకూలీకరించవచ్చు. బయట ఉన్నప్పుడు మరియు సూర్యకాంతిలో లేదా మసకబారిన ప్రదేశంలో ఉన్నా, వారు పుస్తకాలను హాయిగా చదవుకోవచ్చు. అలాగే, దీని 16 GB నిల్వ సామర్థ్యం కస్టమర్లు ప్రయాణంలో వేల పుస్తకాలను స్టోర్ చేసుకునేందుకు, యాక్సెస్ చేయడానికి తగినంత స్థలాన్ని కలిగి ఉండేలా చేస్తుంది.

# భారతదేశంలో ప్రభావవంతమైన వర్క్‌ఫ్లో కోసం కంటెంట్ సృష్టికర్తలు, నిపుణుల కోసం సాన్‌డిస్క్ డబ్ల్యుడి బ్లూ ఎస్ఎస్‌డి పరిచయం




**న్యూఢిల్లీ-నవభూమి:**లీనమయ్యే కథలు, అద్భుతమైన విజువల్స్, అధిక-నాణ్యత వీడియోలతో కంటెంట్ సృష్టి కర్తలు తమ ప్లాట్‌ఫామ్‌లలో ప్రేక్షకులను ఆకర్షి స్తున్నారు. ప్రీమియం కంటెంట్‌కు ఉన్న డిమాండ్‌ను కొనసాగించేందుకు, వారికి గణనీయమైన స్టోరేజ్ సామర్థ్యంతో పాటు వేగవంతమైన, మరింత సమర్థవంతమైన వర్క్‌ఫ్లో అవసరం అవుతుంది.

కంటెంట్ సృష్టికర్తలు, నిపుణుల అవసరాలను తీర్చేందుకు, సాన్‌డిస్క్ డబ్ల్యూడి బ్లూ SN5000 NVMe™ ఎస్ఎస్‌డిని పరిచయం చేస్తోంది. ఈ తదుపరి తరం స్టోరేజ్ బహుళ-స్ట్రీమ్ 4కె వీడియో, చిత్రాలు, ఆడియోతో కూడిన డిమాండ్ వర్క్‌ఫ్లోలతో కంటెంట్ సృష్టికర్తలు, నిపుణుల కోసం తయారు చేశారు. స్పెసిఫికేషన్‌లు, ఫీచర్‌లు మరియు లభ్యత: పరికరం PCIe® Gen4తో వర్క్‌ఫ్లోలను వేగవంతం చేస్తూ, ఉత్పాదకతను పెంచుతుంది. ఇది 5,500%MB/s2రీడ్ స్పీడ్‌ల (4%TB%1 మోడల్) వరకు వేగాన్ని అందిస్తుంది- ఇది మునుపటి తరం కన్నా 24% మెరుగైన పనితీరును చూపిస్తుంది. దాని M%.2 2280 ఫారమ్ ఫ్యాక్టర్‌తో, WD Blue® SN5000 NVMe ఎస్ఎస్‌డి వినియోగదా రులకు పీసీ స్టోరేజ్ సామర్థ్యాన్ని విస్తరించేం దుకు, కృత్రిమ మేధస్సును ఉపయోగించుకునేందుకు, సృజనాత్మక వర్క్‌ఫ్లోలను క్రమబద్ధీకరించేందుకు సహాయపడుతుంది. వేగవంతమైన ఫోల్డర్ మరియు ఫైల్ కాపీలను బ్లిస్టర్ చేయడానికి ఈ డ్రైవ్ Sandisk nCache 4.0 టెక్నాలజీని కలిగి ఉంది. NVMe™తో మల్టీ టాస్కింగ్ హెవీ ప్రాజెక్ట్‌లను మృదువుగా చేయడంలో సహాయపడుతుంది. WD Blue® SN5000 NVMe™ SSD 500 GB నుంచి 4%TB వరకు సామర్థ్యాలలో వస్తుంది. దీని ధర రూ.3,199 నుంచి ప్రారంభమవుతుంది. దేశవ్యాప్తంగా ప్రముఖ ఐటీ రీసెల్లర్లు, ఈ-కామర్స్ ఛానెళ్లలో అందుబాటులో ఉంది.

# బంగారానికి భారీగా తగ్గిన డిమాండ్



**న్యూఢిల్లీ-నవభూమి:**బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. 2025 ప్రారంభం నుంచి చూస్తే ఏకంగా 25 శాతం పెరిగి, త్వరలోనే మరోసారి రూ. 1,00,000 మార్కును తాకేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే కొద్ది రోజుల కిందట 24 క్యారెట్స్ గోల్డ్ రేటు రూ. లక్ష మార్కు దాటి మళ్లీ దిగువకు చేరింది ఈ నేపథ్యంలో, జనవరి-మార్చి త్రైమాసికంలో భారతదేశంలో బంగారం డిమాండ్ 15 శాతం.. తగ్గి 118.1 టన్నులకు చేరుకుందని ప్రపంచ స్వర్ణ మండలి (%ఔ+జ%) బుధవారం తెలిపింది. అయితే, ధరలు పెరగడంతో విలువ మాత్రం 22 శాతం వృద్ధితో రూ. 94,030 కోట్లకు చేరుకుంది. డబ్ల్యూజీసీ అంచనా ప్రకారం, 2025లో భారతదేశంలో బంగారం డిమాండ్ 700-800 టన్నుల మధ్య ఉండవచ్చు. ధరలు అధికంగా ఉండటంతో వినియోగదారుల కొనుగోలు సరళిపై ప్రభావం పడింది. అయినప్పటికీ, అక్షయ తృతీయ సహా రాబోయే వివాహాల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని బంగారం సాంస్కృతిక ప్రాముఖ్యత.. కొనుగోలు సెంటిమెంట్‌ను కొనసాగిస్తోందని డబ్ల్యూజీసీ ఇండియా సీఈఓ సచిన్ జైన్ త్రైమాసిక నివేదికలో తెలిపారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, భారతదేశంలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన అక్షయ తృతీయ సందర్భంగా బంగారం మార్కెట్ ఉత్సాహంగా ఉంది. ఈ సమయంలో బంగారం కొనుగోళ్లు సాధారణంగా పెరుగుతాయి. రికార్డు స్థాయి ధరల కారణంగా వినియోగదారులు చిన్న, తేలికపాటి ఆభరణాల వైపు మొగ్గు చూపుతున్నారు. కొందరు ధరలు తగ్గుతాయనే ఆశతో కొనుగోళ్లను వాయిదా వేస్తున్నారు. అయినప్పటికీ, వివాహ సంబంధిత డిమాండ్ దాని ప్రాముఖ్యత దృష్ట్యా సాపేక్షంగా స్థిరంగానే ఉంది. ప్రస్తుత ధరల స్థాయి కొంతమందిని కొనుగోలు విషయంలో జాగ్రత్త వహించేలా చేసినప్పటికీ, అక్షయ తృతీయ సమయంలో బంగారం సాంస్కృతిక ప్రాముఖ్యత, ఇంకా నమ్మకమైన ఆస్తిగా దాని హోదా కొనుగోళ్లలో ఊపును కొనసాగిస్తుందని నిపుణులు విశ్వసిస్తున్నారు. అయితే, పెట్టుబడి డిమాండ్ మాత్రం 7 శాతం పెరిగి 46.7 టన్నులకు చేరుకుంది. ఇది గతేడాది ఇదే కాలంలో 43.6 టన్నులుగా ఉంది. ఆర్థిక మార్కెట్లలో అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో, సురక్షితమైన ఆస్తిగా బంగారం పాత్ర మరింత స్పష్టంగా కనిపించింది. ఇది బంగారు కడ్డీలు, నాణేల డిమాండ్‌లో గణనీయమైన పెరుగుదలకు దారితీసింది. మరోవైపు, 2025 క్యాలెండర్ సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఆభరణాల డిమాండ్ 25 శాతం తగ్గి 71.4 టన్నులకు చేరుకుంది. గతేడాది ఇదే కాలంలో 95.5 టన్నులుగా ఉంది. 2020 తర్వాత ఇదే అత్యల్ప స్థాయి. అయితే, విలువ పరంగా చూస్తే ఏడాది ప్రాతిపదికన 3 శాతం పెరిగింది. ఇక జనవరి-మార్చి త్రైమాసికంలో బంగారం దిగుమతులు 8 శాతం పెరిగి 167.4 టన్నులకు చేరుకుంది. రికార్డు స్థాయి ధరల కారణంగా వినియోగదారులు తమ వద్ద ఉన్న బంగారాన్ని విక్రయించడానికి వెనుకాడుతున్నారు.

# యాపిల్ బిగ్ స్కెచ్.. తయారీ అంతా భారత్‌లోనే?



**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రపంచ టెక్ దిగ్గజం యాపిల్.. భారత్‌ను తమ వ్యూహాత్మక తయారీ కేంద్రంగా మార్చేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. చైనాకు ప్రత్యామ్నాయంగా భారత్‌ను నిలపాలని లక్ష్యంగా పెట్టుకున్న ఈ క్రమంలో, తైవాన్‌కు చెందిన కాంట్రాక్ట్ తయారీ సంస్థ ఫాక్స్‌కాన్.. హైదరాబాద్‌లోని తన యూనిట్‌లో ఎగుమతుల కోసం యాపిల్ ఎయిర్‌పాడ్స్ ఉత్పత్తిని ప్రారంభించింది. అంతేకాకుండా, బెంగళూరు సమీపంలోని దేవనహళ్లిలో ఏర్పాటు చేస్తున్న భారీ ఐఫోన్ తయారీ యూనిట్ కూడా త్వరలోనే కార్యకలాపాలు ప్రారంభించనుంది. ఈ విషయాన్ని సంబంధిత వర్గాలు ధ్రువీకరించాయి. ఈ మేరకు పలు ఆంగ్ల మీడియాల్లో కథనాలు వస్తున్నాయి. అమెరికా-చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో, డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం కొన్ని చైనా ఉత్పత్తులపై 100 శాతం కంటే ఎక్కువ దిగుమతి సుంకాలు విధించింది. ఇది సప్లై చెయిన్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉండటంతో, యాపిల్ చైనాపై ఆధారపడటాన్ని తగ్గించుకుని భారత్‌లో ఉత్పత్తిని పెంచేందుకు దృష్టి సారించింది. 'అవును, ఫాక్స్‌కాన్ కొత్త హైదరాబాద్ యూనిట్‌లో ఎగుమతి కోసం యాపిల్ ఎయిర్‌పాడ్స్ ఉత్పత్తి ప్రారంభమైంది. బెంగళూరులోని కొత్త ప్లాంట్ కూడా త్వరలో ఐఫోన్ ఉత్పత్తిని ప్రారంభిస్తుంది. భారతదేశం నుంచి ఎగుమతులను పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ కొత్త ప్లాంట్ వార్షికంగా గరిష్టంగా 20 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది" అని ఒక అధికారి చెప్పినట్లు ఆయనను ఉటంకిస్తూ వార్తా కథనాలు వచ్చాయి. బెంగళూరు సమీపంలోని దేవనహళ్లిలో ఏర్పాటు చేస్తున్న ఈ కర్ణాటక ఫెసిలిటీ, చైనా వెలుపల ఫాక్స్‌కాన్ రెండో అతిపెద్ద యూనిట్‌గా అవతరించనుంది. దీని కోసం దాదాపు 2.8 బిలియన్ డాలర్లు (రూ. 25,000 కోట్లు) పెట్టుబడి పెట్టారు. మరోవైపు, ఫాక్స్‌కాన్ భారతదేశంలో ఐఫోన్ 17 సిరీస్ ట్రయల్ ఉత్పత్తిని ప్రారంభించింది. టాటా ఎలక్ట్రానిక్స్ కూడా కొత్త శ్రేణి కోసం కేసింగ్‌ల వంటి భాగాల ట్రయల్ ఉత్పత్తిలో పాల్గొంటోంది. టాటా ఎలక్ట్రానిక్స్ కొత్త ఐఫోన్ ఫ్యాక్టరీ హోసూర్‌లో కార్యకలాపాలు ప్రారంభించి, ప్రస్తుతం పాత తరం ఐఫోన్‌లను అసెంబ్లింగ్ చేస్తోంది. "రాబోయే రోజుల్లో టాటా ప్లాంట్ నుంచి షిప్‌మెంట్‌లు ప్రారంభమవుతాయి" అని మరో అధికారి తెలిపారు, రాబోయే నెలల్లో ఉత్పత్తిని పెంచుతామని ఆయన పేర్కొన్నారు. టాటా ఎలక్ట్రానిక్స్, తైవాన్‌కు చెందిన కాంట్రాక్ట్ తయారీదారులు పెగాట్రాన్ విస్ట్రాన్ భారతీయ కర్మాగారాలను కొనుగోలు చేయడంతో, ఫాక్స్‌కాన్ తర్వాత యాపిల్ రెండో కీలక సరఫరాదారుగా అవతరించింది. టారిఫ్-సంబంధిత అనిశ్చితుల నేపథ్యంలో, యాపిల్ ఇటీవల భారతదేశంలో ఉత్పత్తిని పెంచింది. మార్చిలో టాటా, ఫాక్స్‌కాన్ రెండూ కలిపి 2 బిలియన్ డాలర్ల విలువైన ఐఫోన్‌లను అమెరికాకు ఎగుమతి చేశాయి. నెలవారీగా చూస్తే ఇదో రికార్డు. మార్చి ఉత్పత్తిలో ఎక్కువ భాగం ఫాక్స్‌కాన్ నుంచే ఉందని తెలిసింది. కొత్త కర్మాగారాల నుంచి ఐఫోన్, ఎయిర్‌పాడ్స్ ఉత్పత్తిని పెంచడం వల్ల చైనాపై యాపిల్ ఆధారపడటం తగ్గుతుందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

# రెస్టారెంట్‌లో కచ్చితంగా సర్వీస్ ఛార్జ్ చెల్లించాల్సిందేనా.. కేంద్రం క్లారిటీ.. బిగ్ రిలీఫ్!

**న్యూఢిల్లీ-నవభూమి:** సామాన్యుడి జేబుకు చిల్లు పెడుతున్న రెస్టారెంట్ల సర్వీస్ ఛార్జీల దందాకు ఇక తెరపడనుంది. ఢిల్లీలోని బడా రెస్టారెంట్లు కస్టమర్లను నిలువునా దోచుకుంటున్న వైనం వెలుగులోకి రావడంతో కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. బార్బీక్యూ నేషన్‌కు చెందిన ఫియెస్టా ఛాయోస్ వంటి పేరుమోసిన 5 రెస్టారెంట్లు.. కస్టమర్ల అంగీకారం లేకుండానే బిల్లుకు దొడ్డిదారిన సర్వీస్ ఛార్జీలు వేసి వసూలు చేస్తున్నాయి. అంతేకాదు, బాధితులు నిలదీస్తే తిరిగి ఇవ్వడానికి కూడా మొండికేస్తున్నాయి. అయితే.. ఇకపై రెస్టారెంట్లు మీ ఇష్టానికి వ్యతిరేకంగా బిల్లులో సర్వీస్ ఛార్జ్ వేసేందుకు వీల్లేదు! వినియోగదారుల హక్కులను పరిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. ఢిల్లీలోని పేరుమోసిన 5 రెస్టారెంట్లు బలవంతంగా సర్వీస్ ఛార్జ్ వసూలు చేస్తూ, తిరిగి ఇవ్వడానికి నిరాకరించడంతో ప్రభుత్వం వాటిపై కొరడా ఝుళిపించింది. బార్బీక్యూ నేషన్‌కు చెందిన ఫియెస్టా, చాయోస్, మఖ్నా డెలీ, జిరో కోర్టియార్డ్, కాజిల్ బార్బీక్యూలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. వినియోగదారులకు డబ్బు తిరిగి ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. నిజానికి, రెస్టారెంట్లు బిల్లు, జీఎస్టీతో పాటు సర్వీస్ ఛార్జీని విధించవచ్చు. అయితే, అభ్యర్థన మేరకు ఆ సర్వీస్ ఛార్జీని తొలగించుకునే అవకాశం వినియోగదారుడికి ఉంటుంది. అంటే ఇక్కడ సర్వీస్ ఛార్జీ అనేది స్వచ్ఛందంగా కస్టమర్ చెల్లిస్తే చెల్లించొచ్చు కానీ చెల్లించాలని బలవంతం చేయకూడదు. కానీ ఢిల్లీలోని ఈ ఐదు ప్రఖ్యాత రెస్టారెంట్లు మాత్రం వినియోగదారుల అనుమతి లేకుండానే బిల్లుకు సర్వీస్ ఛార్జీని జతచేసి వసూలు చేశాయి. అంతేకాకుండా, తిరిగి ఇవ్వమని అడిగినా నిరాకరించాయి.

సుమోటోగా గుర్తించి నోటీసులు..ఈ చర్యలు ఢిల్లీ హైకోర్టు తీర్పును, హోటల్ లేదా రెస్టారెంట్‌లో భోజనం చేసే కస్టమర్ల నుంచి బలవంతంగా సర్వీస్ ఛార్జీలను వసూలు చేయకుండా సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (%జజూూా%) నిర్దేశించిన మార్గదర్శకాలను ఉల్లంఘించాయి. చట్టపరమైన నిబంధనలను ఉల్లంఘించిన ఈ ఐదు రెస్టారెంట్ల చర్యలను ప్రభుత్వం సుమోటోగా గుర్తించి, అర్హులైన వినియోగదారులందరికీ వెంటనే సర్వీస్ ఛార్జీల మొత్తాన్ని తిరిగి చెల్లించాలని నోటీసులు జారీ చేసింది. ఫాక్స్ మండల్ %డ% అసోసియేట్స్ భాగస్వామి సౌరభ్ బిందాల్ మాట్లాడుతూ, "రెస్టారెంట్ విధించే సర్వీస్ ఛార్జ్ పన్ను కాదు, దానిని కస్టమర్ తప్పనిసరిగా చెల్లించాల్సిన అవసరం లేదు. రెస్టారెంట్ నుంచి పొందిన సేవల కోసం చెల్లించే రుసుమును సర్వీస్ ఛార్జ్ సూచిస్తుంది. సర్వీస్ ఛార్జ్ పన్ను కాదు కాబట్టి, కస్టమర్‌కు దానిని రెస్టారెంట్‌కు చెల్లించాల్సిన చట్టపరమైన బాధ్యత లేదని అర్థం చేసుకోవాలి. ఈ విషయంలో, కస్టమర్ ఆహార బిల్లులపై సర్వీస్ ఛార్జ్ విధించడాన్ని వ్యతిరేకించవచ్చు. రెస్టారెంట్ బలవంతంగా వసూలు చేస్తే, కస్టమర్ సర్వీస్ ఛార్జీని తిరిగి పొందడానికి వినియోగదారుల ఫోరమ్‌లను కూడా సంప్రదించవచ్చు" అని అన్నారు. నేషనల్ కన్స్యూమర్ హెల్ప్‌లైన్ తప్పనిసరిగా సర్వీస్ ఛార్జీలు విధించడం, సర్వీస్ ఛార్జీల మొత్తాన్ని తిరిగి చెల్లించకపోవడం గురించి రెస్టారెంట్లపై ఫిర్యాదులు అందుకున్నట్లు వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. "ఏ హోటల్ లేదా రెస్టారెంట్ అయినా వినియోగదారుడిని సర్వీస్ ఛార్జీలు చెల్లించమని బలవంతం చేయకూడదు లేదా మరే ఇతర పేరుతోనూ వినియోగదారుల నుం సచిర్వీస్ ఛార్జీలు వసూలు చేయకూడదు కాబట్టి, ఏదైనా రెస్టారెంట్‌లో సేవలు పొందే సమయంలో వినియోగదారులపై అదనపు మొత్తాన్ని చెల్లించాలనే అనవసరమైన ఒత్తిడిని తగ్గించడమే ఈ చర్య లక్ష్యం" అని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

రూల్స్ ఇవే..ఏ హోటల్ లేదా రెస్టారెంట్ భోజన బిల్లుకు సర్వీస్ ఛార్జీలను ఆటోమేటిక్‌గా లేదా డిఫాల్ట్‌గా జోడించకూడదు.

మరే ఇతర పేరుతోనూ సర్వీస్ ఛార్జీల వసూలు చేయకూడదు.

ఏ హోటల్ లేదా రెస్టారెంట్ వినియోగదారుడిని సర్వీస్ ఛార్జీలు చెల్లించమని బలవంతం చేయకూడదు. సర్వీస్ ఛార్జీలు స్వచ్ఛందమైనవి, ఐచ్ఛికమైనవి, వినియోగదారుడి అభీష్టానుసారం ఉంటాయని స్పష్టంగా తెలియజేయాలి.

సర్వీస్ ఛార్జీల వసూలు ఆధారంగా వినియోగదారులపై ప్రవేశం లేదా సేవల నిబంధనలపై ఎటువంటి పరిమితి విధించకూడదు.


ఆహార బిల్లుతో కలిపి సర్వీస్ ఛార్జీలను జోడించి, మొత్తంపై జీఎస్టీ విధించడం ద్వారా సర్వీస్ ఛార్జీలను వసూలు చేయకూడదు.

రెస్టారెంట్ బిల్లులో సర్వీస్ ఛార్జ్‌పై ఢిల్లీ హైకోర్టు ఏమి చెప్పింది?

మార్చి 28, 2025న, ఢిల్లీ హైకోర్టు సర్వీస్ ఛార్జీలపై సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ మార్గదర్శకాలను సమర్థించింది. ఈ తీర్పు తర్వాత, నేషనల్ కన్స్యూమర్ హెల్ప్‌లైన్ (1915)లో నమోదైన ఫిర్యాదుల ద్వారా కొన్ని రెస్టారెంట్లు వినియోగదారుల నుంచి ముందుగా అనుమతి పొందకుండా తప్పనిసరిగా సర్వీస్ ఛార్జీని విధిస్తున్నాయని, తద్వారా వినియోగదారుల హక్కులను ఉల్లంఘిస్తున్నాయని.. వినియోగ దారుల రక్షణ చట్టం, 2019 ప్రకారం అన్యాయమైన వాణిజ్య పద్ధతు లకు పాల్పడుతున్నాయని తమ దృష్టికి వచ్చిందని వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
11 హైదరాబాద్ గురువారం 01 । మే । 2025

# నవ విశ్వం



## బంగ్లాదేశ్‌లో అరెస్టైన హిందూ సన్యాసి చిన్మయ్ దాస్‌కు.. ఆరు నెలల తర్వాత బెయిల్



ఢాకా-నవభూమి:బంగ్లాదేశ్‌లో దేశద్రోహం కేసులో అరెస్టైన హిందూ సన్యాసి చిన్మయ్ కృష్ణ దాస్‌కు (%జష్ట్రఱఅఎఏశ ఋం%) బెయిల్ లభించింది. ఆరు నెలలుగా జైలులో ఉన్న ఇస్కాన్ మాజీ పూజారికి బంగ్లాదేశ్ హైకోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేసింది. చిన్మయ్ దాస్ అనారోగ్యంతో ఉన్నారని, ఎలాంటి విచారణ లేకుండా జైలులో మగ్గుతున్నారని ఆయన తరుపు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. గత ఏడాది నవంబర్‌లో బంగ్లాదేశ్‌లో అల్లర్ల నేపథ్యంలో షేక్ హసీనా ప్రభుత్వం పతనమైంది. ఈ సందర్భంగా అల్లరిమూకలు ఆ దేశంలోని హిందువులు, హిందూ ఆలయాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడ్డారు.కాగా, రంగ్‌పూర్‌లో హిందువులపై జరిగిన హింసను ఖండిస్తూ పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో చిన్మయ్ కృష్ణ దాస్ మాట్లాడారు. ఈ సందర్భంగా బంగ్లాదేశ్ జాతీయ జెండాను అగౌరవపరిచారన్న ఆరోపణలపై నవంబర్ 25న ఢాకాలో ఆయనను అరెస్ట్ చేశారు. దేశద్రోహం కేసు నమోదు చేశారు. ఇస్కాన్‌తో సంబంధం ఉన్న ఆయనతోపాటు 17 మంది హిందువుల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు.మరోవైపు నవంబర్ 26న ఛటోగ్రామ్ కోర్టు చిన్మయ్ దాస్‌కు రిమాండ్ విధించి జైలుకు పంపింది. డిసెంబర్ 11న అదే కోర్టు ఆయన బెయిల్ పిటిషన్ తిరస్కరించింది. దీంతో చిన్మయ్ కృష్ణ దాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో అరెస్టైన ఆరు నెలల తర్వాత ఆయనకు బెయిల్ మంజూరైంది.

## పాకిస్థాన్‌కు టర్కీ ఫుల్ సపోర్ట్..



శ్రీనగర్--నవభూమి:పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సింధు నదీ జలాల ఒప్పందాన్ని నిలిపేయడం తోపాటు.. పాకిస్థానీయుల వీసాలను రద్దు చేసి.. వారు ఇండియా నుంచి వెళ్లిపోవాలని ఆదేశాలు జారీ చేసింది. పాక్ సైతం ప్రతీకార చర్యలు తీసుకుంది. ఇరు దేశాలు సరిహద్దుల్లో భారీగా సైన్యాన్ని మోహరిస్తున్నాయి. దీంతో ఏ నిమిషంలోనైనా యుద్ధం రావచ్చని భావిస్తోన్న పాక్.. ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటూ యుద్ధానికి సన్నద్ధం అవుతోంది. ప్రపంచ దేశాలన్ని పహల్గాం ఉగ్రదాడిని ఖండించగా.. టర్కీ, చైనా మాత్రం పాక్‌కు అండగా నిలుస్తున్నాయి. భారత్ దాడి చేస్తుందనే భయంతో.. పాక్ తన మిత్ర దేశాల నుంచి ఆయుధాలను సమకూర్చుకుంటుందని.. అందులో భాగంగా టర్కీ సాయం కోరిందని వార్తలు వస్తున్నాయి.

ఇంగ్లీష్ మీడియాలో వస్తోన్న కథనాల ప్రకారం.. ఒక టర్కిష్ సీ-130ఈ హెర్క్యులస్ విమానం కరాచీలో దిగినట్లు తెలుస్తోంది. ఈ విమానంలో టర్కీ పాకిస్థాన్‌కు మిలటరీ కార్గోను తరలించినట్లు సమాచారం. ఓపెన్-సోర్స్ ఇంటెలిజెన్స్ ట్రాకర్లు ప్రచురించిన విమాన ట్రాకింగ్ డేటా ఆధారంగా ఈ నివేదికలు వెలువడ్డాయి. ఈ విమానం ఏప్రిల్ 28న అరేబియా సముద్రం మీదుగా ప్రయాణిస్తున్నట్లు కనిపించింది.ఇక్కడ మరో ఆసక్తికర అంశం ఏంటంటే.. పహల్గాం ఉగ్రదాడి రోజు పాక్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ అంకారాలో టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్‌తో సమావేశంలో ఉన్నారు. పాకిస్థాన్‌కు సాయం చేసే దేశాల్లో టర్కీ ఒకటి. ఇది ఐక్యరాజ్యసమితితో సహా అంతర్జాతీయ వేదికలపై కశ్మీర్ వివాదాన్ని లేవనెత్తుతూ ఉంటుంది. ఈ క్రమంలోనే తాజాగా పాక్‌కు సాయం చేసేందుకు మిలటరీ ట్రాన్స్‌పోర్ట్ విమానాలను పంపిందని వార్తలొచ్చాయి.అయితే టర్కీ అధ్యక్ష కార్యాలయ సమాచార విభాగం మాత్రం ఈ వార్తలను ఖండించింది. "టర్కీకి చెందిన ఒక కార్గో విమానం ఇంధనం నింపుకోవడం కోసం పాకిస్థాన్‌లో దిగింది. ఆ తర్వాత అది తన గమ్యస్థానానికి వెళ్లిపోయింది" అని చెప్పుకొచ్చింది. టర్కీ పాకిస్థాన్‌కు మిలటరీ కార్గోను డెలివరీ చేస్తోందనే వార్తలు, చైనా పీఎల్-15 లాంగ్ రేంజ్ మిస్సైల్‌ను పాకిస్థాన్‌కు సరఫరా చేసిందనే వార్తల తర్వాత వచ్చాయి. టర్కీ ఈ వార్తలను ఖండించగా.. డ్రాగన్ మాత్రం స్పందించలేదు.వీటితో పాటు.. నిన్నటి నుంచి సోషల్ మీడియాలో ఒక వీడియో తెగ వైరల్ అవుతోంది. అది ఏంటంటే.. టర్కీకి చెందిన భారీ నౌక ఒకటి ఆయుధ సంపత్తితో కరాచీ తీరానికి చేరుకున్నట్లుగా వైరల్ అవుతోంది. అయితే ఆ వీడియో 2023 నాటిదని తేలింది. టర్కీ 100వ రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా.. ఇరు దేశాల మధ్య జరిగిన జాయింట్ మిలిటరీ ఎక్సర్‌సైజ్ సందర్భంగా తీసిన వీడియో ఇది. దీన్ని ఇప్పుడు సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. పాకిస్థాన్‌కు టర్కీ మద్దతుందని.. ఆ దేశం నుంచి ఆయుధాలు కూడా వచ్చాయన్నట్లు ప్రచారం చేస్తున్నారు. కానీ టర్కీ మాత్రం తాము పాకిస్థాన్‌కు ఎలాంటి ఆయుధాలు పంపలేదని స్పష్టం చేసింది.

## ఈసారి అక్షయ తృతీయకు రూ.లక్ష షాక్?



న్యూఢిల్లీ-నవభూమి: మిగిలిన రోజులు ఎలా ఉన్నా అక్షయ తృతీయ రోజు ఒక గ్రాము బంగారం కొన్నా.. ఏడాది మొత్తంలో అంతో ఇంతో బంగారాన్ని కొనేలా చేస్తుందన్న సెంటిమెంట్ ఎక్కువ. అందుకే.. మిగిలిన రోజుల సంగతి ఎలా ఉన్నా.. అక్షయ తృతీయ రోజున బంగారం ధర కాస్త ఎక్కువగా ఉన్నా సరే పసిడిని కొనేందుకు విపరీతమైన ఆసక్తిని చూపుతారు. కొందరైతే ఈ శుభదినాన కొనాల్సిన బంగారు ఆభరణాల కోసం నెలల ముందే ప్లాన్ చేస్తుంటారు. మరి.. ఈసారి ఈ అక్షయ తృతీయ ఎలా ఉంటుంది? అన్నది ప్రశ్నగా మారింది. గత ఏడాది అక్షయ తృతీయ రోజున పది గ్రాముల మేలిమి బంగారం ధర రూ.73,500 ఉంటే.. ఈసారి అది కాస్తా ఏకంగా రూ.99,800కు పెరిగింది. అంటే.. కాస్త చిల్లర్ని పక్కన పెడితే పది గ్రాముల బంగారం రూ.లక్ష చేరింది. ఇలాంటివేళ.. అమ్మకాలు ఎలా ఉంటాయి? అన్నది ప్రశ్నగా మారింది. సాధారణంగా అక్షయ తృతీయ రోజున కచ్చితంగా బంగారాన్ని కొనే వర్గం భారీగా ఉంటుంది. అయితే.. ఈసారి భారీగా పెరిగిన ధర ప్రభావం అమ్మకాల మీద ఖాయంగా ఉంటుందని చెబుతున్నారు. గతంలో మాదిరి బంగారు దుకాణాల్లో హడావుడి కనిపించే అవకాశం ఉండదంటున్నారు. ఒకవేళ కొనుగోలుకు షాపులకు వచ్చినా.. గ్రాము.. రెండు గ్రాముల బంగారం కొనేందుకే ఆసక్తి చూపుతారన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. వ్యాపార వర్గాల అంచనా ప్రకారం దేశ వ్యాప్తంగా ఈ అక్షయ తృతీయకు రూ.16వేల కోట్ల మేర వ్యాపారం జరుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ మంచిరోజున గతంలో బంగారం కొనే వారు.. ఈసారి అందుకు భిన్నంగా ఆస్తులు కానీ.. ఎలక్ట్రానిక్ వస్తువులు కానీ కొనుగోలు చేసే వీలుందని చెబుతున్నారు. బంగారు పరిశ్రమ వర్గాల అంచనా ప్రకారం ఈ రోజున 12 టన్నులు (టన్ను అంటే వెయ్యి కేజీల) బంగారం అమ్ముడయ్యే అవకాశం ఉందంటున్నారు. మరేం జరుగుతుందో చూడాలి.

## ఇద్దరు ఇండియన్స్ అరెస్ట్... విద్యార్థి వీసాపై యూఎస్ వెళ్లి ఇదేం పని?

న్యూఢిల్లీ-నవభూమి: విద్యార్థి వీసాపై అమెరికాకు వచ్చిన ఇద్దరు భారతీయ విద్యార్థులను అధికారులు అరెస్ట్ చేశారు. వీరిపై మనీలాండరింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ఇద్దరు యువకులు, వృద్ధులను లక్ష్యంగా చేసుకొని డబ్బులు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడుతుండటంతో వారిపై మనీలాండరింగ్ కేసు నమోదు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అవును... విద్యార్థి వీసాపై అమెరికా వెళ్లి అక్కడ వృద్ధులను బెదిరుస్తున్న ఇద్దరు భారతీయ విద్యార్థులను అమెరికా అధికారులు అరెస్ట్ చేశారు. నిందితులను మహ్మదిల్హామ్ వహోరా, హజియాలి వహోరాలుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. వీరి వయసు 24 ఏళ్లుగా చెబుతున్నారు. ఈ ఇద్దరూ చికాగోలోని ఈస్ట్-వెస్ట్ యూనివర్శిటీలో చదువుతున్నట్లు అధికారులు తెలిపారు.

అక్టోబర్ 2024న ఓ వృద్ధుడు తనకు స్కామర్ల నుంచి ఫోన్ వచ్చిందని పోలీసులను ఆశ్రయించాడని.. స్కామర్లు తమను ప్రభుత్వ ఏజెంట్లుగా చెప్పుకొని ఓ కేసు విషయంలో డబ్బులు ఇవ్వాలని బెదిరించారని.. దీంతో, క్రిప్టోకరెన్సీ ఏటీఎం ద్వారా బంగారం కొనుగోలు చేసి వారికి ఇచ్చానని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్న అధికారులు తాజాగా నింధితులను అదుపులోకి తీసుకుని విచారించగా... గతంలోనూ వీరు ఇదే విధంగా పలువురు వృద్ధులను మోసం చేసినట్లు తేలిందని అంటున్నారు. ఇటువంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అధికారులు సూచించారు.

## మీకోసమే 30 ఏళ్లుగా పాక్ ఉగ్రవాదాన్ని పోషిస్తోందట?.. అమెరికా సమాధానం ఏంటంటే?



శ్రీనగర్--నవభూమి: అమెరికా, పశ్చిమ దేశాల కోసమే తాము గత 3 దశాబ్దాలుగా ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్నామని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవలే సంచలన కామెంట్లు చేసిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఈ చెత్త పనులు చేయకుండా ఉండి ఉంటే పాకిస్థాన్ పరిస్థితి మరోలా ఉండేదని.. తమ దేశం నాశనం అవ్వడానికి ఇదే కారణం అంటూ వివరించారు. అయితే తాజాగా ఈ కామెంట్లపై అమెరికా స్పందించింది. ముఖ్యంగా ఓ ఇంటర్వ్యూలో ఖవాజా ఆసిఫ్ చేసిన కామెంట్లపై మీరేమంటారని యూఎస్ అధికార యంత్రాంగానికి ప్రశ్న ఎదురు కాగా.. ఆచితూచి సమాధానం చెప్పి అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఆ పూర్తి వివరాలు మీకోసం.పహల్గాం దాడి తర్వాత భారత్‌తో నెలకొన్న ఉద్రిక్తతలపై పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ 'స్కై న్యూస్'కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఉగ్ర సంస్థలకు నిధులు సమీకరించడం, ఉగ్రవాదులకు శిక్షణ ఇవ్వండి, ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడం వంటివి పాక్ చాలా కాలంగా చేస్తోంది దీనిపై మీ స్పందన ఏమిటి అని జర్నలిస్టు ప్రశ్నించారు. దీనికి పాక్ రక్షణ మంత్రి సమాధానమిస్తూ.. అమెరికా, బ్రిటన్ సహా పశ్చిమదేశాల కోసమే మూడు దశాబ్దాల పాటు మేం ఈ చెత్త పనులన్నీ చేస్తున్నామని అన్నారు. దానివల్ల పాక్ చాలా ఇబ్బందులు పడినట్లు చెప్పుకొచ్చారు. అయితే ఈ పనులు చేయకుండా ఉండి ఉంటే తమ దేశ పరిస్థితి బాగుండేదని వ్యాఖ్యానించారు. అయిత ఉగ్రవాదులను పెంచి పోషించడం అనేది తాము చేసిన పొరపాటు చర్య అని ఆ తర్వాత అర్థమైందన్నారు. ముఖ్యంగా సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో పాక్ చేరకపోయి ఉంటే.. ఇప్పుడు తిరుగులేనని ట్రాక్ రికార్డ్ ఉండేదని అన్నారు. ఈకామెంట్లతో ప్రపంచం అంతా షాక్ అయింది. ముఖ్యంగా తమ దేశంలో ఉగ్రవాదమే లేదని, తామే ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామంటూ గతంలో చెప్పి.. ఇప్పుడిలా మాట్లాడగా.. పహల్గాం దాడికి పాల్పడింది కూడా ఆ దేశమే అంటూ పలువురు కామెంట్లు చేశారు.తాజాగా ఇదే అంశంపై అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి టామీ బ్రూస్‌కు విలేకర్లు ఓ ప్రశ్న అడిగారు. పాక్ అమెరికా కోసమే ఉగ్రవాదులను పెంచి పోషించిందని చెబుతోందని, నిజంగానే ఇక్కడి నుంచి నిధులు పంపిస్తున్నారా అని ప్రశ్నించారు. ఇందుకు ఆమె ఆచితూచి సమాధానం చెప్పారు. ముఖ్యంగా తమ సెక్రటరీ ఆఫ్ స్టేట్ ఇరు దేశాల విదేశాంగ మంత్రులతో మాట్లాడతారన్నారు. ఆ ప్రాంత సరిహద్దుల్లో పరిణామాలను తాము ఎప్పటికప్పుడు గమనిస్తున్నామన్నారు. వివిధ దశల్లో ఇరు దేశాల నేతలతో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు.అలాగే అన్ని వర్గాలతో కలిసి పని చేసి.. దీనికి ఓ పరిష్కారాన్ని సాధించడానికి ప్రోత్సహిస్తామని టామీ బ్రూస్ వెల్లడించారు. ప్రపంచం మొత్తం దీన్ని గమనిస్తోందని.. ఇంతకుమించి ఈ విషయంలో తన వద్ద సమాచారం లేదన్నారు. ఈమె చెప్పిన సమాధానం విన్న విలేకర్లు కూడా షాక్ అయ్యారు. అసలు తాము అడిగిన ప్రశ్న ఏంటి, సమాధానం ఏం చెప్పారని ముక్కున వేలేసుకున్నారు. ఇదంతా చూస్తుంటే అమెరికా కోసమే నిజంగా పాక్ ఉగ్రవాదాన్ని పెంచి పోషించిందని చాలా మంది

## పాకిస్థాన్‌కు వరల్డ్ బ్యాంకు భారీ సాయం



శ్రీనగర్--నవభూమి:పహల్గామ్ ఉగ్రదాడి విషయంలో అన్ని వేళ్లూ పాకిస్థాన్‌వైపే చూపిస్తున్నాయి. దాయాది అంతర్జాతీయంగా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఓవైపు భారత్ ఇప్పటికే దౌత్యపరమైన ఆంక్షలు, సింధూ నదీ జలాల ఒప్పందం రద్దు, వాణిజ్యం నిలిపివేత వంటి నిర్ణయాలతో అష్టదిగ్బంధం చేస్తోంది. ఏ క్షణమైనా సైనిక చర్య జరిగే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. పాకిస్థాన్ మంత్రులు సైతం భారత్ ప్రతీకార దాడికి సిద్ధమైందని ప్రకటిస్తున్నారు. ఇలాంటి సమయంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కునారిల్లుతున్న పాకిస్థాన్‌కు ప్రపంచ బ్యాంక్ భారీ ఉపశమనం కలిగించింది. ఆ దేశానికి ఏకంగా 108 మిలియన్ల డాలర్ల ఆర్థిక సాయం విడుదల చేసింది.వాయువ్య పాక్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సుల్లో మహిళలు, బాలికల జీవితాలను మెరుగుపరచడానికి 108 మిలియన్ డాలర్ల అదనపు నిధులను వరల్డ్ బ్యాంకు మంజూరు చేసింది. ఇందులో పఖ్తుంఖ్వా ఇంటిగ్రేటెడ్ టూరిజం డెవలప్‌మెంట్ కోసం 30 మిలియన్ డాలర్లు, ఖైబర్ పఖ్తుంఖ్వా రూరల్ యాక్సెసిబిలిటీ ప్రాజెక్టుల కోసం 78 మిలియన్ డాలర్లు అందజేసింది. మార్కెట్లు, ఉద్యోగాలు, ఆరోగ్యం, విద్య సేవల అభివృద్ధి కోసం ఈ నిధులు మంజూరు చేసినట్టు ప్రపంచ బ్యాంక్ వెల్లడించింది.ఈ నిధులను గ్రామీణ రహదారుల అప్‌గ్రేడ్, పునరుద్ధరణ ద్వారా సురక్షితమైన, వాతావరణానికి అనుగుణంగా ఉండే మౌలిక సదుపాయాల కల్పనకు ఖర్చుచేయాల్సి ఉంటుంది. తద్వారా పాఠశాలలు, ఆరోగ్య మౌలిక సౌకర్యాలు , మార్కెట్లు వంటి సేవలు, ఆర్థిక అవకాశాలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. పాకిస్థాన్ ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సుల అభివృద్ధి లక్ష్యాల కోసం ఈ నిధులు మంజూరు చేసినట్టు వరల్డ్ బ్యాంకు ప్రాజెక్ట్ డైరెక్టర్ పేర్కొన్నారు.

"ఈ ప్రాజెక్ట్ ముఖ్యంగా మహిళలు, బాలికలకు అవసరమైన సేవలు, ఆర్థిక అవకాశాల ప్రాప్యతను మెరుగుపరచడం ద్వారా ప్రావిన్సుల్లో ప్రజల జీవన స్థాయిని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించనుంది"' అని ప్రాజెక్ట్‌కు సంబంధించిన టాస్క్ టీం లీడర్ ముహమ్మద్ బిలాల్ పరాచా తెలిపారు. ఖైబర్ పఖ్తూంఖ్వా ఇంటిగ్రేటెడ్ టూరిజం డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌కు అదనంగా మంజూరైన 30 మిలియన్ అమెరికన్ డాలర్లు ప్రావిన్సుల్లో అందమైన పర్యాటక ప్రదేశాలకు చేరుకునే అవకాశాన్ని మెరుగుపరచేలా రెండు రహదారుల పునరుద్ధరణను పూర్తిచేయడం ద్వారా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది.'ఈ అదనపు ఆర్థిక సహాయం, ఖైబర్ పఖ్తూం ఖ్వా ప్రావిన్సు అభివృద్ధి లక్ష్యాలకు మద్దతివ్వడంలో వరల్డ్ బ్యాంక్ నిబద్ధతను హైలైట్ చేస్తోంది' అని పరాచా పేర్కొన్నారు.ప్రస్తుతం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన పాకిస్థాన్.. ఇప్పటికే పలు దఫాలుగా వందల మిలియన్ డాలర్లను ప్రపంచ బ్యాంకు అందిస్తూనే ఉంది. అయితే ఈ సాయం ఏమాత్రం సరిపోవడం లేదు. ఈ నేపథ్యంలో వివిధ అభివృద్ధి పథకాల పేరుతోనూ సాయం తీసుకుంటున్నట్లు సమాచారం. కానీ పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత రెచ్చగొట్టే వ్యాఖ్యలతో కయ్యానికి కాలు దువ్వుతున్న దాయాదికి ఈ నిధుల మంజూరు ఊరటనిచ్చే అంశంగానే చెప్పవచ్చు,


## బాధితురాలిని పెళ్లి చేసుకున్న అత్యాచార నిందితుడు



న్యూఢిల్లీ-నవభూమి: ఆ యువకుడు అత్యాచార కేసులో నిందితుడిగా ఉన్నాడు. ప్రస్తుతం అరెస్ట్ అయి జైల్లో ఉండగా.. అతడు తన తప్పును తెలుసుకున్నాడు. ముఖ్యంగా బాధితురాలినే పెళ్లి చేసుకోవడానికి ఒప్పుకున్నాడు. ఇదే విషయాన్ని అక్కడి జైలు అధికారులకు చెప్పగా, అమ్మాయి తల్లిదండ్రులు కూడా ఒప్పుకున్నారు. దీంతో జైలునే పెళ్లి మండపంగా మార్చేసి.. అక్కడే వీరిద్దరికీ వివాహం జరిపించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు, పోలీసుల నడుమే.. నిందితుడు బాధితురాలి మెడలో మూడు ముళ్లు వేశాడు. ఆపై వధువు అత్తారింటికి వెళ్లగా.. వరుడు మాత్రం జైలుకి వెళ్లాడు. ఒడిశాలోని గంజాం జిల్లా గొచ్చబడి ప్రాంతానికి చెందిన 26 ఏళ్ల సూర్యకాంత్ బెహెరా.. అదే ప్రాంతానికి చెందిన 22 ఏళ్ల యువతిని ప్రేమిస్తున్నానంటూ వెంట పడ్డాడు. నీకోసం ఏమైనా చేస్తానని చెబుతూ.. ఆమె చుట్టూనే తిరిగాడు. ఆమెకు కూడా ఇతడు నచ్చగా ఓకే చెప్పింది. ఇక ఆపై ఇద్దరూ కలిసి చెట్టాపట్టాలేసుకుని తిరిగారు. ఎలాగూ పెళ్లి చేసుకుంటాం కదా అని శారీరకంగా కూడా కలిశారు. ఇలా చాలా సార్లే చాటుమాటుగా కలుస్తూ ఎంజాయ్ చేయగా.. ఎన్నాళ్లు ఇలాగే ఉంటామని యువతి పెళ్లి చేసుకుందామని అడిగింది. కానీ సూర్యకాంత్ మాత్రం పెళ్లి వద్దని తెగేసి చెప్పాడు. నిన్ను చేసుకోనంటూ వివరించాడు. దీంతో ఆ అమ్మాయి షాక్ అయ్యింది.శారీరకంగా వాడుకున్న తర్వాత పెళ్లికి నో చెప్పడాన్ని జీర్ణించుకోలేకపోయిన ఆమె తన తల్లిదండ్రులకు విషయం చెప్పింది. పెళ్లంటూ చేసుకుంటే అతడిని చేసుకుంటానని వివరించింది. తప్పు చేసింది అతడే కాబట్టి శిక్ష కూడా అతడికే పడాలని 2024 నవంబర్ నెలలో పోలీసులను ఆశ్రయించింది. తనకు సూర్యకాంత్ చేసిన అన్యాయం గురించి వివరించి అత్యాచారం కింద కేసు పెట్టింది. దీంతో పోలీసులు సూర్యకాంత్ బెహరాను అరెస్ట్ చేశారు. కోడెలలోని సబ్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉంచారు. ఇప్పటికీ అతడు అక్కడే ఉండగా.. అతడి తల్లిదండ్రులు మాత్రం కుమారుడు జైల్లో ఉండడాన్ని ఏమాత్రం జీర్ణించుకోలేకపోయారు. ఈక్రమంలోనే సూర్యకాంత్‌ని కలిసి.. నువ్వు చేసింది తప్పే కాబట్టి ఆ అమ్మాయినే పెళ్లి చేసుకో అని వివరించారు.ఇక చేసేదేమీ లేక తల్లిదండ్రులు చెప్పినట్లుగా బాధితురాలినే పెళ్లి చేసుకుంటానని సూర్యకాంత్ వివరించాడు. దీంతో అతడి తల్లిదండ్రులు బాధితురాలి ఇంటికెళ్లి మాట్లాడారు. మీ అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడు, కేసు వాపసు తీసుకోమన్నారు. అయితే వారిపై నమ్మకం లేని అమ్మాయి తల్లిదండ్రులు పెళ్లయ్యాకే కేసు వెనక్కి తీసుకుంటామన్నారు. దీంతో జైల్లోనే పెళ్లి జరిపిద్దామని రాజీకి వచ్చారు. ఇదే విషయాన్ని అక్కడి జైలు అధికారులకు చెప్పగా.. వారు కూడా పెళ్లి జరిపించడానికి ఓకే చెప్పారు. జైల్లోనే వివాహం ఉంటుందని.. ఏర్పాట్లన్నీ తామే చేస్తామన్నారు. ఇలా మంగళవారం రోజు వీరి పెళ్లికి అన్ని ఏర్పాట్లు పూర్తవ్వగా.. వధువు సహా ఆమె తల్లిదండ్రులు, వరుడి తల్లిదండ్రులు జైలుకి వచ్చారు.అప్పటికే ఏర్పాట్లన్నీ చేసి ఉండగా.. పోలీసులు, తల్లిదండ్రుల ఎదుటే సూర్యకాంత్ బాధితురాలి మెడలో తాళి కట్టాడు. ఆపై జైలు అధికారులు సహా తల్లిదండ్రుల వద్ద ఆశీర్వాదం తీసుకున్నారు. ఇలా వీరిద్దరి పెళ్లి అయిపోగా.. సూర్యకాంత్ జైలుకి వెళ్లగా.. అమ్మాయి మాత్రం అత్తారింటికి వెళ్లింది. త్వరలోనే తమ కుమారుడు జైలు నుంచి బయటకు వచ్చి.. తన కోడలితో కలిసి కొత్త జీవితాన్ని ప్రారంభిస్తాడని, పిల్లాపాపలతో హాయిగా ఉంటాడని సూర్యకాంత్ తండ్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# పీఓకేను స్వాధీనం చేసుకోండి..

## భారత్‌కు బ్రిటీష్ ఎంపీ సూచన



శ్రీనగర్--నవభూమి: పహల్గాం ఉగ్రదాడిని దేశ వ్యాప్తంగా ఉన్న ప్రజలంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ముఖ్యంగా ఇండియాలో పుట్టి పెరిగిన బ్రిటీష్ ఎంపీ లార్డ్ మేఘనాథ్ దేశాయ్ తాజాగా ఈ ఘటనపై స్పందించారు. కశ్మీర్ సమస్యను పూర్తిగా పరిష్కరించాలంటే పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకోవాలని భారత ప్రభుత్వానికి సూచించారు. అప్పుడే అన్ని సమస్యలు తొలిగిపోతాయని.. ఉగ్రవాదులు, పహల్గాంలో జరిగినటువంటి చర్యలు మళ్లీ జరగవని పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ దాడికి భారత్ కఠినంగా సమాధానం చెప్పాలని తెలిపారు.భారత సంతతికి చెందిన బ్రిటీష్ ఎంపీ లార్డ్ మేఘనాథ్ దేశాయ్ తాజాగా పహల్గాం ఉగ్రదాడిపై స్పందించారు. 26 మంది అమాయక పర్యటకుల ప్రాణాలు తీయడం అతిక్రూరమైన చర్య అని.. దాన్ని తలుచుకుంటుంటూనే రక్తం మరిగిపోతుందని అన్నారు. కశ్మీర్ వివాదంలో ఇదే చివరి ఘటన కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని తాను నమ్ముతున్నానని అన్నారు. కశ్మీర్‌లో ఉన్న సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తామనని ప్రధాని మోదీ ఇప్పటికే చాలా సార్లు చెప్పారని గుర్తు చేశారు. పీఓకే ఎప్పటికీ భారత దేశానికి అని కూడా వ్యాఖ్యానించారు.

పీఓకేను పూర్తిగా స్వాధీనం చేసుకుంటేనే.. కశ్మీర్ సమస్య పూర్తిగా సమసిపోతుందని మేఘనాథ్ దేశాయ్ వెల్లడించారు. అప్పుడే ఉగ్రవాదం రూపుమాపుతుందని వివరించారు. మరోవైపు పహల్గాం ఉగ్రదాడి నేరస్థులకు కఠిన శిక్ష విధించాలని తాము భారత్‌ను కోరుతున్నట్లు బ్రిటన్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఉగ్రవాద నిర్మూలనలో న్యూఢిల్లీకి తాము ఎప్పుడూ అండగా ఉంటామని వివరించింది. అంతేకాకుండా ఇటీవలే లండన్‌లో భారతీయులు పహల్గాం ఘటనకు వ్యతిరేకంగా నిరసన చేపడుతుంటే.. అక్కడి పాకిస్థాన్ హైకమిషన్ అధికారి వారిని బెదిరిస్తున్న వీడియో చూసి తీవ్ర ఆందోళనకు గురైనట్లు పేర్కొంది. దీనిపై విచారణ జరుపుతున్నామని కూడా వెల్లడించింది.

ఇటు ఇండియా అటు పాకిస్థాన్‌తో తమకు సత్సంబంధాలు ఉన్నందు వల్ల వారి మధ్య ఉద్రిక్తతలు చెలరేగాలని తాము కోరుకోవడం లేదని బ్రిటీశ్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ పేర్కొంది. ముఖ్యంగా కశ్మీర్ ప్రజల నిర్ణయాన్ని పరిగణలోకి తీసుకుని.. వారు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడాన్ని భారత్-పాక్ తమ బాధ్యతగా భావించాలని సూచించింది.

## భారత్ నుంచి 786.. పాకిస్తాన్ నుంచి 1376..రూల్స్ బ్రేక్ చేస్తే జైలే



శ్రీనగర్--నవభూమి: పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన తర్వాత ఇండియా బాగా సీరియస్ అయింది. దానిలో భాగంగా ఇక్కడ రకరకాల వీసాలతో ఉన్న పాకిస్తాన్ సిటిజన్లందరూ ఒక నిర్ధిష్ట గడువులోపు వాళ్ల దేశానికి తిరిగి వెళ్లిపోవాలని ఆర్డర్ వేసింది. దీంతో పాకిస్తాన్ నుంచి వచ్చినోళ్లంతా ఇండియాను వదిలిపోతుంటే... అక్కడ ఉన్న మనోళ్లంతా తిరిగొచ్చేస్తున్నారు. అధికారులు చెప్పిన ప్రకారం.. ఏప్రిల్ 24 నుంచి 29 మధ్యలో పంజాబ్‌లో ఉండే అటారీ-వాఘా బోర్డర్ గుండా 786 మంది పాకిస్తాన్ వాళ్లు కార్లలో వాళ్ల ఊళ్లకు పోయారు. అదే టైంలో అక్కడి నుంచి 1,376 మంది మనోళ్లు ఇండియాకి తిరిగొచ్చేశారు.ఇండియాలో ఉంటున్న పాకిస్తాన్ వాళ్లంతా ఏప్రిల్ 26 లోపల దేశం వదిలిపోవాలని మొన్ననే కేంద్రం ఆర్డర్ పాస్ చేసింది. మెడికల్ వీసాతో వచ్చిన వాళ్లకి మాత్రం ఈ నెల 29 వరకు టైమ్ ఇచ్చింది. బిజినెస్, టూరిస్ట్, స్టూడెంట్ ఇలాంటి 12 రకాల వీసాలు ఉన్నోళ్లంతా ఏప్రిల్ 27 నాటికి పోవాలని గట్టిగా చెప్పింది. దీనితో చాలా ఏళ్లుగా ఇండియాలో ఉంటున్న పాకిస్తాన్ వాళ్లు వాళ్ల ఫ్యామిలీలను వదిలి సొంతూళ్లకు తిరిగి వెళ్తుండటంతో బోర్డర్ దగ్గర చాలా ఎమోషనల్‌గా ఉంది సీన్. 29తో భారత ప్రభుత్వం వాళ్లకిచ్చిన టైమ్ అయిపోయింది. దానిలో భాగంగానే సార్క్ వీసా స్కీమ్ ద్వారా ఇండియా తిరుగుతున్న పాకిస్తాన్ వాళ్లని 48 గంటల్లో తిరిగి వాళ్ల దేశానికి పోవాలని మన ప్రభుత్వం కోరింది.జనాలకు ఇచ్చిన టైమ్ అయిపోవడంతో కేంద్రం ఆర్డర్ ప్రకారం బుధవారం అధికారులు అటారీ-వాఘా బోర్డర్‌ను మూసేశారు. ఏప్రిల్ 4 నుంచి వచ్చిన 'ఇమిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్-2025' ప్రకారం... టైమ్ అయినా ఇక్కడే ఉంటే, వీసా రూల్స్ తప్పితే, వెళ్లకూడని ప్లేస్‌లకు వెళ్తే మూడేళ్ల జైలు శిక్ష, మూడు లక్షల వరకు ఫైన్ వేస్తామని భారత ప్రభుత్వం పాకిస్తాన్ వాళ్లకి వార్నింగ్ ఇచ్చింది.

## 'చెవి పక్కనుంచే తూటా వెళ్లింది'... పహల్గాంలో ఓ జంట షాకింగ్ అనుభవం!



శ్రీనగర్--నవభూమి: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి ఎన్నో కుటుంబాల్లో విషాదాలు మిగిలిస్తే.. మరికొన్ని కుటుంబాలు వెంట్రుక వాసిలో ఆ ప్రమాదం నుంచి తప్పించుకున్నాయి. ఈ సమయంలో ఒక్కొక్కరూ వారి వారి భయానక అనుభవాలను పంచుకుంటున్నారు. ఈ సమయంలో వెంట్రుక వాసిలో తప్పించుకున్న ఓ జంట తన షాకింగ్ అనుభవాన్ని పంచుకున్నారు. అవును... పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది మృతి చెందగా, పదుల సంఖ్యలో గాయపడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో మరికొంతమంది వెంట్రుక వాసిలో తప్పించుకుని ప్రాణాలు కాపాడుకున్నారు. అలాంటి వారిలో కర్ణాటకకు చెందిన ప్రదీప్ హెగ్డే, శుభా హెగ్డే దంపతులు ఒకరు. ఈ సందర్భంగా శ్రీనగర్ లో జరిగిన అనుభవాన్ని పంచుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... ప్రదీప్ హెగ్డే, శుభా దంపతులు వారి కుమారుడు సిద్ధాంత్ కలిసి ఈ నెల 21న శ్రీనగర్ వెళ్లారు. ఈ క్రమంలో 22న పహల్గాం చెరుకుని, అక్కడ నుంచి బైసరన్ వ్యాలీకి గుర్రాలపై బయలుదేరారు. అప్పటికే అక్కడ చాలా మంది పర్యాటకులు ఉన్నారు. మరోపక్క గేటుకు ఓ వైపు జిప్ లైన్ ఖాళీగా కనిపించింది. దీంతో.. ముందుగ జిప్ లైన్ ఎక్కాలని అనుకున్నారు. ఈ క్రమంలో అక్కడే సుమారు గంటసేపు గడిపారు. అప్పటికే సమయం మధ్యాహ్నం 1:45 అయ్యింది. దీంతో... వారి కుమారుడు ఆకలిగా ఉందని చెప్పడంతో సమీపంలోని ఫుడ్ స్టాల్ కు వెళ్లి మ్యాగీ ఆర్డర్ చేశారు. ఇంతలో శుభా హెగ్డే వాష్ రూమ్ కు వెళ్లేందుకు సుమారు అర కిలోమీటర్ దూరం నడుచుకుంటూ వెళ్లింది. అయితే అది పే అండ్ యూజ్ కావడంతో డబ్బుల కోసం తిరిగి వచ్చింది. ఆమె వచ్చే లోపు ఆమె భర్త, కుమారుడు ఆహారం తినేశారు. దీంతో.. ఆమె కూడా ఆహారం తింటున్న సమయంలో టీ ఆర్డర్ చేశారు. సరిగ్గా అప్పుడే తొలిసారిగా తుపాకీ చప్పులు వినిపించాయి. అయితే... అడవి జంతువులను బెదిరించడానికి టపాసులు పేలుస్తున్నారని భావించారే తప్ప.. అవి కాలుప మోత అని వారికి తొలుత తెలియలేదు. పైగా ఫుడ్ స్టాల్ ఓనర్ కూడా అలానే చెప్పాడు. అయితే... ఓ 20 సెకన్ల తర్వాత ఇద్దరు ఉగ్రవాదులు తుపాకులు పట్టుకుని వారి దిశగా రావడాన్ని ప్రదీప్ గమనించారు. ఆ తర్వాత వెంటనే నేలపై పడుకున్నారు. ఈ సమయంలో సెల్ ఫోన్లు, కార్డులు, డబ్బులూ అన్నీ ఉన్న బ్యాగ్ టెబుల్ పై ఉండటంతో.. దాని కోసం శుభా పైకి లేచింది. దాన్ని తీసుకుని కిందకు వంగేలోపు ఆమె కుడి చెవి పక్కనుంచి ఏదో వెళ్లినట్లు అనిపించింది. వెనక్కి తిరిగి చూస్తే అది తూటా! అయితే కాసేపటి తర్వాత అలజడి తగ్గడంతో గేటు బయటకు రాగా.. అక్కున్న వారిని పైకి తీసుకొచ్చిన గుర్రపుస్వారీ వ్యక్తి కనిపించాడు. అయితే అప్పటికే ఈ అలజడికి అక్కడున్న గుర్రలన్నీ చెల్లాచెదురైపోయాయి. ఈ సమయంలో తమను కిందకు తీసుకెళ్లమని కోరగా అందుకు అతడు అంగీకరించాడు అని చెబుతూ వారి భయానక అనుభవాన్ని పంచుకున్నారు.

# పాకిస్తాన్ దుస్థితిపై స్థానిక నటి సంచలన వ్యాఖ్యలు



ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా పాకిస్తానీలకు అవమానాలు తప్పడం లేదని తీవ్ర ఆవేదనను కనబరిచారు పాక్ నటి సభా కమర్. ఓసారి షూటింగ్ కోసం జార్జియాలోని టిబిసిలికి వెళ్లగా, ఎయిర్ పోర్ట్‌లో భారతీయులను అనుమతించారు కానీ నన్ను ఆపారు. పాస్ పోర్ట్ సహా అన్నీ చెక్ చేసాకే నన్ను లోనికి అనుమతించారు.. దానికి ముందు ఎన్నో ప్రశ్నలు వేసారు! అని ఆవేదన వ్యక్తం చేసారు. మా దేశంలో పాకిస్తాన్ జిందాబాద్ అని అంటాం. కానీ బయటికి వెళ్లినప్పుడే పాకిస్తాన్ పరిస్థితి ఏమిటన్నది అర్థమవుతుంది.. అని వ్యాఖ్యానించారు. సబా మీడియాతో మాట్లాడేప్పుడు తీవ్ర ఉద్వేగానికి లోనవ్వడమే గాక కంట తడి కూడా పెట్టుకున్నారు. %ూశ్రీంశీ =ఝు౹ - ూవీది%29 : పాట తర్వాత పాస్ పోర్ట్ వెనక్కి! 'హిందీ మీడియం' లాంటి బ్లాక్ బస్టర్ చిత్రంతో పాకిస్తాన్ నటి సబా కమర్ బాలీవుడ్ లో అడుగుపెట్టారు. ఈ చిత్రంలో దీపక్ డోబ్రియాల్, అమృతా సింగ్ తదితరులు నటించారు. ఇది భారతదేశంలో రూ.70 కోట్ల నికర ఆదాయం ఆర్జించింది. ప్రపంచవ్యాప్తంగా రూ.110 కోట్లు వసూలు చేసింది. 2018 ఏప్రిల్ 4న చైనాలో హిందీ మీడియం విడుదలై రూ.220 కోట్లు వసూలు చేసింది. ఆ విధంగా హిందీ మీడియం ప్రపంచవ్యాప్త వసూళ్లు రూ.330 కోట్లకు చేరుకున్నాయి. ఇది అత్యంత లాభదాయకమైన హిందీ చిత్రాలలో ఒకటిగా నిలిచింది. మాడాక్ ఫిల్మ్స్ - టి-సిరీస్ బ్యానర్‌లపై దినేష్ విజన్ -భూషణ్ కుమార్ హిందీ మీడియంను నిర్మించారు. ఈ చిత్రానికి సాకేత్ చౌదరి దర్శకత్వం వహించారు.

నవచిత్ర



# హర్రర్ కనకరాజు కోసం జాంబీ ఐటెం...!



వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందుతున్న హర్రర్ కామెడీ మూవీ 'కొరియన్ కనకరాజు'. ఈ సినిమాను ఇటీవల ప్రారంభించారు. కొన్ని రోజుల క్రితం సినిమా షూటింగ్ ప్రారంభంకు సంబంధించిన వీడియోను విడుదల చేసి అందరి దృష్టిని ఆకర్షించారు. అనౌన్స్మెంట్ వీడియోతోనే సోషల్ మీడియాలో సినిమా గురించి పాజిటివ్ బజ్ కలిగేలా మేకర్స్ చేశారు. ఈ సినిమాలో వరుణ్ తేజ్‌తో పాటు కీలక పాత్రలో కమెడియన్ సత్య కనిపించబోతున్నాడు. అనౌన్స్మెంట్ వీడియలో ఆయన కామెడీ నవ్వు తెప్పించింది. ఈ మధ్య కాలంలో సత్య నటించిన సినిమాలకు మంచి స్పందన దక్కుతోంది. అతడి కామెడీకి మంచి మార్కులు దక్కుతున్నాయి. అందుకే ఈ సినిమాలో ఆయన కామెడీ ఆకట్టుకునే అవకాశాలు ఉన్నాయి. కొరియన్ కనకరాజు సినిమాలో వరుణ్ తేజ్‌కి జోడీగా రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెల్సిందే. ఇటీవలే ఆమె షూటింగ్‌లో పాల్గొన్నట్లు సమాచారం అందుతోంది. సినీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమాలో మరో హీరోయిన్ కూడా కనిపించబోతుంది. ఆ హీరోయిన్ మరెవ్వరో కాదు దక్ష నాగర్కర్. ఆ మధ్య తేజ సజ్జా, ప్రశాంత్ వర్మల కాంబోలో వచ్చిన జాంబీ రెడ్డి సినిమాలో హీరోయిన్‌గా నటించి మెప్పించిన దక్ష ఆ తర్వాత పలు సినిమాల్లో చిన్నా చితకా పాత్రల్లో కనిపిస్తూ వస్తుంది. ఆ మధ్య నాగార్జున, నాగ చైతన్య సినిమా బంగార్రాజులో ప్రత్యేక పాటలో కనిపించడం ద్వారా మరింత పాపులారిటీని సొంతం చేసుకుంది.ఆయన మాటను ఇప్పటికీ ఫాలో అవుతున్నా గత ఏడాది లవ్ మి, స్వాగ్ సినిమాల్లో నటించిన ఈ అమ్మడు తాజాగా కొరియన్ కనకరాజు సినిమాలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. హీరోయిన్‌గా కాకుండా ఒక ఐటెం సాంగ్‌లో ఈమె కనిపించబోతుందనే వార్తలు వస్తున్నాయి. ఈమధ్య కాలంలో ఐటెం సాంగ్స్‌లో హీరోయిన్స్ నటిస్తున్నారు. ఐటెం సాంగ్స్ చేసిన హీరోయిన్స్‌కి మంచి గుర్తింపు లభిస్తుంది. కనుక దక్ష నాగర్కర్‌కి కచ్చితంగా మంచి స్పందన వచ్చే అవకాశాలు ఉన్నాయి. మేర్లపాక గాంధీ మంచి కాన్సెప్ట్ ఓరియంటెడ్ సినిమాలను చేస్తాడనే టాక్ ఉంది. కనుక ఆయన సినిమా హిట్ అయితే, ఆ సినిమాలోని ఈ పాటకు మంచి రెస్పాన్స్ దక్కితే తప్పకుండా ముందు ముందు ఈ అమ్మడు టాలీవుడ్‌లో ఐటెం సాంగ్స్ ఆఫర్లు దక్కించుకునే అవకాశాలు ఉన్నాయి. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌లో రూపొందుతున్న కొరియన్ కనకరాజు సినిమాలో వరుణ్ తేజ్ లుక్ నుంచి మొదలుకుని ప్రతి ఒక్కటి చాలా విభిన్నంగా ఉంటుందని మేకర్స్ అంటున్నారు. వరుణ్ తేజ్‌లోని కామెడీ యాంగిల్ ను ఎఫ్ 2, ఎఫ్ 3 లో చూసిన ప్రేక్షకులు మరోసారి ఈ సినిమాలో ఆయన కామెడీ యాంగిల్‌ను చూస్తారని సమాచారం అందుతోంది. మాస్ ఆడియన్స్‌ను మెప్పించే విధంగా దక్ష ఐటెం సాంగ్ ఉండబోతుంది. ప్రస్తుతం ఐటెం సాంగ్ షూటింగ్ జరుగుతుందని సమాచారం అందుతోంది. అయితే ఇప్పటి వరకు అధికారికంగా మాత్రం క్లారిటీ రావాల్సి ఉంది. ఈ సినిమాను ఇదే ఏడాదిలో విడుదల చేసే విధంగా మేర్లపాక గాంధీ ప్రయత్నాలు చేస్తున్నాడు.

# దేశం లోపలి నుంచే శుద్ధి మొదలుపెట్టాలి




పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడి యావత్ భారతదేశాన్ని తీవ్రంగా కలచివేసింది. అమాయకులైన టూరిస్టులు ఈ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోవడంపై దేశవ్యాప్తంగా ప్రజలు ఎంతో కోపంతో రగిలిపోతున్నారు. ఆ ఉగ్రదాడికి నిరసనగా దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలందరూ స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చి నిరసన తెలుపుతున్నారు. ఉగ్రవాద శక్తులపై నినాదాలు చేస్తూ, తమ నిరసనను వ్యక్తం చేస్తూ ఉగ్రవాదం నశించాలి, భారత్‌మాతాకీ జై అంటూ కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించి దాడిలో చనిపోయిన వారికి శ్రద్ధాంజలి ఘటిస్తున్నారు. ఉగ్రదాడికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రజలంతా ప్రభుత్వానికి లేఖలు కూడా రాస్తున్నారు. %ూశ్రీంశీ =ఝు౹% - జాట్ మొదటి ఛాయిస్ సన్నీ డియోల్ కాదట! ఈ విషయంపై సోషల్ మీడియాలో కూడా పెద్ద ఎత్తున డిస్కషనే జరుగుతుంది. లాంటి హ్యాష్ ట్యాగులతో తమ కోపాన్ని వ్యక్తం చేస్తున్నారు నెటిజన్లు. దేశంలోని ప్రజలంతా ఒకతాటిపై నిలబడి ఈ ఉగ్రదాడిని ఖండిస్తూ పాకిస్తాన్ జాతీయ జెండాని రోడ్లపై అంటించి కాళ్లతో తొక్కుతూ నిరసన తెలుపుతున్నారు. కానీ హిమాచల్ ప్రదేశ్ లోని ఓ యువతి రోడ్లపై అంటించిన పాక్ జెండాలను తొలగించి, దాన్ని తొక్కనీయకుండా అడ్డుకోవడంతో స్థానికులు ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సదరు మహిళతో గొడవ పడి పాక్ జెండాని తిరిగి రోడ్డుపై అంటించాలని కోరినప్పటికీ ఆమె దానికి నిరాకరించింది. దీనికి సంబంధించిన వీడియో కూడా ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే ఈ విషయంలో తాజాగా టాలీవుడ్ నటి, మెగా కోడలు లావణ్య త్రిపాఠి స్పందించింది. మన సైనికులు వారి ప్రాణాలను అడ్డుగా వేసి దేశాన్ని కాపాడుతుంటే, కొందరు దేశానికి హాని కలిగించే వారికి మద్దతు ఇవ్వడం ఎంతో బాధగా ఉందని, దేశం లోపలి నుంచే శుద్ధిని మొదలుపెట్టాలని లావణ్య త్రిపాఠి పోస్ట్ చేయగా, ఆ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతుంది.

# కియరాకి దిష్టి తగిలిందా.. అయినా ఆ రెండు ఉన్నాయ్ కదా..?



మొన్నటిదాకా బాలీవుడ్ లో హీరోయిన్ కియరా అద్వాని పేరు మారుమోగింది. అమ్మడు ఏం చేసినా అదో అద్భుతం అన్నట్టుగా ఉండేది. సినిమాలు, సీరీస్ లతో బీ టౌన్ ఆడియన్స్ కి నిద్ర పట్టకుండా చేస్తూ వచ్చింది కియరా. ఆ క్రేజ్ తోనే తెలుగు సినిమాల ఛాన్స్ లు కూడా అందుకుంది. మహేష్ తో భరత్ అనే నేను చేసిన అమ్మడు రాం చరణ్ తో వినయ విధేయ రామ, గేం ఛేంజర్ రెండు సినిమాలు చేసింది. ఐతే గేం ఛేంజర్ మీద ఎన్నో ఆశలు పెట్టుకోగా అది కాస్త బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. మొన్నటిదాకా కియరా హిందీలో సూపర్ ఫాం కొనసాగించగా సడెన్ గా ఆమె కెరీర్ గ్రాఫ్ పడిపోతూ వచ్చింది. ఐతే దీనికి ఆమె పెళ్లి చేసుకోవడం ఒక కారణమని కొందరు చెబుతున్నారు. పెళ్లే కారణం అయితే ఆఫ్టర్ మ్యారేజ్ కూడా సక్సెస్ ఫాం కొనసాగిస్తున్న భామలు చాలా మంది ఉన్నారు. సో ఆ రీజన్ కరెక్ట్ అని చెప్పలేం. %ూశ్రీంశీ =ఝు౹ - ూవీది%29 : పాట తర్వాత పాస్ పోర్ట్ వెనక్కి! ఇక కథల సెలక్షన్ లో కియరా చేస్తున్న మిస్టేక్స్ కెరీర్ కి కాస్త బ్రేకులు వేస్తున్నాయన్నట్టుగా చెప్పొచ్చు. గేం ఛేంజర్ తర్వాత కియరా పరిస్థితి ఏంటి అనుకునే వారికి ఆమె చేస్తున్న రెండు సినిమాలు హోప్స్ కలిగిస్తున్నాయి. ముందుగా అమ్మడు హృతిక్ రోషన్, ఎన్ టీ ఆర్ కలిసి చేస్తున్న వార్ 2 లో నటిస్తుంది. ఈ సినిమాలో కియరా గ్లామర్ కూడా అదిరిపోతుందని టాక్. వార్ 2 తో పాటు యష్ టాక్సిక్ లో కూడా నటిస్తుంది అమ్మడు. టాక్సిక్ సినిమాలో యష్ తో కియరా జత కడుతుంది. ఈ రెండు సినిమాలతో కియరా తిరిగి సరైన ట్రాక్ లోకి రావాలని అనుకుంటుంది. కచ్చితంగా ఈ రెండు సినిమాలు ఆమెకు మంచి మైలేజ్ తెస్తాయని చెప్పొచ్చు. కియరా బాలీవుడ్ ఫాం చూసి దిష్టి పెట్టారు కాబట్టే ఆమెకు అవకాశాలు రావట్లేదు అనుకుంటున్న వారు ఉన్నారు. కానీ ఆమె నుంచి రాబోతున్న వార్ 2, టాక్సిక్ ఈ రెండు సినిమాల వల్ల తప్పకుండా మళ్లీ తన సత్తా చాటుతుందని భావిస్తున్నారు. మరి కియరా కంబ్యాక్ ఇవ్వాలని ఆమె సౌత్ ఫ్యాన్స్ కూడా కోరుతున్నారు. మళ్లీ అమ్మడు ఇక్కడ సినిమాలు చేయాలని ఆశిస్తున్నారు.

# రష్మిక.. డిజాస్టర్ దెబ్బ పోవాలంటే ఈసారి కొట్టాల్సిందే..



ఇటీవల బాలీవుడ్ లో అద్భుతమైన విజయాలను అందుకున్న నటి రష్మిక మందన్నా, ప్రస్తుతం కొత్త సవాలును ఎదుర్కొంటోంది. 'పుష్ప 2', 'అనిమల్', 'ఛావా' వంటి సినిమాలతో వరుసగా 500 కోట్ల క్లబ్‌లో ఎంట్రీ ఇచ్చిన రష్మిక, బాలీవుడ్‌లో దీపికా పదుకొణె, ఆలియా భట్‌లను కూడా ఓడించినట్టు ట్రేడ్ విశ్లేషకులు పేర్కొన్నారు. కానీ ఈ గ్లోరీస్ జర్నీకి మధ్యలో 'సికందర్' రూపంలో ఓ పెద్ద బ్రేక్ తగిలింది. సల్మాన్ ఖాన్ సరసన నటించిన 'సికందర్' సినిమా కథాపరంగా విఫలమైంది. కంటెంట్‌లో పస లేకపోవడం, రష్మిక పాత్ర రెగ్యులర్ ట్రాక్ లో ఉండటంతో విమర్శలు వెల్లువెత్తాయి. ట్రోలింగ్‌ను ఎదుర్కోవడం రష్మికకు పెద్ద షాక్‌గా మారింది. ఇక ఈ కామెంట్స్ ను దాటి మళ్లీ రష్మిక సత్తా చూపించాలంటే మరో సాలీడ్ హిట్ అందుకోవాల్సిన అవసరం ఉంది. ఇక ఇప్పుడు హోప్స్ అన్నీ 'థామ' మీదే ఉన్నాయి. మాడాక్ ఫిలింస్ నిర్మిస్తున్న ఈ హారర్ కామెడీ ప్రాజెక్ట్‌లో రష్మిక, ఆయుష్మాన్ ఖురానా జోడీగా నటిస్తున్నారు. ప్రస్తుతం ఊటీ కొండల్లో షూటింగ్ జరుగుతోంది. హారర్ ఎలిమెంట్స్ మిక్స్ తో ఉన్న కామెడీ ట్రాక్‌తో మాడాక్ సంస్థకు మంచి ట్రాక్ రికార్డు ఉంది. ఈ ప్రొడక్షన్ లో వచ్చిన స్త్రీ సీరీస్, బెడియా, ముంజ్యా సినిమాలు వందల కోట్లు రాబట్టయి. ముఖ్యంగా స్త్రీ 2 800 కోట్లు రాబట్టింది. అందుకే 'థామ'పై మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇక దీపావళి సీజన్‌లో, అక్టోబర్ 19న విడుదల కాబోతున్న ఈ సినిమా రష్మికకు కీలక పరీక్షగా మారనుంది. సికందర్ ఫెయిల్యూర్ తరువాత ఆమెను తిరిగి స్టార్ రేసులో నిలబెట్టే అవకాశం ఇది. అదే సమయంలో బాలీవుడ్ ప్రేక్షకుల్లో కొత్తగా యూత్ ఫేవరైట్‌గా నిలబడేందుకు రష్మికకి ఇది మంచి ఛాన్స్. 'థామ' లో ఆమె పాత్రను బలంగా రాసారని, స్క్రీన్ టైమ్ కూడా మెరుగుగా ఉంటుందని సమాచారం. మరో ఆసక్తికర అంశం ఏమిటంటే, ఇప్పటివరకు రష్మిక నటించిన పాన్ ఇండియా సినిమాల్లో మాస్ అవుట్‌పుట్ ఎక్కువగా కనిపించేది. కానీ 'థామ' వంటి హారర్ కామెడీ సినిమాతో ఆమె నటనలో న్యూ సైడ్ చూపించబోతున్నారు. ఆ పాత్రను ఆమె ఎంతవరకు విజయవంతంగా మోస్తుందన్నదే ఈ ఫెస్టివల్ బాక్సాఫీస్ వార్‌లో కీలకం కానుంది. మొత్తంగా చూస్తే, 'థామ' రష్మికకు మరో మేజర్ టర్నింగ్ పాయింట్ అవుతుంది. దీపావళి బాక్సాఫీస్‌లో ఈ సినిమా సూపర్ హిట్ అయితే, 'సికందర్' వలయాన్ని పూర్తిగా చెరిపేసి మళ్లీ రష్మికను బాలీవుడ్ క్వీన్‌గా నిలబెట్టొచ్చు. కానీ మరోసారి ఫ్లాప్ ఎదురైతే మాత్రం, కొత్త వారితో పోటీ మరింత కఠినం కావడం ఖాయం.

# కుంభమేళాలో పూసలమ్మే అమ్మాయేనా?



ప్రయాగ్‌రాజ్ కుంభమేళా చాలా మెరుపుల్ని పరిచయం చేసింది. అలాంటి ఒక మెరుపు ఈ పూసలమ్మే అమ్మాయి. ఈ భామ పరిచయం అవసరం లేదు. మోనాలిసా తన పేరు.. పేరుకు తగ్గట్టే సమ్మోహన రూపంతో కట్టి పడేసిన ఈ పూసలమ్మాయికి దేశవ్యాప్తంగా గొప్ప ఫాలోయింగ్ ఏర్పడింది. కుర్రాళ్లు వెంటపడి విసిగించేంతగా తన అందంతో కవ్వించింది మోనాలిసా. పూసలు, దండలు అమ్మే ఈ అమ్మాయి వెంట బోయ్స్ పిచ్చెక్కి తిరిగారు. పలువురు దర్శకనిర్మాతలు మోనాలిసాకు తమ సినిమాల్లో అవకాశాలు కల్పించేందుకు ముందుకు వచ్చారు. మోనాలిసా యూట్యూబ్ ఇంటర్వ్యూలు సంచలనంగా మారాయి. ఎట్టకేలకు మోనాలిసా తన తొలి సినిమాలో నటిస్తోందని వార్తలు వచ్చాయి. తాజా వీడియోలలో మోనాలిసా రూపు రేఖలు గుర్తు పట్టలేనంతగా మారిపోవడంతో ఇప్పుడు అందరూ ఆశ్చర్యపోతున్నారు. కట్టిపడేసేంతగా మేకోవర్‌తో ఆశ్చర్యపరుస్తోంది. అంతేకాదు ఈ మేకోవర్ తర్వాత మోనాలిసా గుర్తించలేనిదిగా కనిపిస్తోంది.అయితే ఈ మార్పునకు కారణం.. మేకప్ ఆర్టిస్ట్ మొహ్సినా అన్సారీ. మోనాలిసా రూపురేఖల్ని మార్చే విధంగా తనను అద్భుతంగా డిజైన్ చేసిన ఫోటోలు వీడియోలను షేర్ చేయగా అవి అంతర్జాలంలో వైరల్‌గా మారుతున్నాయి. మోనాలిసా చీరల్లో పూర్తిగా గ్లామరస్‌గా కనిపించింది. ఒక క్లిప్‌లో మోనాలిసా వధువుగా దుస్తులు ధరించి, ఆకుపచ్చ పచ్చలతో అలంకరించుకుని, భారీ ఆభరణాలతో, సాంప్రదాయ ఎరుపు పెళ్లి లెహంగాను ధరించి కనిపించింది. ఈ రూపం చూడగానే ఆమె ఈమేనా? అని ఆశ్చర్యపోయేంత సర్ ప్రైజ్ ని ఇచ్చింది. మరోసారి మోనాలిసా కొత్త రూపం వెబ్ లో హాట్ టాపిగ్గా మారింది. వైరల్ గర్ల్ మోనాలిసా మోడలింగ్ సహా సినిమాల్లో అవకాశాలు అందుకుని పెద్ద స్థాయికి ఎదిగేస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.

# పెదరాయుడు బాలకృష్ణ... పాపారాయుడు ఎన్టీఆర్..!



సినిమా ఇండస్ట్రీలో ఒకే కథ ఎంతో మంది హీరోల వద్దకు, దర్శక నిర్మాతల వద్దకు తిరుగుతూ ఉంటుంది. ఒక హీరో చేయాలి అనుకున్న కథను మరో హీరో చేయడం, ఒక హీరో నో చెప్పిన కథను మరో హీరో చేయడం మనం చూస్తూనే ఉంటాం. పవన్ కళ్యాణ్ తిరస్కరించిన చాలా కథలను రవితేజ ఎంపిక చేసుకుని హిట్ కొట్టిన సందర్భాలు చాలానే ఉన్నాయి అంటారు. కొన్ని రీమేక్ సినిమాలు సైతం ఒక హీరో అనుకుంటే మరో హీరో చేతికి వెళ్తుంది. ఒరిజినల్ భాషలో సూపర్ హిట్ అయిన సినిమాలను రీమేక్ చేయాలని ఒక హీరో అనుకుంటే ఆ లోపే మరో హీరో ఆ రీమేక్ రైట్స్‌ను కొనుగోలు చేయడం మనం చూస్తూనే ఉంటాం. దర్శక నిర్మాతలు కథలను పలు కారణాల వల్ల ఒక హీరో నుంచి మరో హీరో వద్దకు తీసుకు వెళ్తూ ఉంటారు. టాలీవుడ్ చరిత్రలో నిలిచి పోయే చిత్రం పెదరాయుడు. ఈ సినిమా నాట్టమై అనే సినిమాకు రీమేక్. మోహన్ బాబు డ్యూయెల్ రోల్‌లో నటించిన ఈ సినిమాలో రజనీకాంత్ గెస్ట్ రోల్‌లో కనిపించి మెప్పించాడు. అప్పట్లో సినిమా సంచలన విజయాన్ని సొంతం చేసుకోవడంతో మోహన్ బాబు స్టార్‌డం అమాంతం పెరగడం మాత్రమే కాకుండా ఆయనకు నిర్మాతగా బూస్ట్‌ను ఇచ్చింది. రజనీకాంత్ ఈ సినిమాలో కేవలం స్నేహం కోసం నటించాడు అని అంటారు. అంతే కాకుండా ఈ సినిమా రీమేక్ రైట్స్ మోహన్ బాబుకు దక్కడంలో రజనీకాంత్ కీలక పాత్ర పోషించాడని కూడా అంటూ ఉంటారు. మొదట ఈ సినిమా రీమేక్‌ను మరొకరు తీసుకునేందుకు ప్రయత్నించారు. ప్రముఖ నిర్మాత కేవీవీ సత్యనారాయణ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ పెదరాయుడు సినిమా వెనుక జరిగిన విషయాలను పంచుకున్నారు. ఆయన మాట్లాడుతూ నాట్టమై ను తెలుగులో రీమేక్ చేసేందుకు గాను రాఘవేంద్ర రావు సిద్ధం అయ్యారు. ఎన్టీఆర్, బాలకృష్ణలతో రీమేక్ చేయాలని ఆయన అనుకున్నారు.

# రింకూ చెంప చెల్లుమనిపించిన కుల్దీప్.. బ్యాన్ తప్పదా..



**న్యూదిల్లీ-నవభూమి:** ఐపీఎల్ అంటేనే ఎంటర్‌టైన్మెంట్‌కు అడ్డా. అయితే ఒక్కోసారి వినోదం కంటే ఇతర విషయాలు హైలైట్ అవుతుంటాయి. దేశం తరఫున కలసి ఆడే ఆటగాళ్లు కూడా ఫ్రాంచైజీల తరఫున ఆడేటప్పుడు బద్ధ శత్రువులుగా మారిన సంఘటనలూ అనేకం ఉన్నాయి. దోస్తుల మధ్య కూడా రైవల్రీలు జరుగుతూ ఉంటా యి. బూతులు తిట్టుకోవడమే గాక ఒక్కోసారి ప్లేయర్లు ఒకరిపై ఒకరు దూసుకెళ్లడం, కొట్టుకో వడం వరకూ వెళ్లిన దాఖలాలు ఉన్నాయి. అప్పట్లో పేసర్ శ్రీశాంత్‌ను టర్బనేటర్ హర్భజన్ సింగ్ చెంప దెబ్బ కొట్టిన ఘటనను ఇంకా ఎవరూ మర్చిపోలేదు. అలాంటిదే మరోమారు రిపీట్ అయింది. పించ్ హిట్టర్ రింకూ సింగ్ చెంప చెల్లుమనిపించాడు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్. అసలేం జరిగింది.. రింకూపై కుల్దీప్ ఎందుకు చేయిజేసుకున్నాడు.. అనేది ఇప్పుడు చూద్దాం..రింకూ షాక్..కోల్‌కతా నైట్ రైడర్స్-ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య మంగళవారం మ్యాచ్ జరిగింది. మ్యాచ్ తర్వాత డీసీ స్పిన్నర్ కుల్దీప్.. కేకేఆర్ బ్యాటర్ రింకూపై చేయిజేసుకున్నాడు. ఏకంగా రెండుమార్లు అతడి చెంపపై కొట్టాడు. ఆ టైమ్‌లో కుల్దీప్-రింకూతో పాటు పలువురు ఇతర ఆటగాళ్లు కూడా అక్కడే ఉన్నారు. అప్పటివరకు నవ్వుతూ కనిపించిన రింకూ ఊహించని ఘటనకు ఒకింత ఆశ్చర్యానికి గురయ్యాడు. అయితే లైట్ తీసుకొని మళ్లీ నవ్వుతుండగా.. కుల్దీప్ మళ్లీ చేయిజేసుకోవడంతో రింకూ అసహనానికి గురైనట్లు ఆ విజువల్స్‌లో కనిపించింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. దీంతో కుల్దీప్ మీద నెటిజన్స్ సీరియస్ అవుతున్నారు.బ్యాన్ తప్పదా..కుల్దీప్‌ను బ్యాన్ చేయాలని సోషల్ మీడియాలో కొందరు నెటిజన్స్ డిమాండ్ చేస్తున్నారు. అది ఫ్రెండ్లీగా కొట్టినట్లు అనిపించట్లేదని, అహంకారంతోనే ఇలాంటి పని చేశాడని ఆరోపిస్తున్నారు. ఇది చెత్త ప్రవర్తన అని.. సీనియర్ స్పిన్నర్‌ను కొన్ని మ్యాచుల పాటు నిషేధించాలని అంటున్నారు. అప్పట్లో శ్రీశాంత్ మీద చేయిజేసుకున్నం దును భజ్జీని మిగతా టోర్నీతో పాటు 5 వన్డేల పాటు బీసీసీఐ బ్యాన్ చేసిందని గుర్తుచేస్తున్నారు.

# గబ్బర్ ఘాటు జవాబు..అఫ్రిదీ వ్యాఖ్యలపై ధావన్ దెబ్బకి దద్దరిలిన పాక్ లెజెండ్



**న్యూదిల్లీ-నవభూమి:** జమ్ము కశ్మీర్ పహల్గామ్ దాడి తర్వాత భారతదేశంలో ప్రజల ఆగ్రహం తారాస్థాయికి చేరుకుంది. ఈ క్రమంలో అనేక మంది దీనిపై స్పందిస్తున్నారు. ఇండియాలో ఉండి కూడా ఎవరైనా పాకిస్తాన్?కు మద్దతుగా మాట్లాడితే అనేక మంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు ఇటీవల కర్ణాటకలో పాకిస్తాన్ జిందాబాద్ అన్న వ్యక్తిని కొట్టి చంపేశారు. పాకిస్తాన్?పై ప్రజలు ఏ స్థాయిలో కోపంతో ఉన్నారో దీనిని బట్టి చూస్తే అర్థమవుతుంది.ఇదే సమయంలో పాకిస్తాన్ నుంచి కూడా పలువురు ప్రకటనలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే పాకిస్తాన్ మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రిది సోషల్ మీడియాలో భారత సైన్యాన్ని విమర్శిస్తూ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేశాడు. ఈ దాడి గురించి భారతదేశం రుజువు చూపించాలని, భారత సైన్యం అనేక మంది ప్రాణాలను తీస్తోందని ఆరోపించాడు. ఆయన ప్రకటనపై అనేక విమర్శలు వచ్చాయి.ఇదే సమయంలో భారత క్రికెటర్ శిఖర్ ధావన్ కూడా స్పందించారు. అనవసరమైన వ్యాఖ్యలు చేయడానికి బదులుగా, మీ దేశ పురోగతిపై దృష్టి పెట్టడం మంచిదని ధావన్ సూచించారు. ఆ క్రమంలో షాహిద్ అఫ్రిదిని ట్యాగ్ చేశాడు. ఇంకా వ్రాస్తూ భారత సైన్యం పట్ల మాకు చాలా గర్వంగా ఉందని, భారత మాతా కీ జై! జై హింద్!" అని పేర్కొన్నారు. పహల్గామ్ దాడికి సంబంధించి భారత క్రికెట్ జట్టు ఇప్పటికే సంతాపం తెలిపింది. ఈ దాడి నేపథ్యంలో అనేక మంది సంతాపం వ్యక్తం చేశారు.

నవక్రీడ

# నాకౌట్ ఆశలు ఆవిరి



**న్యూదిల్లీ-నవభూమి:** సుదీర్మన్ కప్ ఫైనల్స్‌లో నాకౌట్ ఆశలు సజీవంగా ఉండాలంటే కచ్చితంగా గెలవాల్సిన పోరులో భారత బ్యాడ్మింటన్ జట్టు నిరాశపరిచింది. గ్రూప్-డిలో భాగంగా మంగళవారం జరిగిన తమ రెండో పోరులో భారత్ 1-4తో పటిష్ట ఇండోనేసియా చేతిలో ఓటమిపాలైంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల/తనీషా జోడీ మాత్రమే గెలవగా.. సింగిల్స్‌లో స్టార్లు పీవీ సింధు, ప్రణయ్, మహిళల డబుల్స్‌లో ప్రియ/శ్రుతి, పురుషుల డబుల్స్‌లో హరిహరన్/రూబన్ జంటలు ఓటమి పాలయ్యారు. దీంతో క్వార్టర్స్ చేరకుండానే భారత జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఆదివారం జరిగిన తమ తొలి పోరులో డెన్మార్క్ చేతిలో భారత్ ఓడిన సంగతి తెలిసిందే. దీంతో గ్రూప్‌లో తమకు ఆఖరిదైన ఇంగ్లండ్‌తో పోరు భారత్‌కు నామమాత్రం కానుంది.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**